www.jagritiweekly.com

సంపుటి : 75 సంచిక : 33 పుటలు : 52

# జాగృతి

కలి 5125 - శ్రీ శోభకృత్ జ్యేష్ఠ బహుళ విదియ

05-11 జూన్ 2023

వెల : ₹20/-



# నవ భారత స్వప్నసౌధం

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

75 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక

# ఎవరెస్ట్ విజయానికి 70 ఏళ్లు

హిమాలయాలలో సమున్నత శిఖరం ఎవరెస్ట్ మీద మనిషి మొదటిసారి కాలుమోపి మే **29, 2023** నాటికి **70** ఏళ్లు నిండాయి. చరిత్రలో దీనికి ప్రత్యేక స్థానం ఉంది. **1953**లో టెన్జింగ్ నార్గే, ఎడ్మండ్ హిల్లరీ ఆ ఘనత సాధించారు. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ప్రపంచం చూసిన సాహసోపేత చర్యగా అది నమోదైంది. ఈ సందర్భంగా నేపాల్‌లోని లుక్లా పట్టణంలో ఉన్న టెన్జింగ్ హిల్లరీ విమానాశ్రయం ఎదురుగా వారిద్దరి విగ్రహాలను మరొక ఇద్దరు పర్వతారోహకులు ఆవిష్కరించారు. ఆ ఇద్దరు టెన్జింగ్ నార్గే కుమారుడు జామ్లింగ్ నార్గే, హిల్లరీ కుమారుడు పీటర్ కావడం విశేషం. ఈ సందర్భంగా వారు ఒక నాణెం కూడా విడుదల చేశారు. ఇందుకోసం పీటర్ స్వదేశం న్యూజిలాండ్ నుంచి వచ్చారు. నాటి టెన్జింగ్, ఎడ్మండ్ వలెనే నేటి జామ్లింగ్, పీటర్ కూడా పర్వతారోహకులే. కానీ వేర్వేరుగా పర్వతారోహణ చేస్తున్నారు. వీరిద్దరూ తమ సంతానాన్ని కూడా పర్వతారోహణ పనిలో భాగస్వాములను చేయాలని కోరుకుంటున్నారు. నిజానికి జామ్లింగ్ సామాజిక వర్గం షెర్పాలు వృత్తిరీత్యా కూడా పర్వతారోహకులే. జామ్లింగ్ చిన్నకూతురు ఇప్పటికే తండ్రికి సహకరిస్తున్నది.

కానీ హిమాలయాలలో ఇటీవలి కాలంలో పెరిగిన ట్రెక్కింగ్ వల్ల నష్టాలే ఎక్కువ అని ఎవరెస్ట్‌ను అధిరోహించిన తొలి మహిళ, భారతీయ యువతి బచేంద్రీపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని నివారించడానికి పరిమితంగానే పర్వతారోహకులకు అనుమతులు ఇచ్చే విధానం పాటించాలని ఆమె సూచిస్తున్నారు. తన **18** మంది బృందంతో పాల్ **1993**లో ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించి విజయవంతంగా తిరిగి వచ్చారు. గతంలో అనుభవజ్ఞులను మాత్రమే అనుమతించేవారని, ఇప్పుడు ప్యాకేజీ సంప్రదాయం వచ్చి నలభయ్ లేదా యాభయ్ వేల డాలర్లు ఖర్చు చేసే సామర్థ్యం ఉన్నవారంతా కూడా హిమాలయాలను అధిరోహించడానికి వస్తున్నారని ఆమె చెప్పారు. అనుభవం లేకపోవడం వల్ల ఇటీవలి కాలంలో చావులు కూడా పెరిగాయని అన్నారు. పర్వతారోహణకు చెల్లించే రుసుముతో నేపాల్‌కు ఏటా ఐదు మిలియన్ డాలర్ల వరకు ఆదాయం చేకూరుతున్నదని పాల్ వెల్లడించారు. గతంలో కొద్దిమంది మాత్రమే పర్వతారోహణకు ఉత్సాహం చూపేవారని, ఇప్పుడు అదొక వెర్రిగా తయారైందని కూడా ఆమె విమర్శించారు. ఇంకొక నాలుగు రోజులలోనే పర్వతారోహణ ప్రారంభం కాబోతుండగా అప్పుడు బూట్లు ఎలా వేసుకోవాలో నేర్చుకుంటున్నవారిని చూసి ఒకసారి నిర్ఘాంతపోయానని, ఏటా **600** మంది వరకు హిమాలయాలకు వస్తున్నారని ఆమె చెప్పారు. గతంలో ఎవరెస్ట్ ఎక్కడానికి రెండు మాసాల వరకు సమయం పట్టేది.


టెన్జింగ్, ఎడ్మండ్


బచేంద్రీపాల్

ప్రత్యేక వ్యాసం **26** పుటలో..

ఆసక్తి కలిగించే విశ్లేషణలు.. జాగృతపరిచే కథనాలు..
చైతన్యం నింపే వాస్తవాలు.. స్ఫూర్తిని నింపే రచనలతో
ఇపుడు జాగృతి వారపత్రిక మరింత కొత్తగా మీ ముందుకు వస్తున్నది.




రండి..
జాతీయభావాల వేదిక
జాగృతి చందాదారులుగా
చేరుదాం.. చేర్పిద్దాం!

జాగృతి
1948-2022

ఒక సంవత్సర చందా
రూ.850/-

విడి ప్రతి
రూ.20/-

ఐదు సంవత్సరాల చందా
రూ.4000/-

జాగృతి చందాను ఆన్‌లైన్‌లో మీ మొబైల్ నుంచి చెల్లించడానికి
ఇక్కడ ఉన్న క్యు.ఆర్. కోడ్‌లను
గూగుల్ సెర్చ్‌బార్‌లో ఉండే గూగుల్ లెన్స్‌తో స్కాన్ చేయండి.
లేదా క్రిందనున్న లింక్‌లను ఉపయోగించండి.

ఒక సంవత్సర చందా రూ.850/-
http://payit.cc/S18970

**Jagriti Bank A/c details :**
Jagriti Prakashan Trust,
A/c No.920010061405325,
Axis Bank, Kothapet Branch, Hyderabad.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

ఐదు సంవత్సరాల చందా రూ.4000/-
http://payit.cc/S18973

3-4-228/4/1, Kachiguda, Hyderabad-500027.
Ph : 040-27561453, 9959997013. email : jagritiweeklysub@gmail.com

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. And published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.**

జి. తుకారాం సర్క్యులేషన్ మేనేజర్ 040-27561453/9959997013

## జాగృతి చందా – సూచనలు

**5 సం॥ల చందా రూ.4000, సంవత్సర చందా రూ.850, విడి ప్రతి రూ.20**

- ✦ అడ్రసులో పేరు, ఇంటి నెం., గ్రామం, మండలం, జిల్లా, పిన్‌కోడ్, మొబైల్ నెం. సమగ్రంగా ఉండాలి. లేకుంటే కంప్యూటర్ ఆమోదించదు.
- ✦ తాత్కాలిక రసీదు చేరిన 15 రోజుల తర్వాత చందా నెం., ప్రారంభ తేది వివరాలు మీకు ఎస్.ఎం.ఎస్. చేస్తాం. ఆ వెంటనే సంచిక కూడా అందుతుంది. మీరు చందా నెం. నోట్ చేసుకోవాలి.
- ✦ పత్రిక అందకపోతే వెంటనే సంప్రదించగలరు. చిరునామా మారితే కార్యాలయానికి విధిగా తెలపండి.

**చందా కట్టించే వారికి సూచనలు :**

- ✦ చందాలు వసూలు చేసి పంపేవారు తమ పూర్తిపేరు, సెల్ నెం. రాయాలి.
- ✦ రశీదుపై చందాదారుని పూర్తి చిరునామా, పిన్‌కోడ్, సెల్ నెం., ఈమెయిల్ ఉండాలి. వివరాలు jagritiweeklysub@gmail.comకు మెయిల్ చేయాలి.
- ✦ ఆన్‌లైన్/చెక్ ద్వారా కూడా చెల్లించవచ్చు. డబ్బు పంపాక 040-27561453/ 9959997013 నంబర్లకు తెలియజేయాలి.
- ✦ మరిన్ని వివరాలకు చందాపుస్తకంలో మొదటి రసీదు వెనుక చూడగలరు.

**చందా పంపవలసిన చిరునామా :**

- ✦ 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-500 027.

**జాగృతి బ్యాంకు ఖాతా వివరాలు :**

- ✦ **A/c Name & No. Jagriti Prakashan Trust, 92001006140 5325, Axis Bank, Kothapet Branch. IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**
- ✦ చెక్కు, డిడిపై Jagriti Prakashan Trust అని ఆంగ్లంలో రాయాలి.

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)**

| | |
|---|---|
| కె. దుర్గారెడ్డి | అసోసియేట్ ఎడిటర్ |
| సబ్ ఎడిటర్ | 9959991304 |

డిజైనర్ : సిహెచ్. కుమార్

ఎన్నికలు జరగబోయే రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చే హామీలు దేశ ప్రజలను జడిపించడం ఖాయం. ఆ హామీలు గుప్పించే ఉత్సాహంలో నేతలు దేశంలో కోర్టులు ఉంటాయన్న సంగతి కూడా మరచిపోతున్నారు. కారాగారాల తాళాల గుత్తులు వారి జేబులో ఉన్నట్టే మాట్లాడుతున్నారు. దేనినైనా నిషేధిస్తాం, ఎవరినైనా ఊచలు లెక్కించేటట్టు చేయగలం అన్న ధీమా ఆ పార్టీలో బాగా ఊరినట్టుంది. ఇక తాము ఏం చెప్పినా, ఎలాంటి ఆరోపణ చేసినా ఈ వెర్రిప్రజలు నమ్మక ఏం చేస్తారు అన్న ధీమా ఆ పార్టీకి ఆది నుంచి ఉన్నదే. విజయాలకీ, అధికార అందలాలకీ మరీ కరవాచిపోయి ఉన్న తరుణంలో హామీల తోక పట్టుకుని ఎన్నికల వైతరుణులను అలవోకగా దాటవచ్చునన్న నమ్మకం కుదిరింది కాంగ్రెస్ పార్టీకి. కర్ణాటక శాసనసభ ఎన్నికల ఫలితాలు ఇచ్చిన మత్తు అలాంటిదే మరి. మేం అధికారంలోకి వస్తే బజ్రంగ్‌దళ్‌ను నిషేధిస్తామంటూ ఎన్నికల మేనిఫెస్టోలోనే కన్నడ కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అలాంటిది ఒక్క బజ్రంగ్‌దళ్ కార్యకర్తలనే కాదు, దాని సోదర సంస్థ బీజేపీ కార్యకర్తలను కూడా జైల్లో కుక్కేస్తామని హామీ ఇస్తే ఇంకెన్ని ఓట్లు వెల్లువెత్తుతాయ్? ఇక వద్దు బాబోయ్ అనే దాకా ఓటర్లు కాంగ్రెస్ కాతాలోకి సీట్లు జమ చెయ్యరూ!

ఆయన ప్రస్తుతం రాజ్యసభ సభ్యుడు. అంటే పెద్దల సభికుడు. కానీ నోరు విప్పితే పిల్లలనూ విరగబడి నవ్వించగలిగే విదూషకత్వం ఆయన సొంతం. మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కూడా. వీటన్నిటికీ మించి ఆయనకు ఉన్న భారీ భుజకీర్తి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాహుల్‌గాంధీకి రాజకీయ గురువు. ఆయన పేరు దిగ్విజయ్ సింగ్. కాంగ్రెస్‌కి ఇంకా కాస్తో కూస్తో ఖ్యాతి ఏమైనా ఉంటే దానిని మూట గట్టి మురికి కాలవలోకి విసిరే పనిని దిగ్విజయంగా చేస్తున్న మొట్టమొదటి నాయకుడు ఇతడే. ఈయన ఇచ్చిన హామీ గురించే ఇక్కడ చర్చంతా. ఈ సంవత్సరాంతంలో జరగబోయే మధ్యప్రదేశ్ శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్‌కు కనుక అధికారం అప్పగిస్తే భారతీయ జనతాపార్టీ, బజ్రంగ్‌దళ్ కార్యకర్తల మీద దేశద్రోహం

**శాలివాహన 1945 శ్రీ శోభకృత్ జ్యేష్ఠ బహుళ విదియ**

### లోపలి పేజీలలో...



ముఖపత్ర కథనం

**నవ భారత స్వప్నసౌధం**

6లో

జాతీయం

**లోకం కంటి ముందు కశ్మీరం**



13లో



ధారావాహిక నవల

**మహా సంకల్పం**

– చంద్రశేఖర ఆజాద్

20లో

# జాగృతి

## సంపాదకీయం

నేరం కింద కేసులు పెట్టేస్తాడటాయన. తరువాత జైళ్లకి పంపుతాడట. పాకిస్తాన్ గూఢచారి సంస్థ ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్‌కు వీళ్లంతా కూడబలుక్కుని మరీ దేశంలో గూఢచర్యంలో సహకరిస్తున్నారట. మే 27వ తేదీన ఖాండ్వా అనేచోట విలేకరులు అడ్డంగా దొరికిపోయారు పాపం. వాళ్లకే ఇవన్నీ చెప్పారు. సరే, ఆ గూఢచర్యం కేసు వివరాలు కాస్త చెబుతారా అంటే మాత్రం డిగ్గీరాజాకి నోరు పెగల్లేదు. ఇంకొక విషయం కూడా ఆయన జాతికి వివరించడం మరిచారు. ఈ గూఢచర్యం ఆరోపణతో కేవలం మధ్యప్రదేశ్ బీజేపీ, బజ్రంగ్‌దళ్ కార్యకర్తల

# వినాశకాలే విపరీత బుద్ధిః

మీద మాత్రమే కేసులు బనాయిస్తారా? లేక యావత్ భారతదేశంలో ఉన్న ఆ సంస్థల కార్యకర్తలకు కూడా ఇందులో అరెస్టయ్యే అవకాశం ఇస్తారో ముదిమి లక్షణంతోనే కాబోలు సెలవివ్వలేదు. అవినీతి కేసులు ఎలాగూ తిరగతోడతాడట డిగ్గీరాజా. దానికి అదనంగా గూఢచర్యం కేసులు కూడా బనాయిస్తారన్నమాట. ఈ లెక్కన చూస్తే గురుశిష్యుల లెక్క సరిపోతుంది. రాహుల్ గాంధీ మొన్ననే తమ పార్టీ మధ్యప్రదేశ్‌లో 150 స్థానాలు గెలవడం ఖాయమన్నారు. ఈ నమ్మకానికి పునాది ఏమిటి? కర్ణాటకలో కాంగ్రెస్‌కి 136 సీట్లు ఇచ్చారు. కాబట్టి మధ్యప్రదేశ్‌లో 150 సీట్లు ఇస్తారన్నదే ఆయన ఫిలాసఫీ. ఎక్కడో తర్కం తుంగలోకి పోయిందని అనిపించినా, డిగ్గీ గురువర్యుల హామీలోకి మళ్లీ తొంగి చూస్తే విషయం కరతలామలకమవుతుంది. బజ్రంగదళ్ నిషేధం అన్న ఒక్క మాటకే కర్ణాటకలో 136 సీట్లు రాలితే, బజ్రంగ్‌దళ్‌తో పాటు బీజేపీని కూడా జమిలిగా అణచేస్తామని చెబితే మధ్యప్రదేశ్ ఓటర్లు మారు మాట్లాడకుండా 150 సీట్లు కుమ్మరిస్తారన్నదే కాంగ్రెస్ నేతల అంతరంగం.

డిగ్గీ దిగులేమిటో, ఎందుకో అర్థం చేసుకోవచ్చు. మధ్యలో 15 మాసాలు మినహాయిస్తే 2003 నుంచి ఇప్పటి కాదా మధ్యప్రదేశ్‌లో బీజేపీయే అధికారంలో ఉన్నది. ఇప్పుడు కర్ణాటక ఫార్ములాను అనుసరించి కాషాయ పరివారం మొత్తాన్ని కారాగారాలలోకి తోసేసి తాళాలు వేస్తాం అని హామీ ఇస్తే ఈసారైనా అధికార ప్రాప్తి సాధ్యమవుతుందన్న దింపుడుకళ్లం ఆశ డిగ్గీలో తళతళలాడుతున్నది. కానీ, కాంగ్రెస్ హామీలు ఇస్తుంది గాని, వాటిని అమలు చేయడం మరచిపోతుందని తెలియదా అంటున్నారు బీజేపీ వారు. రుణాల రద్దు, నిరుద్యోగ భృతి అంటూ గతంలోనే హామీ ఇచ్చిన కాంగ్రెస్ తరువాత ఏం చేసిందో ప్రజలు మరచిపోలేదని గుర్తు చేస్తోంది కమలదళం.

కర్ణాటకలో హామీలతో పాటు, ఓటరు మహాశయులలో కాంగ్రెస్ నవ చైతన్యాన్ని కూడా ధారాళంగా నింపేసింది. ఆ చైతన్యం ఎంతవరకు పోయిందంటే ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలులోకి తెచ్చేదాకా జనం ఆగడం లేదు. ప్రభుత్వాదేశాలు, అధికారిక ప్రకటనలు వెలువడే దాకా ఆ చైతన్యం ఆగేటట్టు లేదు. కరెంటు మీటర్ రీడింగ్‌కి వచ్చిన వారి చెంపలు పగలగొడుతున్నారు. బస్సులో టిక్కెట్టు అడిగితే మహిళామణులు కస్సుమని లేస్తున్నారు. బజ్రంగ్‌దళ్ నిషేధం ఎప్పుడు? హిజాబ్ మీద నిషేధం తొలగింపు ఎప్పుడు అంటూ నిలదీయగలిగే ఓటర్లు ఇంకా ఎందుకు వేచి ఉన్నారో అంతు పట్టడం లేదు. వాళ్ల చురుకుదనం కూడా మేల్కొంటే కథ రంజుగా మారిపోతుంది. డిగ్గీరాజా! బజ్రంగ్‌దళ్‌నూ, బీజేపీనీ బంధించగలవా? అంత దమ్ముందా? ఆర్ఎస్ఎస్, బీజేపీ, వీహెచ్‌పీ, బజ్రంగ్‌దళ్ ఈ మట్టి నుంచి జనించాయి. ఈ మట్టి వాసన వేస్తాయి. వీటిని ముట్టుకుంటే ఏమౌతుంది? కర్ణాటక కమలదళ అధ్యక్షుడు చెప్పలేదా? నువ్వు వినలేదా? పోనీ ఇప్పుడు విను! వాటి జోలికొస్తే కాంగ్రెస్ బూడిదైపోతుంది. వినాశకాలే విపరీత బుద్ధిః ★



అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్



32లో

కథ

**అవ్వా... బువ్వ పెట్టవే!**

– వేణు మరిదు




హంగూ ఆర్భాటంతో ప్రచారం (తెలంగాణ) – 16

సివిల్స్ 'మణుల'కు జయహో! (మహిళ) – 24

మంచుకోట మాయమైపోకూడదు (ప్రత్యేక వ్యాసం) – 26

మతం మారినవారు మళ్లీ హిందూధర్మంలోకి రావాలి! – 28

రజాకారుల చెర వీడిన రంగాచారి (అమృతోత్సవాలు) – 30

కశ్మీర్‌ను నెత్తుటిలో నానుస్తున్న ఐరాస (అంతర్జాతీయం) – 37

ఐపీఎల్ –16లో చెన్నై 'సూపర్' షో! (క్రీడ) – 43

'ఆదిపురుష్' పైనే ఆశలన్నీ! (సినిమా) – 50

# నవ భారత



ఇది కేవలం ఒక భవనం కాదు. ఆకృతి దాల్చిన స్వాతంత్ర్య సమరయోధుల స్వప్నం. పురోగమించే భావి భారత్ కోసం తీర్మానాలను రచించే సమున్నత వేదిక. అభివృద్ధి చెందిన రేపటి భారతావనిని దర్శించే సభ. పార్లమెంట్ కొత్త భవనం పరాయి పాలన, వలస పాలనలకు తుది వాక్యం. అందుకే  కొత్త భవనం జాతికి



# స్వప్నసౌధం

అంకితమైన ఈ మే 28 చరిత్రాత్మక దినం. ఇది వర్తమాన భారత రాజకీయ సంకల్పానికి గుర్తు. భారతీయుల దృఢశక్తికి నిదర్శనం. మన ప్రాచీన, ఆధునిక నిర్మాణ శైలుల కలయిక. మే 28 చరిత్రకు సాక్ష్యంగా నిలిచింది. సనాతన ధర్మం ఉట్టిపడేలా, అత్యాధునిక హంగులతో నిర్మించిన పార్లమెంట్ కొత్త భవన ప్రారంభోత్సవం ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా జరిగి దేశ ప్రజలకు కొత్త దృష్టిని నింపింది.









'కొత్త పార్లమెంటు భవనం ప్రతి భారతీయుడిని గర్వపడేలా చేస్తుంది: అందుకే ఈ వీడియోను చూసిన తర్వాత మీ భావాలను వీడియో ద్వారా షేర్ చేయండి' అని ప్రారంభోత్సవానికి ముందే ప్రధాని మోదీ దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. సామాజిక మాధ్యమాల్లో దీనికి మంచి స్పందన వచ్చింది.

విజయాలనే నమ్ముకుంటున్న వ్యక్తి మోదీ. విజయ సాధనకు తొలి మెట్టు విజయం మీద నమ్మకం కలిగి ఉండడమే అంటూ ఆయన ఈ సందర్భంగా ఇచ్చిన సందేశం కూడా ప్రజలను ఆలోచింపచేసింది. రెండవ భాగం కార్యక్రమంలో ఆయన ఎంపీలు, అతిథులు, ముఖ్యులను ఉద్దేశించి కొత్త భవనంలోనే అద్భుతంగా ప్రసంగించారు. దేశ ప్రగతిలో కొన్ని అంశాలు అజరామరంగా నిలుస్తాయంటూ ఆ ప్రసంగం ప్రారంభమైంది. ఇది కేవలం ఒక భవనం కాదు.. 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలకు ప్రతీక అని అభివర్ణించారు. స్వాతంత్ర్య వీరుల కలల సాకారానికి కొత్త భవనం వేదికగా నిలుస్తుందన్నారు. భారత్ కొత్త లక్ష్యాలను ఎంచుకుందని కొత్త ఆశలు.. కొంగొత్త లక్ష్యాలతో దేశం పురోగమిస్తోందన్నారు. ప్రపంచం మొత్తం భారత్ వైపు ఆశగా చూస్తోందని చెప్పారు. భారత్ ప్రజాస్వామ్య దేశమే కాదు.. ప్రజాస్వామ్యానికి జనని అని తెలిపారు. ప్రజాస్వామ్యంలో అభివృద్ధి అనేది ఎక్కడా ఆగిపోకూడదని, అది ముందుకెళ్తూనే ఉండాలని చెప్పారు. ఆజాదీ కా అమృతకాలం.. దేశానికి కొత్త దిశను నిర్దేశించే కాలం అని తెలిపారు.




కొత్త భారతావనికి ఆజాదీ కా అమృతకాలం మార్గం కావాలన్నారు. 21వ శతాబ్దంలో భారత్ ఎన్నో లక్ష్యాలను నిర్దేశించుకుందన్నారు. దేశం బానిస వాసనలను వదిలిపెట్టి ముందుకెళ్తోందని అన్నారు. పాత పార్లమెంట్ భవనంలో అనేక ఇక్కట్లు ఎదురయ్యేవి.. కనీసం కూర్చోవడానికే కాదు.. సాంకేతికంగానూ అనేక సమస్యలు వచ్చేవని గుర్తు చేసుకున్నారు మోదీ.

నూతన పార్లమెంట్ భవనం ప్రధాన ద్వారం నుంచి లోనికి ప్రవేశించిన ప్రధాని మోదీ.. స్పీకర్ ఓం బిర్లా ఆధ్వర్యంలో కొత్త పార్లమెంట్ భవనాన్ని జాతికి అంకితమిచ్చారు. భవనం మొదటిదశ ప్రారంభోత్సవంలో ప్రధాని ప్రత్యేక పూజలు నిర్వహించారు. లోక్‌సభలో సెంగోల్‌ను ప్రతిష్ఠించారు. ఆ తర్వాత పార్లమెంటు భవన నిర్మాణ కార్మికులను సత్కరించి వారికి జ్ఞాపికలు అందజేశారు.

కొత్త పార్లమెంట్ సిద్ధమైందని, ఇది ఆత్మనిర్భర్ భారత్‌కి ప్రతీకగా నిలుస్తుందని గతవారం లోక్‌సభ ఓ ప్రకటన చేసింది. ఈ నిర్మాణానికి ప్రధాని మోదీ 2020 డిసెంబర్ 10వ తేదీన శంకుస్థాపన చేశారు.

# న్యాయదండమా! మోదీ



అది చోళులు, ఇతర ప్రాచీన భారత పాలకుల న్యాయదండం కావచ్చు. కానీ ప్రతిపక్షాలు చేసిన నాటువైద్యంలో న్యాయదండమల్లా ప్రధాని మోదీ చేతిలో మంత్రదండంగా జన్మనెత్తింది. దాని పేరే సెంగోల్. పార్లమెంట్ కొత్త భవన విశేషాలన్నిటి కంటే ఎక్కువ ప్రాచుర్యానికి నోచుకున్న వస్తువు. ఎంతో కళాత్మకంగా తయారు చేసిన ఈ దండం వెనుక పెద్ద చరిత్ర ఉంది. అందులో కాస్త కూడా తెలియ కుండా కాంగ్రెస్, వామపక్ష మేధావులు కొందరు దారుణంగా మాట్లాడారు. దానిని మౌంట్‌బాటెన్‌కు తరువాత నెహ్రూకు అప్పగించారని ఎందరు చెప్పినా కాంగ్రెస్ పెద్దలు వినలేదు. అలాంటి వస్తువును నెహ్రూ తాకడానికి కూడా ఇష్టపడి ఉండేవారు కాదని ఒక టీవీ చర్చలో ఒక ఎరుపు మేధావు వాక్రుచ్చడం కొసమెరుపు. చివరకు ఇందుకు సంబంధించి 'టైమ్' పత్రికలో వచ్చిన పెద్ద వార్త దేశం ముందుకు వచ్చింది. ఆ పార్టీ మౌఢ్యం, వెర్రితనం బయటపడ్డాయి. తరువాత అధీనముల నుంచి వచ్చిన సాధువులతో బ్రాహ్మణ వాదానికి పెద్ద పీట వేశారని ఉత్తరప్రదేశ్ ఎస్‌పీ నాయకుడు స్వామి ప్రసాద్‌మౌర్య వ్యాఖ్యానించి ఈ దేశంలోనే అతి పెద్ద మూర్ఖుడిగా నిలిచిపోయారు. ప్రధాని నివాసానికీ, తరువాత పార్లమెంట్ కొత్త భవనంలోకీ ప్రవేశించిన అధీనముల లేదా మఠాల అధిపతులంతా ఓబీసీ వర్గీయులే. వారెవరూ బ్రాహ్మణ వర్గ సాధుసంతులు కానేకారు. సెంగోల్ చరిత్ర గురించి ప్రఖ్యాత పత్రికా రచయిత, 'తుగ్లక్' పత్రిక సంపాదకుడు ఎస్. గురుమూర్తి ప్రచురించారు. దానిని ప్రముఖ నర్తకి పద్మా సుబ్రహ్మణ్యం ప్రధాని కార్యాలయానికి తెలియచేశారు. దీనితో కదలిక వచ్చింది. బ్రిటిష్

స్వాతంత్ర్యోద్యమంలో వినాయక్ సావర్కర్ పాత్ర బహుముఖమైనది. చరిత్రపుటలలో మాత్రం దానికి చోటు లేదు. దీనికి తోడు కాంగ్రెస్‌లోని అంగుష్టమాత్రులు ఆయనను విమర్శిస్తుంటారు. సావర్కర్ భారత జాతికి ఎప్పటికీ స్ఫూర్తి ప్రదాతగానే ఉంటారు. అందుకే ఆయన జయంతి (మే 28)కే మోదీ భారత పార్లమెంట్ కొత్త భవనాన్ని జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా మోదీ సహా అంతా ఆ ధన్యజీవికి నివాళి ఘటించారు.



కొవిడ్ కారణంగా పనులు ఆలస్యమయ్యాయి. 2021 జనవరిలో నిర్మాణం మొదలైంది. అహ్మదాబాద్‌కి చెందిన హెచ్‌సీపీ డిజైన్ అండ్ ప్లానింగ్ అండ్ మేనేజిమెంటు దీనిని డిజైన్ చేసింది. ఆర్కిటెక్ట్ బిమాల్ పటేల్ దీన్ని డిజైన్ చేశారు. ప్రస్తుతం ఉన్న పార్లమెంట్ పక్కనే టాటా ప్రాజెక్ట్సు ఈ నిర్మాణాన్ని చేసింది.

పాత పార్లమెంట్‌లో లోక్‌సభలో 543 మంది, రాజ్యసభలో 250 మంది కూర్చునేందుకు వీలుండేది. కొత్త పార్లమెంట్‌లో దాని సామర్థ్యాన్ని పెంచారు. 888 మంది లోక్‌సభలో, 300 మంది రాజ్యసభలో కూర్చునేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. కొత్త పార్లమెంట్ భవనాన్ని 64,500 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మించారు. పాత భవనం డయామీటర్ 560 అడుగులు. అది కేవలం 24,281 చదరపు మీటర్ల విస్తీర్ణంలోనే ఉంది. ఇప్పుడీ విస్తీర్ణాన్ని భారీగా పెంచారు. ప్రస్తుత పార్లమెంట్‌లో సెంట్రల్ హాల్ ఉంది. ఇందులోనే సమావేశాలు జరిగేవి. కొత్త పార్లమెంట్‌లో లోక్‌సభ ఛాంబర్‌లోనే సంయుక్త సమావేశాలను ఏర్పాటు చేసుకునే వీలు కల్పించారు. కొత్త పార్లమెంటులో కార్పెట్లు ప్రత్యేకంగా తయారు చేయించారు.

ఈ కార్యక్రమంలో 25 రాజకీయ పార్టీలు పాల్గొన్నాయి. ఎన్డీయే భాగస్వామ్య పార్టీలైన అన్నా డీఎంకే, అప్నాదళ్, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా, శివసేన షిండే వర్గం, ఎన్‌పీపీ, ఎన్‌పీఎఫ్ పార్టీలు ఇందులో భాగస్వాములయ్యాయి. ఏపీ ముఖ్యమంత్రి జగన్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. "సువిశాలమైన, అద్భుతమైన పార్లమెంట్ భవనాన్ని జాతికి అంకితం చేస్తున్నందుకు ప్రధాని నరేంద్ర మోదీకి అభినందనలు. అన్ని పార్టీలు రాజకీయాలకు అతీతంగా విభేదాలను పక్కన పెట్టి ఈ కార్యక్రమానికి హాజరు కావాలి" అని జగన్ ట్వీట్ చేయటం వివాదాస్పదమైంది. ప్రతిపక్షాలన్నీ ఆయనపైన విరుచుకుపడ్డాయి. టీడీపీ అధినేత ఈ కార్యక్రమాన్ని స్వాగతించారు. మహానాడు కార్యక్రమాల వల్ల ఆయన వ్యక్తిగతంగా హాజరుకాకపోయినా, టీడీపీ తరపున కనకమేడల ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ ప్రసంగం రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌కర్ తరపున అభినందన సందేశం. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము లిఖితపూర్వక సందేశాన్ని కూడా ఇదే సందర్భంగా సభలో వినిపించారు.. భవనం ప్రధాన ఆర్కిటెక్ట్ బిమల్ పటేల్, పారిశ్రామికవేత్త రతన్ టాటా, పలువురు సినీ, క్రీడా ప్రముఖులు కూడా పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య స్ఫూర్తిని ప్రదర్శించవలసిన సందర్భంలోనూ అవాకులు చెవాకులు పేలాయి. ప్రారంభోత్సవాన్ని రసాభాస చేయాలని కంకణం కట్టుకున్నట్టు వ్యవహరించిన విపక్షాలకు అడుగడుగునా అపకీర్తి, అపజయమే ఎదురయ్యాయి. వీరి వాదన వినకుండా కోర్టు ఛీకొట్టింది. సెంగోల్

# మంత్రదండమా?

వారు భారతీయులకు అధికారాన్ని (స్వాతంత్ర్యం) అప్పగిస్తూ.. ఈ న్యాయ దండాన్ని దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూకు అప్పగించారు. ఆగస్ట్ 14, 1947 రాత్రి 10.45 గంటల సమయంలో.. పండిట్ నెహ్రూ తమిళనాడులో బ్రిటిష్ వారి నుంచి అధికార బదలీకి ప్రతీకగా ఈ న్యాయదండాన్ని స్వీకరించారు. అనంతరం దీనిని అలహాబాద్ మ్యూజియంలోని నెహ్రూ గ్యాలరీలో ఉంచారు. పైగా అవమానకరమైన రీతిలో దీనిని వాకింగ్ స్టిక్‌గా పేర్కొన్నారు. ఇంతకాలం సెంగోల్‌ను మ్యూజియంలో ఉంచటంపై కేంద్ర హోంమంత్రి, బీజేపీ నాయకుడు అమిత్ షా కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పార్టీ భారతీయ సంప్రదాయాలను, సంస్కృతీ. సాంప్రదాయాలను ఎందుకు అంతగా ద్వేషిస్తోందని అమిత్ షా ప్రశ్నలు సంధించారు. తమ ప్రవర్తనపై పునరాలోచించాలని కాంగ్రెస్‌కు చురకలు వేశారు. పవిత్ర సెంగోల్ కర్తవ్యం, సేవలకు ప్రతీక అని ప్రధాని మోదీ ప్రారంభోత్సవం సందర్భంగా వ్యాఖ్యానించారు. సెంగోల్ గురించి మీడియాలో అనేక కథనాలు వచ్చాయని.. మీడియా కథనాల ద్వారా సెంగోల్ గౌరవం మరింత పెరిగిందని ఆయన వ్యాఖ్యానించారు. సెంగోల్‌కు దక్కవలసిన స్థానం దక్కిందని తరువాత ప్రధాని కూడా వ్యాఖ్యానించారు.

సెంగోల్ గురించి లిఖితపూర్వకమైన ఆధారాలు లేవని కాంగ్రెస్ వాదించింది. దీనితో తాజాగా తిరువావడుతురై అధీనం కాంగ్రెస్ పార్టీ వ్యాఖ్యలను ఖండిస్తూ అధికారికంగా లేఖ విడుదల చేసింది. ఆ లేఖకు సంబంధించిన వివరాలివి.. ఒక రాజకీయ పార్టీకి చెందిన వ్యక్తులు రాజదండంపై చేసిన వ్యాఖ్యలు మమ్మల్ని బాధించాయి.

1947లో బ్రిటిషర్ల నుంచి భారత్‌కు బదిలీ అయిన అధికారాలకు ఈ రాజదండం చిహ్నం అబద్ధమని వాదిస్తున్నారు. దీనికి సంబంధించిన చాలా పత్రాలు ఉన్నాయి. రాజాజీ ఆహ్వానం మేరకే సెంగోల్‌ను మేము మౌంట్‌బాటెన్‌ను అప్పగించాం. తర్వాత మౌంట్ బాటెన్ ఈ దండాన్ని భారత తొలి



నెహ్రూ చేతిలో సెంగోల్

ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూకు అధికారిక మార్పిడిలో భాగంగా ఇచ్చారు. సెంగోల్ ముమ్మాటికీ స్వీయ పాలనకు చిహ్నమని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. ఇలాంటి ఎంతో చారిత్రక నేపథ్యం ఉన్న సెంగోల్ ప్రాముఖ్యతను తగ్గించాలని చూడడం చాలా బాధాకారం అని పేర్కొన్నారు. ★

# ఆ పాలనలో ప్రథమ పౌరునికి అధమ స్థానమే

చరిత్రను తాను మరచిపోవడం, ప్రజలు కూడా మరచిపోయేటట్టు చేయడం కాంగ్రెస్ పార్టీకి అత్యవసరం. దేశ విభజన, చైనా యుద్ధం, పంచశీల, అత్యవసర పరిస్థితి విధింపు, యూపీఏ 1,2 అవినీతి వ్యవహారాలు ఇవన్నీ ప్రజలు మరచిపోవాలి. అంతకంటే ముందు ప్రజలు మరచిపోయేటట్టు చేయడానికి తాము కూడా మరచిపోవాలి. ఇది కాంగ్రెస్ నాయకులకు రివాజు. గిరిజన మహిళ అయిన రాష్ట్రపతిని పార్లమెంట్ కొత్త భవనం ప్రారంభోత్సవానికి పిలవకుండా ప్రధాని నరేంద్ర మోదీ అవమానించారంటూ, ఈ అంశాన్ని ఒక రాజకీయ ఆయుధంగా మలుచుకోవాలని చూసింది కాంగ్రెస్ పార్టీ. ఈ కారణం చూపించి ఆ చారిత్రక కార్యక్రమాన్ని బహిష్కరించింది. కానీ రాష్ట్రపతి పదవికి రబ్బర్ స్టాంప్ అన్న పేరు రావడానికి కారణమే ఆ పార్టీ ప్రభుత్వాలు, వాటికి నాయకత్వం వహించిన ప్రధానులు, పార్టీ అధ్యక్షులు. మొదటి నుంచి కాంగ్రెస్ ప్రభుత్వాలు, ప్రధానంగా నెహ్రూ కుటుంబం రాష్ట్రపతులను ఏ తీరున చూసిందో ఈ నేపథ్యంలో చర్చకు వస్తున్నది. ఆది నుంచి కాంగ్రెస్ ప్రభుత్వాలలో ప్రథమ పౌరునిది అధమ స్థానమే.



నెహ్రూ– బాబూ రాజేంద్రప్రసాద్

ప్రథమ ప్రధాని జవాహర్‌లాల్ నెహ్రూకూ, ప్రథమ రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్‌కూ మధ్య వైరుధ్యాలు కాంగ్రెస్ మరచిపోయినా, లేదా మరచిపోయినట్టు నటిస్తున్నా దేశ ప్రజలు మాత్రం మరచిపోలేదు. ఆ విషయాలేవీ చరిత్ర నుంచి తొలగిపోలేదు. అసలు రాజెన్‌బాబు రాష్ట్రపతి కావడమే నెహ్రూకు ఇష్టం ఉండేది కాదు. పటేల్, రాజెన్‌బాబు, నెహ్రూ మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలలో ఇవన్నీ సుస్పష్టం. ఇందుకు మొదటి కారణం– రాజెన్‌బాబు పూర్తిగా స్వతంత్ర భావాలు కలిగినవారు. నెహ్రూ ఆడమన్నట్టు ఆడేటంత బలహీన మనస్తత్వం కలిగినవారు కాదు. హిందూ జీవన విధానం మీద రాజెన్‌బాబుకు స్పష్టమైన అభిప్రాయాలు ఉన్నాయి. అవన్నీ సనాతనమైన సాంస్కృతిక మూలాలు కలిగినవి. నెహ్రూకు ఈ అంశం అసలే నచ్చనిది. హిందూకోడ్ బిల్లు విషయంలో ప్రథమ ప్రధాని, రాష్ట్రపతికి మధ్య జరిగిన ఉత్తరప్రత్యుత్తరాలు దీనిని వెల్లడిస్తున్నాయి. అంతేకాదు, ఆ బిల్లు విషయంలో రాష్ట్రపతి ప్రాధాన్యాన్ని నెహ్రూ ఎంతగా తగ్గించాలని చూశారో కూడా తెలుస్తుంది. ఇంతకంటే ఎక్కువ ప్రాచుర్యం పొందిన చారిత్రక సత్యం–సోమనాథ్ ఆలయ జీర్ణోద్ధరణ తరువాత ప్రతిష్ఠ కార్యక్రమానికి రాజెన్‌బాబు వెళ్లకుండా నెహ్రూ శతవిధాలా ప్రయత్నం చేశారు.

నెహ్రూ కుమార్తె, దేశ మూడవ ప్రధాని ఇందిరాగాంధీ కూడా రాష్ట్రపతిని తక్కువ చేయడంలో



ఇందిర, నీలం సంజీవరెడ్డి, వీవీ గిరి

రెండాకులు ఎక్కువే చదివారు. 1969 రాష్ట్రపతి ఎన్నిక ఇందుకు గొప్ప ఉదాహరణ. పార్టీ కలసికట్టుగా నీలం సంజీవరెడ్డి అభ్యర్థిత్వాన్ని నిర్ధారించింది. కానీ తరువాత ఇందిర ఈ నిర్ణయంతో విభేదించి వీవీ గిరిని అభ్యర్థిగా నిలిపింది. పైగా 'అంతరాత్మ ప్రబోధం' మేరకు ఓటు వేయవలసిందిగా సొంత పార్టీ వారికే పిలుపు నిచ్చింది. ఫలితం వ్యవస్థా కాంగ్రెస్ ఏర్పాటు.



గురించి చేసిన వాదనలు శుద్ధ తప్పని తేలింది. రాజకీయాల్లో సిద్ధాంతపరంగా ఎన్ని విభేదాలయినా ఉండచ్చు. అంత మాత్రాన దేశ ప్రతిష్ఠను ఇనుమడించే ఇలాంటి కార్యక్రమాన్ని బహిష్కరిస్తారా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇంతకీ 20 రాజకీయ పక్షాలు పార్లమెంటు ప్రారంభోత్సవాన్ని బహిష్కరించటానికి కారణం ఉందా? పార్లమెంటు భవనం ప్రారంభోత్సవానికి తాము హాజరు కావడం లేదని 19 ప్రతిపక్ష పార్టీలు లేఖ రాశాయి. వాటితో పాటు బీఆర్ఎస్ పార్టీ కూడా ఈ కార్యక్రమాన్ని బహిష్కరించింది. పార్లమెంట్ భవనాన్ని ప్రధాని కాకుండా.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించాలని కాంగ్రెస్ సహా పలు విపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. అంతేగాక హిందుత్వ ప్రతిపాదకుడైన వినాయక్ దామోదర్ సావర్కర్ జయంతికి ఈ కార్యక్రమాన్ని చేపట్టటానికి ఎంచుకోవటాన్ని తప్పుపట్టాయి. ప్రారంభోత్సవాన్ని బహిష్కరిస్తున్నట్లు అధికారిక ప్రకటన విడుదల చేశాయి. రాష్ట్రపతి ముర్ముని పూర్తిగా పక్కనపెట్టి, పార్లమెంట్‌ను ప్రారంభించాలని ప్రధానమంత్రి తీసుకున్న నిర్ణయం ఘోరమైన అవమానమని, ఇది ప్రజాస్వామ్యంపై చేస్తున్న ప్రత్యక్ష దాడి అంటూ పేర్కొంటున్నాయి. కానీ బీజేపీ మాత్రం దీనిపై గట్టిగానే వాదిస్తోంది. అనవసరంగా రాజకీయం చేస్తున్నారని మండి పడింది. "ఈ ప్రతిపక్షాలన్నీ పార్లమెంట్ ప్రారంభోత్సవాన్ని బాయ్‌కాట్ చేశాయి. రేపు అయోధ్యలోని రామ మందిర నిర్మాణ ప్రారంభోత్సవాన్నీ బైకాట్ చేస్తారా..?" అని అసోం సీఎం, హిమంత బిశ్వ శర్మ ప్రశ్నించారు. భారత పార్లమెంటు భవన సముదాయాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో ప్రారంభోత్సవం చేయించక పోవడాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తప్పుబట్టారు. సావర్కర్ జయంతి రోజున ఈ భవనాన్ని ప్రారంభించడమంటే అది జాతి నేతలను పూర్తిగా అగౌరవపరచడమేనని కాంగ్రెస్ విమర్శించింది. ఇదంతా ఒక గొప్ప

సంజీవరెడ్డి ఓడిపోయారు. పీవీ నరసింహారావు తన 'లోపలిమనిషి' ఆత్మకథాత్మక నవలలో ఇచ్చిన అంచనా ప్రకారం, రాష్ట్రపతి ఎన్నిక పరిణామాలతోనే భారత నాయకత్వంలో ఐక్యత లేదని భ్రమించిన పాకిస్తాన్ యుద్ధానికి సిద్ధమయింది.

ఇక రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఉండగా రాష్ట్రపతి జ్ఞాని జైల్‌సింగ్‌తో తలెత్తిన విభేదాల గురించి పత్రికలలో పేజీలు కొద్దీ వచ్చింది. అసలు జైల్‌సింగ్ అంతరంగం ఏమిటో రాష్ట్రపతి భవన్ ఉద్యోగుల ద్వారా కూపీ లాగే పనిని ప్రముఖ కాంగ్రెస్ నాయకుడు, మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అర్జున్ సింగ్ చేపట్టారు. ఇందుకు సంబంధించిన కొన్ని సంభాషణలు కూడా బయటపడి, పత్రికలలో వెలువడినాయి. దీనితో రాష్ట్రపతిభవన్ ఇరకాటంలో


రాజీవ్ – జైల్‌సింగ్

పడింది. ఇలాంటి చాటుమాటు వ్యవహారం ఎందుకులే అనుకున్నారు మాజీ దౌత్యవేత్త కేసీ సింగ్. ఈయన నాడు రాష్ట్రపతికి ఉప కార్యదర్శి.




'ది ఇండియన్ ప్రెసిడెంట్: యాన్ ఇన్‌సైడర్ అకౌంట్ ఆఫ్ ది జైల్‌సింగ్ ఇయర్స్' అన్న తన రచనలో రాజీవ్–జైల్‌సింగ్ మధ్య పేచీల గురించి విపులంగా ఇచ్చారు. ప్రథమ ప్రధాని నాటి రాష్ట్రపతి మీద కోపంతో ఉన్నా, చాటున పళ్లు నూరినా మర్యాదలు మాత్రం పాటించేవారు. అదే కుటుంబం నుంచి రాజీవ్ మాత్రం అలాంటివేమీ పాటించలేదు అని కూడా కేసీ సింగ్ రాశారు.

ఇప్పుడు రాష్ట్రపతి ద్రౌపది ముర్మును పార్లమెంట్ నూతన భవన ప్రారంభోత్సవానికి పిలవలేదని తెగ వాపోతున్న కాంగ్రెస్ ఆమెను ఏకగ్రీవంగా ఎంపిక చేద్దామన్న సత్కార్యానికి ఏమీ సహకరించలేదు. పైగా అత్యంత తుంటరితనంగా లోక్‌సభలో ఆ పార్టీ నాయకుడు అధీర్‌రంజన్ రాష్ట్రపతి అంటూ అవమానకరంగా సంబోధించాడు. ముర్ము మీద యశ్వంత్ సిన్హాను పోటీ పెట్టారు. బీజేపీ ప్రభుత్వాలలో పనిచేసి, తృణమూల్ కాంగ్రెస్‌లో చేరినప్పటికీ యశ్వంత్ సిన్హా నామినేషన్ కార్యక్రమానికి స్వయంగా రాహుల్ హాజరయ్యారు. ఆయన దారుణంగా ఓడిపోతారని తెలిసి ఈ పని చేశారు. అలాగే జరిగింది. ఇప్పుడు మాత్రం ముర్ము మీద ఎక్కడలేని ఆపేక్షను ప్రదర్శిస్తున్నది కాంగ్రెస్. ★

త్యాగాన్ని అవహేళన చేయడమే. పార్లమెంటు భవనం అహంకారం అనే ఇటుకలతో నిర్మితం కాలేదని, రాజ్యాంగ విలువలతో నిర్మితమైందని రాహుల్ ట్వీట్ చేయడం వింతల్లోకెల్లా వింత కాదా! సావర్కర్ జయంతి రోజున పార్లమెంట్ కొత్త భవనం ప్రారంభించనుండడం గాంధీ, నెహ్రూ, పటేల్, బోస్ తదితరులందరినీ విస్మరించడమేనని కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేశ్ ట్వీట్ చేశారు. దేశానికి పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని అందించిన భారత రాజ్యాంగానికి 75 ఏళ్లు పూర్తవుతున్న నవంబర్ 26, 2023న ఈ కొత్త భవనాన్ని ప్రారంభిస్తే బాగుండేదని, అలా కాకుండా సావర్కర్ జయంతి రోజున ప్రారంభిస్తున్నారంటూ తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యుడు సుఖేందు శేఖర్ రే వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, ఆప్, శివసేన (ఉద్ధవ్ ఠాక్రే వర్గం), సమాజ్‌వాదీ పార్టీ, సీపీఐ, ఝార్ఖండ్ ముక్తి మోర్చా, కేరళ కాంగ్రెస్ (మణి), విడుదలై చిరుతైగళ్ కచ్చి, రాష్ట్రీయ లోక్ దళ్, జనతాదళ్(యు), ఎన్‌సీపీ, సీపీఎం, ఆర్‌జేడీ, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్, నేషనల్ కాన్ఫరెన్స్, ఆర్ఎస్‌పీ, ఎండీఎంకే మే 24న సంయుక్త ప్రకటనను విడుదల చేశాయి. ఇవే కాకుండా హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే ఏఐఎంఐఎం కూడా ఈ కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్లు చెప్పింది. ఈ మేరకు ఆ పార్టీ అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఒక వీడియో విడుదల చేశారు. కొత్త భవనాన్ని శవపేటికలా ఉందంటూ అవినీతి గడ్డికి కేరాఫ్ వంటి ఆర్‌జేడీ పెట్టిన ట్వీట్‌ను దేశ ప్రజలు అక్షరాలా అసహ్యించుకున్నమాట నిజం.



**డాక్టర్ పార్థసారథి చిరువోలు**
సీనియర్ జర్నలిస్ట్

విపక్షాల ప్రకటనపై బీజేపీ సహా ఎన్‌డీఏలోని 14 పార్టీలు స్పందించాయి. కొత్త పార్లమెంట్ ప్రారంభ కార్యక్రమాన్ని బహిష్కరించడం ద్వారా విపక్షాలు ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలను వదిలేస్తున్నాయని ఆరోపిస్తూ ఒక ప్రకటన విడుదల చేశాయి ఈ పార్టీలు. రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా విశాల దృక్పథంతో ఆలోచించి కార్యక్రమానికి హాజరు కావాలని ఆ ప్రకటనలో కోరాయి. బీజేపీ, శివసేన(ఏక్‌నాథ్ శిందే వర్గం), నేషనల్ పీపుల్స్ పార్టీ, నేషనల్ డెమొక్రటిక్ ప్రొగ్రెసివ్ పార్టీ, సిక్కిం క్రాంతికారీ మోర్చా, జననాయక్ జనతా పార్టీ, రాష్ట్రీయ లోక్ జనశక్తి పార్టీ, అప్నాదళ్ (సోనేలాల్ వర్గం), రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా–మహారాష్ట్ర, తమిళ్ మానిల కాంగ్రెస్, ఏఐఏడీఎంకే, ఐఎంకేఎంకే, ఏజేఎస్‌యూ–ఝార్ఖండ్, మిజో నేషనల్ ఫ్రంట్‌లు ఈ మేరకు ప్రకటించాయి. బీఎస్పీ అధినేత మాయావతి కూడా కొత్త పార్లమెంటు ప్రారంభాన్ని స్వాగతించారు. తనకు ఆహ్వానం పంపినందుకు కృతజ్ఞతలు అంటూ ఆమె ట్విటర్

వేదికగా తెలిపారు ముందే నిర్ణయమైన కొన్ని కార్యక్ర మాలలో పాల్గొనాల్సి ఉన్నందున తాను రాలేనని చెప్తూ అభినందనలు తెలిపారు. మాజీ ప్రధాని, జేడీఎస్ అధినేత దేవెగౌడ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

అన్నింటికీ సుప్రీం కోర్టును అడ్డం పెట్టడం ఇటీవల ప్రతిపక్షాలకు అలవాటుగా మారింది. ఇప్పుడూ అదే అస్త్రం ప్రయోగించారు. కానీ అది దారుణంగా బెడిసికొట్టింది. కొత్త పార్లమెంట్‌ని ప్రధాని మోదీ ప్రారంభించడాన్ని సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ని సుప్రీంకోర్టు తిరస్క రించింది. పార్లమెంట్‌ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ జయసుకీన్ అనే లాయర్ పిటిషన్ వేశారు. దీనిపై విచారించేందుకు సర్వోన్నత న్యాయస్థానం అంగీకరించలేదు. దానితో పాటు ఇలాంటి పిటిషన్ వేసినందుకు అసహనం వ్యక్తం చేసింది "ఇలాంటి పిటిషన్ వేసినందుకు మేమెందుకు మీకు ఫైన్ వేయకూడదు..?" అని ప్రశ్నించింది.

"రాజ్యాంగం ప్రకారం అధినేత రాష్ట్రపతి అవుతారు. అదే పరిపాలనా పరమైన విషయాల్లోకి వస్తే వాటికి చీఫ్ ప్రధాని మాత్రమే అవుతారు. ఇందులో విచారించాల్సినంత విషయం ఏమీ కనిపించడం లేదు. అందుకే పిటిషన్‌ని తిరస్కరి స్తున్నాం" అని స్పష్టంగా చెప్పింది. ఇది సుప్రీంకోర్టు కలగజేసుకోవాల్సిన విషయం కాదని స్పష్టం చేసింది. చిత్రం ఏమిటంటే దేశ అత్యున్నత న్యాయస్థానం ఇలాంటి తీర్పు ఇచ్చినా ప్రారంభోత్సవం పూర్తయిన తరువాత కొందరు ప్రతిపక్ష నేతలు అదే వాదనను కొనసాగించారు.

మొత్తం మీద జాతి యావత్తూ గర్వపడేలా కొత్త పార్లమెంటు భవనం ప్రారంభోత్సవం కార్యక్రమం ముగిసింది. మోదీ తొమ్మిదేళ్ల పాలనలో ఆయన కీర్తికిరీటంలో మరో కొత్త చేరికగా పార్లమెంటు ప్రారంభోత్సవాన్ని పేర్కొని తీరాలి.

ఇక రెండోదశ ప్రారంభోత్సవంలో ప్రత్యేక స్మారక పోస్టల్ స్టాంప్‌ను, 35 గ్రాముల రూ.75 నాణాన్ని విడుదల చేశారు. దీన్ని 50 శాతం వెండి, 40 శాతం రాగి, 5 శాతం నికెల్, 5 శాతం జింక్ మిశ్రమంతో తయారుచేశారు. ఇది 44 మిల్లీమీటర్ల వ్యాసంతో వృత్తాకారంలో ఉంటుంది.

ఈ రూ.75 నాణేంకు ఒకవైపు మధ్యలో అశోక స్తూపంపై ఉన్న సింహాలు కనిపిస్తాయి. ఈ జాతీయ చిహ్నానికి ఇరువైపుల దేవనాగరి లిపిలో భారత్ అని, ఇంగ్లిష్‌లో ఇండియా అని ఉంటుంది. దాని కింద సత్యమేవ జయతే అని రాసి ఉంది. దీని కింద రూపాయి గుర్తుతో నాణెం విలువను సూచిస్తూ 75 సంఖ్యను ముద్రించారు. మరోవైపు పార్లమెంట్ భవనం ఉంటుంది. దాని ఎగువన దేవనాగరి లిపిలో 'సనసద్ సానుకూల్' అని.. దిగువన 'పార్లమెంట్ కాంప్లెక్స్' అని ఆంగ్లంలో ముద్రించి ఉంటుంది. పార్లమెంట్ కాంప్లెక్స్ కింద 2023 అని రాసి ఉంటుంది. ఇంతకు ముందు కూడా ఈ రూ.75 నాణాన్ని విడుదల చేశారు. ఫుడ్ అండ్ అగ్రికల్చరల్ ఆర్గనైజేషన్ వజ్రోత్సవాలను పురస్కరించుకొని కేంద్రం ఈ నాణాన్ని రూపొందించింది. సాధారణ కరెన్సీ నోట్లు, నాణాల మాదిరిగా ఈ స్మారక నాణాలు వినియోగం కోసం జారీ చేసినవి కావు. వీటిని వెండి తదితర లోహాలతో తయారు చేయడం వల్ల వీటి విలువ చాలా ఎక్కువగా ఉంటుంది. అందువల్ల వీటిని కేవలం సేకరించడానికి తప్ప.. వినియోగానికి ఉపయోగించరు. మరోవైపు సాధారణ లోహంతో తయారు చేసిన స్మారక నాణాలు కొంతకాలం పాటు చలామణిలో ఉంటాయి.

2024లో మళ్లీ నరేంద్రమోదీనే ప్రధానిగా రావాలని మధురై అధీనం ప్రధాన పూజారి శ్రీ హరిహర దేశి స్వామి అన్నారు. పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవంలో సెంగోల్ (న్యాయ దండం)ను ప్రధానికి ఆయనే అందించారు. ఈ సందర్భంగా హరిహర దేశి స్వామి మాట్లాడుతూ.. ప్రధాని మోదీ ప్రపంచ స్థాయిలో ప్రశంసలు పొందిన నాయకుడని కొనియాడారు. ప్రపంచ నాయకులు మోదీని అభినందిస్తున్నందుకు అందరూ గర్వపడాలని చెప్పారు. ★



రాళ్లెత్తిన కూలీలకు ప్రధాని సన్మానం






# లోకం కంటి ముందు కశ్మీరం

**ఇటీవల (మే 22-24) శ్రీనగర్‌లో పర్యాటకంపై జరిగిన జి-20 సమావేశాన్ని ఏదో విధంగా అడ్డుకోవాలని పాకిస్తాన్ చేసిన అన్ని ప్రయత్నాలు విఫలమవడమే కాదు, మూడు రోజుల సమావేశం విజయవంతంగా నిర్వహించడం ద్వారా ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులు, విస్తరిస్తున్న పర్యాటక రంగాలను ప్రపంచ దేశాలకు భారత్ స్పష్టంగా తెలియజెప్పగలిగింది. 370 అధికరణాన్ని రద్దు చేసిన తర్వాత కేంద్రపాలిత ప్రాంతమైన జమ్ముకశ్మీర్‌లో జరిగిన మొట్టమొదటి అంతర్జాతీయ సమావేశం ఇది.**

పాకిస్తాన్, చైనాలకు కశ్మీర్‌లో శాంతి సుస్థిరతలు నెలకొనడం ఎంతమాత్రం ఇష్టం లేదు. సభ్యదేశాలను సమావేశంలో పాల్గొనకుండా దౌత్యమార్గాల్లో పాక్ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. (నిజానికి పాక్ జి-20 సభ్యురాలు కూడా కాదు.) మొత్తం 27 దేశాలకు చెందిన 59 మంది ప్రతినిధులు శ్రీనగర్‌లో నిర్వహించిన సమావేశంలో ఉత్సాహంగా పాల్గొనడమే ఇందుకు నిదర్శనం. ప్రపంచంలో అతిపెద్ద ముస్లిం జనాభా ఉన్న ఇండొనేసియా, యూఏఈ, బంగ్లాదేశ్‌లు పాల్గొనడం విశేషం. ఇండొనేసియా ఇస్లామిక్ గ్రూపు దేశాల్లో సభ్యురాలు కూడా! బంగ్లాదేశ్ హైకమిషనర్ ముస్తాఫిజుర్ రహమాన్‌తో పాటు యూఏఈకి చెందిన ఇద్దరు అధికారులు పాల్గొన్నారు. సౌదీ అరేబియా అనధికార ప్రతినిధులను పంపగా, టర్కీ, చైనాలు గైర్హాజరయ్యాయి. భారత్ అతిథులుగా ఆహ్వానించిన ఈజిప్ట్ నుంచి అనధికార ప్రతినిధులు హాజరుకాగా ఒమన్ తన ప్రతినిధులను పంపలేదు. ఈ సమావేశాన్ని ప్రపంచ మీడియా బాగా కవర్ చేసింది. దేశీయంగా, అంతర్జాతీయంగా మంచి కవరేజీ రావడం వల్ల రానున్న కాలంలో జమ్ము కశ్మీర్‌లో పర్యాటకం మరింత ఊపందుకునే అవకాశ మున్నదని అంచనా. జి-20 సమావేశం విజయ వంతమైన ఫలితాలు ఇప్పుడే కనిపిస్తున్నాయి కూడా. 370 అధికరణ ఎత్తివేసిన తర్వాత జమ్ముకశ్మీర్‌లో చోటుచేసుకున్న అభివృద్ధిని వివిధ దేశాల ప్రతినిధులు వీక్షించే అవకాశం కలిగిందని ఇటలీకి చెందిన ఫెడ్రికో గిలియానీ 'ఇన్‌సైడ్ ఓవర్' అనే న్యూస్ వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు. అంతేకాదు, దేశంలో విలీనం చేయడం వల్ల జమ్ముకశ్మీర్‌కు ఎంతో ప్రయోజనం కలిగిందన్నది స్పష్టమైందంటూ విశ్లేషించడం గమనార్హం. వాషింగ్టన్‌లోని అమెరికన్ ఎంటర్‌ప్రైజ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన మైఖేల్ రూబిన్ 'పాక్ ఆక్రమిత కశ్మీర్ జమాయితే ఇస్లామీ ఉగ్రవాదం వల్ల అణచివేతకు గురై, ప్రస్తుతం ఆర్థికంగా దయనీయస్థితిలో కొనసాగుతుంటే, భారత్ అధీనం లోని జమ్ముకశ్మీర్ ప్రజలు ఆత్మవిశ్వాసం, భవిష్యత్తు పట్ల ఆశ, స్వేచ్ఛలోని ఆనందాన్ని అనుభ విస్తున్నార' న్నారు. ఈయన పీఓకేలో, జమ్ముకశ్మీర్‌లో పర్యటించారు. కేలిఫోర్నియాలోని మిల్‌పిటాస్ నగర మేయర్ కార్మెన్ మోంటెనా జమ్ముకశ్మీర్ వ్యాపారాల్లో భాగస్వామ్యం కావడానికి సంసిద్ధత వ్యక్తం చేయడం కూడా జి-20 సమావేశం విజయవంతమైన ఫలితమే! జమ్ముకశ్మీర్‌కు చెందిన ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు ఫరూఖ్ వాణి కశ్మీర్‌లో అభివృద్ధి స్పష్టంగా

కనిపిస్తోందంటూ వ్యాఖ్యానించారు.

**వాస్తవాలు తెలుసుకుంటున్న ప్రపంచం**

370 అధికరణం రద్దుచేసిన తర్వాత భారత ప్రభుత్వం చేపట్టిన అనేక అభివృద్ధి చర్యలను అంతర్జాతీయ మీడియా పట్టించుకోలేదు. అమ్నెస్టీ ఇంటర్నేషనల్ సమయం దొరికినప్పుడల్లా జమ్ము కశ్మీర్ విషయంలో భారత్‌పై విషం చిమ్మేది. హింసాత్మక సంఘటనలు క్రమంగా తగ్గిపోవడం, గ్రామ స్థాయిలో క్రమంగా విస్తరిస్తున్న ప్రజాస్వామ్యం వాటికి పట్టలేదు. పాకిస్తాన్ వెన్నుదన్నుతోనే ఇక్కడి ఉగ్రవాదం పెచ్చరిల్లిందన్న వాస్తవం కూడా వాటి కళ్లకు కనిపించ లేదు. కేవలం సైద్ధాంతిక వైముఖ్యంతో జమ్ముకశ్మీర్ దుస్థితికి కారణం భారత్ మాత్రమేనని తప్పుడు విమర్శలు చేయడం నిజంగా ప్రమాదరకరం. ప్రస్తుత జి-20 సమావేశం విజయవంతం కావడంతో, వ్యాపార, వాణిజ్యాలకు జమ్ము కశ్మీర్ అత్యంత అనుకూలమన్న సందేశం ప్రపంచ దేశాలకు అందింది. ముఖ్యంగా ఇప్పటివరకు జరిగింది కేవలం తప్పుడు ప్రచారమన్న సంగతి కూడా ప్రపంచానికి సుస్పష్టమైంది. ఇప్పటికే కశ్మీర్‌లో ఊపందుకుంటున్న పర్యాటకం, వాణిజ్యాలకు జి-20 దేశాల సమావేశం మరింత చోదకశక్తిని అందించ గలదు.

**కశ్మీర్‌లోనే ఎందుకు?**

జి-20 సమావేశాలు సాధారణంగా జరిగేవే కదా.. దీనికి ఇంత ప్రచార ఆర్భాటం ఎందుకని కొందరు విమర్శించారు. శ్రీనగర్‌లో పర్యాటక రంగంపై వర్కింగ్ గ్రూప్ సదస్సును నిర్వహించడాన్ని కూడా తప్పు పడుతున్నారు. ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలున్నాయి. 2019 ముందు వరకూ అంతర్జాతీయ సమావేశాలు కశ్మీర్‌లో జరిగిన చరిత్ర లేదు. ప్రపంచంలోనే టాప్ 20 దేశాల శిఖరాగ్ర




సమావేశం కశ్మీర్‌లో జరగడం చాలా ప్రత్యేకం. జమ్ముకశ్మీర్ భారత్‌లో శాశ్వత అంతర్భాగం అని అంతర్జాతీయ ప్రపంచానికి చాటి చెప్పడానికే జి-20 సమావేశాలను ఇక్కడ నిర్వహించారు. జమ్ముకశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు తర్వాత అక్కడి పరిస్థితి గణనీయంగా మెరుగుపడ్డాయని ప్రపంచానికి చాటేందుకే ఈ సదస్సు నిర్వహించామని ప్రభుత్వ చెప్పింది. ఇన్నాళ్లు ఉగ్రవాదుల చెరలో బందీ అయిన సుందర కశ్మీరాన్ని ప్రపంచానికి చూపించేందుకు ప్రధాని మోదీ ఈ నిర్ణయం తీసుకున్నారు. పాకిస్తాన్, చైనాలు భారత్ మీద అమలు చేస్తున్న కుట్రలను ప్రపంచం ముందు ఉంచేందుకు ఆయన కశ్మీర్‌లోని శ్రీనగర్ ప్రాంతాన్ని వేదికగా ఎంపిక చేశారని సమాచారం. పాకిస్తాన్, చైనా కశ్మీర్‌పై ఎంత పనిగట్టుకొని దుష్ప్రచారం చేసినా భారత్ జి-20 సమావేశాన్ని కశ్మీర్‌లో నిర్వహించి ఆ దేశాల నోళ్లు మూయిస్తోంది. అంతర్జాతీయ సమాజం కూడా ఈ సమావేశంతో కశ్మీర్ భారత్‌లోనే అంతర్భాగం అని అంగీకరించినట్టు అయ్యింది. అందుకే ఈ సమావే శాన్ని భారత్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. జి-20 సమావేశం కోసం 60 మందికి పైగా విదేశీ ప్రతినిధులు హాజరయ్యారు. విదేశీ ప్రముఖులు కశ్మీర్ అందాలను తిలకించేలా ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. పర్యాటక, వాణిజ్య రంగాలపై ఈ సదస్సు సానుకూల ప్రభావం చూపుతుందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు.

**బుద్ధి మారని పాకిస్తాన్**

ఈ సదస్సును పాకిస్తాన్ బహిష్కరించగా, చైనా కూడా ఇదే బాట పట్టింది. వివాదాస్పద ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించడాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్టు ప్రకటించింది. తీవ్ర ఆర్థిక సంక్షోభం, అంతర్గత సమస్యలతో సతమతం అవుతున్నా పాకిస్తాన్ తన బుద్ధిని మార్చుకోవడం లేదు. జి-20 సందర్భంగా జమ్ముకశ్మీర్‌లో విధ్వంసం సృష్టించేందుకు ఉగ్రవాదులను సరిహద్దు దాటించే ప్రయత్నం చేసింది పాక్ సైన్యం. దీంతో భారత సరిహద్దు వెంబడి భద్రతా బలగాలు అప్రమత్తం అయ్యాయి. పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో ఉన్న

# సమస్య ఇప్పటిది కాదు!

1971 పాకిస్తాన్‌తో యుద్ధం తర్వాత భారత్-పాక్‌ల మధ్య సిమ్లా ఒప్పందం, 1972 జులై 2న రెండు దేశాల మధ్య సంతకాలు జరిగాయి. అప్పటి భారత ప్రధాని ఇందిరాగాంధీ, పాక్ అధ్యక్షుడు జుల్ఫికర్ అలీ భుట్టో దీనిపై సంతకాలు చేశారు. హిమాచల్ ప్రదేశ్ రాజధాని సిమ్లాలో ఈ ఒప్పందం జరగడం వల్ల ఇది సిమ్లా ఒప్పందంగా పేరు పడింది. దీని ప్రకారం భారత్, పాక్‌లు తమ సమస్యలను దౌత్యచర్చల ద్వారా పరిష్కరించుకోవాలి. ఐక్యరాజ్య సమితి సహా మరే ఇతర దేశ ప్రమేయాన్ని ఈ ఒప్పందం నిరోధిస్తోంది.

ఇరు దేశాలు కాల్పుల విరమణ ప్రదేశాన్ని 'నియంత్రణ రేఖ'గా గుర్తించడంతో, భారత్, పాకిస్తాన్‌లోని యునైటెడ్ నేషన్స్ మిలిటరీ అబ్జర్వర్ గ్రూప్ వల్ల ప్రయోజనం లేదని భారత్ వాదించడంలో సహేతుకత ఉంది. 1947లో భారత్-పాక్‌ల మధ్య జరిగిన యుద్ధంలో 'కాల్పుల విరమణ' రేఖవద్ద అతిక్రమణలు జరగకుండా ఉండేందుకు ఈ అబ్జర్వర్ గ్రూప్ ఏర్పాటుకు



రెండు దేశాల సైనిక ప్రతినిధులు 1949 జులై 27న ఒక ఒప్పందంపై సంతకాలు చేశారు. అయితే సిమ్లా ఒప్పందం నేపథ్యంలో 1948 నాటి ఐక్యరాజ్య సమితి 39వ తీర్మానానికి, ఏర్పాటైన ఈ గ్రూపునకు విలువ లేకుండా పోయింది. ద్వైపాక్షిక సమస్యలపై మధ్యవర్తి ప్రమేయాన్ని నిరోధించే సిమ్లా ఒప్పందంపై సంతకం చేసిన పాక్, ఇప్పుడు మళ్లీ ఐక్యరాజ్య సమితి తీర్మానాన్ని లేవనెత్తడం కేవలం దాని నక్కజిత్తుల వైఖరికి నిదర్శనం. ★

నీలం, జీలం, లీపా లోయల వెంట 10-20 మధ్య ఉగ్రవాద గ్రూపులు తిష్టవేసి అదును కోసం వేచి చూశాయి. అయితే ఈ పరిణామాలను భారత్ గమనించి, గట్టిగా తిప్పికొట్టింది.

జమ్ముకశ్మీర్‌లో అస్థిరతను, అభద్రతను పెంచేందుకు పాక్ కుయుక్తులు పన్నింది. జి-20 సమావేశం విజయవంతమైతే కశ్మీర్‌లో ఎలాంటి మానవ హక్కుల ఉల్లంఘన, అశాంతి లేదని అంత ర్జాతీయ సమాజానికి సందేశం వెళ్తుంది. అందుకే ఇది జరగకూడదని పాకిస్తాన్ భావించింది. ఇటీవల గోవాలో జరిగిన జి-7 సన్నాహక సమావేశానికి వచ్చిన పాకిస్తాన్ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో... జి-20 సమావేశాన్ని ఉద్దేశించి మనసులో ఉన్న అక్కసు బయటపెట్టాడు. అదును చూసి సమాధానం చెబుతామంటూ హెచ్చరించే విధంగా మాట్లాడాడు. దీంతో భారత్ మరింత అప్రమత్తమైంది.

**దాడుల్ని గట్టిగా తిప్పికొట్టిన భారత దళాలు**

పాకిస్తాన్ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో భారత్ పర్యటన ఖరారైన కొన్ని గంటల్లోనే జమ్ముకశ్మీర్‌లో పాక్ ప్రేరేపిత ఉగ్రమూకలు దారుణానికి పాల్పడ్డాయి. జి-20 టూరిజం వర్కింగ్ గ్రూప్ సమావేశాన్ని వ్యతిరేకించిన లష్కరే తాయిబా అనుబంధ సంస్థ పీపుల్స్ యాంటీ-ఫాసిస్ట్ ఫ్రంట్ (పీఏఎఫ్ఎఫ్) ఐదుగురు జవాన్లను పొట్టనబెట్టుకుంది. జమ్ముకశ్మీర్‌లోని పూంఛ్ ప్రాంతంలో రాష్ట్రీయ రైఫిల్స్ యూనిట్ (ఆర్ఆర్‌యూ) జవాన్లు ప్రయాణిస్తున్న ట్రక్కుపై మెరుపుదాడి చేసింది. ఈ దాడిలో ఐదుగురు జవాన్లు సజీవ దహనమయ్యారు. మరో జవానుకు తీవ్ర గాయాలయ్యాయి. జవాన్ల ఒంట్లో దూసుకు పోయిన 7.62 ఎంఎం తూటాలు చైనాలో తయారై నట్లుగా ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. ఈ ఘటన తర్వాత కూడా ఉగ్రవాదులు చొరబాటు ప్రయ త్నాలు చేశారు. దాన్ని భద్రతా దళాలు సమర్థ వంతంగా తిప్పికొట్టాయి. ఉగ్రవాదులకు సహాయం చేసేందుకు పాక్ సైన్యం పంపిన డ్రోన్‌పై భద్రతా దళాలు కాల్పులు జరిపాయి. దీంతో డ్రోన్ తిరిగి పాక్‌లోకి వెళ్లిపోయింది.

మరోవైపు ఈ జి-20 సమావేశాలను భగ్నం చేసేందుకు పాకిస్తాన్ గూఢచార సంస్థ ఇంటర్ సర్వీస్ ఇంటెలిజెన్స్ (ఐఎస్ఐ), ఉగ్రవాదులతో కలిసి పన్నిన కుట్ర కూడా బయటపడింది. 26/11 ముంబై దాడుల వంటి మరో దాడికి పథకం తయారు చేసింది. ఏకకాలంలో రెండు మూడు చోట్ల దాడులు చేసేందుకు ఉగ్రవాదులు సిద్ధమయ్యారని తెలిసింది. గుల్‌మార్గ్‌లోని ఓ ఫైవ్ స్టార్ హోటల్లో ఉగ్రవాదుల కోసం క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఫరూక్ అహ్మద్ వనీ భద్రతా బలగాలకు చిక్కాడు. ఇతనికి ఐఎస్ఐ అధికారులతో ప్రత్యక్ష సంబంధాలు ఉన్నట్లు తేలింది. విచారణలో కీలక సమాచారం బయటపడింది.

**అడుగడుగునా బందోబస్తు**

శ్రీనగర్‌లో జరిగిన ఈ అంతర్జాతీయ సదస్సు కోసం జమ్ముకశ్మీర్ అంతటా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎన్ఎస్‌జీ, సీఆర్‌పీఎఫ్, మెరైన్ కమాండోలు, సైన్యం, జమ్ముకశ్మీర్ పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. శ్రీనగర్ దాల్ సరస్సులో మెరైన్ కమాండోలు గస్తీ కాశారు. శ్రీనగర్ మొత్తాన్ని 'నో డ్రోన్' జోన్‌గా ప్రకటించారు. కశ్మీర్ లోయ ప్రాంతంలో ఎలాంటి పుకార్లు చెలరేగకుండా చర్యలు తీసుకున్నారు.

**అక్కడి నాయకులూ తక్కువేం కాదు!**

జమ్ముకశ్మీర్‌లో తిరిగి సాధారణ పరిస్థితులు ఏర్పడటం గతంలో ఆ రాష్ట్రాన్ని పాలించిన ప్రాంతీయ పార్టీలకు కూడా నచ్చడం లేదు. ఇలాగైతే తమ పప్పులు ఉడకవని భావిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం మీద అక్కసు వ్యక్తం చేసేందుకు జి-20ని కూడా ఉపయోగించుకున్నాయి. శ్రీనగర్ సదస్సు విజయవంతమైతే ఈ ఘనత అంతా బీజేపీకే పోతుందన్నది వీరి బాధ. అందుకే జి-20 సదస్సును శ్రీనగర్ ఏర్పాటు చేయడం ద్వారా జమ్ముకి అన్యాయం చేశారనే విచిత్రమైన వాదన మొదలు పెట్టాడు మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూఖ్ అబ్దుల్లా. అంతేకాదు, జి-20 సందర్భంగా శ్రీనగర్‌లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమా లను కూడా ఆయన జీర్ణించుకోలేక పోయాడు. ఇక మరో మాజీ ముఖ్యమంత్రి, పీడీపీ అధ్యక్షురాలు మహబూబా ముఫ్తీ తీరు ఇంకోలా ఉంది. తాను జి-20కి తాను వ్యతిరేకంగా కాదంటూనే బీజేపీ దాన్ని హైజాక్ చేసిందని ఆరోపించారు. చివరకు జి-20 లోగోను కూడా కమలంవలె తయారు చేశారని విమర్శించారు.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

## అభివృద్ధి పథంలో జమ్ముకశ్మీర్



శ్రీనగర్ నడిబొడ్డున ఉన్న 70 ఏళ్లనాటి 'పోలో వ్యూ మార్కెట్' కొత్త శోభను సంతరించుకుంది. దాల్ లేక్ సమీపంలో ఉండే ఈ మార్కెట్ ఇప్పుడు సరికొత్త మెరుగులు అద్దుకుని యూరప్ దేశాల్లోని వీధులకు తగ్గకుండా ఆకర్షిస్తోంది. జి- 20 సమావేశాలను దృష్టిలో పెట్టుకొని సుందరీకరణ పనులు చేపట్టారు. రెసిడెన్సీ రోడ్, లాల్ చౌక్, ఓల్డ్ సిటీల్లోని మార్కెట్‌ల తరహాలోనే పోలో వ్యూ మార్కెట్‌ను కూడా అభివృద్ధి చేశారు.

అంతేకాదు, అన్ని రంగాల్లో జమ్ముకశ్మీర్ అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో జమ్ముకశ్మీర్ 14.64% ఆర్థిక ప్రగతిని నమోదు చేయగా, పన్నుల వసూళ్లు 31% పెరిగాయి. మొత్తం 1.88 కోట్ల మంది పర్యాటకులు కశ్మీర్‌ను సందర్శించారు. ఇది గత ఏడు దశాబ్దాల కాలంలో అత్యధికం. వీరిలో 20 వేల మంది విదేశీ యాత్రికులు కావడం గమనార్హం. గత ఏడాది పదినెలల కాలంలో జమ్ముకశ్మీర్‌లోకి వచ్చిన పెట్టుబడుల మొత్తం రూ.1547.87 కోట్లు. గత మూడేళ్ల కాలంలో 500 స్టార్టప్‌లు ప్రారంభమయ్యాయి. 'మై యూత్ మై ప్రైడ్', 'హర్ దిన్ ఖేల్ హర్', 'ఏక్ కేలియే ఖేల్' కార్యక్రమాల కింద 50 లక్షల మంది యువకులు వివిధ క్రీడాపోటీల్లో పాల్గొన్నారు. 2,02,749 మంది యువకులకు వివిధ స్వయం ఉపాధి పథకాల కింద సహాయం అందింది. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వేబ్రిడ్జి జమ్ము కశ్మీర్‌లో నిర్మితమైంది. వివిధ టన్నెల్స్ నిర్మాణం ద్వారా జమ్ముకశ్మీర్, లద్దాఖ్‌ల మధ్య దూరం బాగా తగ్గిపోయింది. దుబాయ్‌కి చెందిన ఎమ్మార్ సంస్థ జమ్ముకశ్మీర్‌లో 60 మిలియన్ల పెట్టుబడులు పెట్టనున్నది. దీనివల్ల ఏడు నుంచి ఎనిమిది వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. హైవేలు, మోటార్‌వేల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఉగ్రవాదం నుంచి బయటపడిన జమ్ముకశ్మీర్ ఇప్పుడు సౌభాగ్యంతో కళకళలాడుతోంది.

ఒకప్పుడు ఇస్లామాబాద్ నుంచి పిలుపునిస్తే శ్రీనగర్ మొదలు లోయలోని మారుమూల ప్రాంతాల వరకూ హర్తాళ్లు జరిగేవి. చిన్న ఘటన జరిగినా దుకాణాలు మూసేవారు. ఇప్పుడు భద్రతా దళాలు ఇచ్చిన ధైర్యంతో వారి వ్యాపారాలు చక్కగా చేసుకుంటున్నారు. కశ్మీర్ ఎంతో మారిపోయిందని, ఒకప్పటిలా అలర్లు, బంద్‌లకు పిలుపునిచ్చేవారు, పాటించేవారు లేరని స్థానికులే చెబుతున్నారు. ★




# ఆశయానికి దశాబ్దం హంగూ ఆర్భాటంతో

**తెలంగాణ.. దశాబ్దం క్రితం దాకా ఓ కల. ఓ ఆశయం. ఓ ఉద్యమం. కానీ, ఇప్పుడదో నెరవేరిన సాకారం. ఓ ప్రత్యేక రాష్ట్రం. ఓ స్థానిక స్వయంపాలనా కేంద్రం. దాదాపు ఆరు దశాబ్దాల ఉద్యమాలు, పోరాటాలకు ఫుల్‌స్టాప్ పడింది. భారతదేశ చిత్రపటంలో ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ వచ్చి చేరింది. తెలంగాణ ఆశయమే పరమావధిగా ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ (ఇప్పుడు బీఆర్ఎస్) తెలంగాణలో తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. పీఠంపై విజయ దరహాసాన్ని చూపించింది. ఇలా.. ఈ పరిణామాల మీదుగా తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి అప్పుడే దశాబ్దం గడిచింది.**

తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఘనకీర్తిని చాటిచెప్పేలా, చరిత్రను, ఉద్యమ ఆకాంక్షలను స్ఫురణకు తెచ్చేలా అంగరంగ వైభవంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తెలంగాణ ప్రగతి ప్రస్థానం, అమరుల త్యాగాలు గుర్తు చేసుకుంటూ.. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు జరుపుకోవాలని అన్ని జిల్లాలకు ఆదేశాలు జారీచేసింది.

**రూ. 105 కోట్ల నిధులు**

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణ కోసం ఆయా జిల్లాలకు 105 కోట్ల రూపాయలు విడుదల చేశారు. ఈ నిధులను ఖర్చు చేసే బాధ్యతను జిల్లా కలెక్టర్లకు అప్పగించింది ప్రభుత్వం. ఈ మేరకు తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను 21 రోజుల పాటు అధికారికంగా నిర్వహించేలా కార్యాచరణను రూపొందించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం అయిన జూన్ రెండో తేదీ నుంచి 22వ తేదీ వరకు ఈ ఉత్సవాలు జరుగుతాయి. రెండో తేదీన దశాబ్ది ఉత్సవాలు మొదలయ్యాయి. మరుసటి రోజు నుంచి 22వ తేదీ వరకు రోజుకు ఒక రంగం చొప్పున.. ఆయా రంగాలకు చెందిన ప్రగతిని వివరించేలా కార్యక్రమాలు చేపడుతున్నారు.

జూన్ 3వ తేదీని తెలంగాణ రైతు దినోత్సవంగా, జూన్ 4వ తేదీని సురక్షా దినోత్సవంగా, జూన్ 5 – తెలంగాణ విద్యుత్ విజయోత్సవంగా, జూన్ 6 – తెలంగాణ పారిశ్రామిక ప్రగతి ఉత్సవం నిర్వహిస్తున్నారు. అలాగే, జూన్ 7వ తేదీన సాగునీటి దినోత్సవం, 8వ తేదీన ఊరూరా చెరువుల పండుగ, 9వ తేదీన తెలంగాణ సంక్షేమ సంబురాలు, 10– తెలంగాణ సుపరిపాలన దినోత్సవం, 11– తెలంగాణ సాహిత్య దినోత్సవం, 12– తెలంగాణ రన్, 13– తెలంగాణ మహిళా సంక్షేమ దినోత్సవం, 14 – తెలంగాణ వైద్యారోగ్య దినోత్సవం, 15 – తెలంగాణ పల్లె ప్రగతి దినోత్సవం, 16 – తెలంగాణ పట్టణ ప్రగతి దినోత్సవం, 17–తెలంగాణ గిరిజనోత్సవం, 18వ తేదీన తెలంగాణ మంచి నీళ్ల పండుగ, 19వ తేదీన తెలంగాణ హరితోత్సవం, 20వ తేదీన తెలంగాణ విద్యాదినోత్సవం, 21వ తేదీన తెలంగాణ ఆధ్యాత్మిక దినోత్సవంగా జరుపుకుంటున్నారు. వేడుకల చివరిరోజు జూన్ 22న అమరుల సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఇందులో భాగంగానే ట్యాంక్‌బండ్‌పై కళాకారులతో భారీ ర్యాలీ ఏర్పాటు చేయనున్నారు. నూతనంగా నిర్మించిన అమరుల స్మారకాన్ని కేసీఆర్ ఆవిష్కరిస్తారు. అదే రోజు మంత్రులు, ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో ఉదయం అమరవీరుల స్థూపాల వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తారు. అనంతరం సాయంత్రం హైదరాబాద్‌లో నిర్వహించే సభలో పాల్గొంటారు.

**లక్ష్యం నెరవేరిందా?**

తెలంగాణ ఆవిర్భావం, దశాబ్ది ఉత్సవాలను ఈ స్థాయిలో నిర్వహించుకోవడంలో ఎవరికీ అభ్యంతరం లేదు. స్వరాష్ట్ర సాధన విజయోత్సవాలను మరిచిపోలేని స్థాయిలో జరుపుకోవడం అంటే రాష్ట్రాన్ని గౌరవించుకున్నట్లే. కానీ, ఈ పదేళ్లలో సాగిన పాలన తీరు, నెలకొన్న పరిణామాలను బేరీజు వేసుకోవడం కూడా అవసరమంటున్నారు రాజకీయ విశ్లేషకులు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఇప్పటికి రెండు సార్లు ఎన్నికలు జరిగితే రెండూ సార్లూ టీఆర్ఎస్ విజయం సాధించింది. ప్రజాస్వామ్యయుతంగా మెజార్టీ స్థానాలను గెలుచుకొని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. పాలన సాగిస్తోంది. అయితే, ప్రభుత్వాన్ని నడిపేందుకు అవసరమైన మెజార్టీ ఉన్నా, అవసరమైనంత మంది ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మాత్రం తెలంగాణ ఆవిర్భావం నుంచీ తనదైన మైండ్‌సెట్‌తో ముందుకెళ్తున్నారు. అవసరం లేకున్నా.. విపక్షాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలను తన పార్టీలో చేర్చుకునే కార్యక్రమాన్ని ఉధృతంగా సాగించారు. నయానో, భయానో.. సామ దాన భేద దండోపాయాలను ప్రయోగించి ప్రజా ప్రతినిధులను ఆకర్షించారు. ఒకరకంగా తెలంగాణలో ప్రతిపక్షం అనేది లేకుండా చూడాలన్న తనదైన ఆలోచనతో అడుగులు వేశారు. ఇప్పటికీ వేస్తూనే ఉన్నారు. తనను ఎదిరించే వాళ్లు, తనను ప్రశ్నించే వాళ్లు, తనను నిలదీసేవాళ్లు లేకుండా చూడాలన్నది కేసీఆర్ ఆలోచన అనేది ఆయన వ్యవహారశైలిని గమనిస్తే అర్థమవుతుందంటున్నారు విశ్లేషకులు.

ఇక, ప్రభుత్వంలో చూస్తే.. కేబినెట్ బాధ్యత సమష్టిగా మంత్రివర్గానిదే అయినా, కేసీఆర్ ఒకే ఒక్కడుగా ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారనడంలో సందేహం లేదు. తనకు ఎదురులేని విధంగా పార్టీని,

సుజాత గోపగోని, 6302164068



# ప్రచారం

ప్రభుత్వాన్ని అదుపాజ్ఞల్లో పెట్టుకుంటున్నారు. ఒకరకంగా ఏకఛత్రాధిపత్యంగా పాలన సాగిస్తున్నారు. ఫలితంగా కేసీఆర్ చెప్పిందే వేదం, ఆయన తీసుకున్నదే నిర్ణయం అన్న మాదిరిగా తెలంగాణ సర్కారు పాలన సాగుతోంది. దశాబ్ద కాలంగా ఇదే పరిస్థితి నెలకొంది.

తెలంగాణ ఉద్యమం ప్రధానంగా నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదంతో ఉవ్వెత్తున ఎగిసి పడింది. వందల మంది విద్యార్థులు, యువకులు, ఉద్యమకారులు ప్రాణత్యాగం చేశారు. తమ త్యాగంతో అయినా తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించాలని మరణ వాంగ్మూలాలు ఇచ్చారు. కానీ, తెలంగాణ వచ్చిన తర్వాత అమరులను గుర్తించిన, వారి కుటుంబాలను ఆదరించిన తీరు వివాదాస్పదమయ్యింది. అసలు తెలంగాణ కల నెరవేరడానికి, కేసీఆర్ ముఖ్యమంత్రి పీఠం అధిష్టించడానికి కారణమైన అమరుల విషయంలోనూ ఎన్ని విమర్శలు వచ్చినా, కనీసం ఆ నిర్ణయాన్ని సమీక్షించే ఆలోచన కూడా ప్రభుత్వం చేయలేదు. తెలంగాణ కోసం వెయ్యి మందికి పైగా అమరులయ్యారని ఉద్యమ సమయంలో వాదించిన తెలంగాణ రాష్ట్ర సమితి.. అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం వాళ్ల సంఖ్యను 459 మందికి కుదించింది. అమరుల కుటుంబ సభ్యులకు పది లక్షల రూపాయల చొప్పున ఆర్థిక సాయం చేస్తామని చెప్పిన ప్రభుత్వం.. ఆ సాయం అందించే నెపంతో అమరుల సంఖ్యను తగ్గించడం అప్పట్లో తీవ్ర వివాదాస్పదమయ్యింది. అయినా కేసీఆర్ సర్కారు డోంట్‌కేర్ అన్నట్లుగా వ్యవహరించింది.

తెలంగాణ కోసమే ఆవిర్భవించామని, తెలంగాణ అభివృద్దే ఏకైక లక్ష్యమంటూ చెప్పుకున్న టీఆర్ఎస్ ఈ దశాబ్ద కాలంలో అనేక వివాదాస్పద నిర్ణయాలు తీసుకుంది. తీసుకుంటూనే ఉంది. ఎన్ని విమర్శలు వచ్చినా, ఎంతమంది ఆక్షేపించినా, తన వైఖరిని మాత్రం కేసీఆర్ మార్చుకోవడం లేదన్నది అనేక సందర్భాల్లో స్పష్టమవుతోంది. టీఆర్ఎస్ ఆవిర్భావం నుంచీ పార్టీనే నమ్ముకున్న ఉద్యమ కారులను కేసీఆర్ పక్కన పెట్టేశారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ ఇతర పార్టీల నేతలకు గాలం వేసి టీఆర్ఎస్‌లో చేర్చుకున్నారు. ఉద్యమ సమయంలో తెలంగాణ ఉద్యమ ద్రోహులుగా ముద్రపడ్డ వాళ్లకు మంత్రి పదవులు ఇచ్చారు. ఈ పరిణామాలతో చాలా మంది ఉద్యమ నేతలు టీఆర్ఎస్‌కు, కేసీఆర్‌కు దూరమయ్యారు. అయినా ఏ మాత్రం తగ్గకుండా కేసీఆర్ తనదైన ఆలోచనలు అమలు చేస్తున్నారు. ఆరు దశాబ్దాల తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను దశాబ్ద కాలంలోపే ముఖ్యమంత్రి కేసీఆర్ అండ్ కో నీరుగార్చి, అమరవీరుల బలిదానాలను అవమానపరుస్తూనే ఉన్నారని విపక్షాలు, సామాజిక సంస్థలు తరచూ కేసీఆర్‌పై విమర్శల వర్షాలు కురిపిస్తూనే ఉన్నాయి. క్యాబినెట్ నిండా తెలంగాణ వ్యతిరేకులను నియమించుకొని, ప్రభుత్వ సలహాదారులుగా కూడా తెలంగాణ ఉద్యమ వ్యతిరేకులను నియమించుకొని, సీమాంధ్ర పెట్టుబడి దారి శక్తులతో లాలూచీ పడి వనరులన్నీ తెలంగాణ వ్యతిరేకులకు ధారపోస్తూ, తెలంగాణ కాంట్రాక్టులన్నీ సీమాంధ్ర కాంట్రాక్టర్లకు కమీషన్లకు అప్పజెప్పారన్న విమర్శలు జోరుగా వస్తున్నాయి. తెలంగాణ నిధులను ఇలా ఇతరులకు దోచిపెడుతూ ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేశారన్న ఆరోపణలు తీవ్రస్థాయిలో వినిపిస్తున్నాయి.

ఇక, నీళ్ల విషయానికి వస్తే.. తెలంగాణ నీళ్లను అటు ఆంధ్రకు ఇటు మహారాష్ట్రకు అప్పజెప్పిన కేసీఆర్.. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నీళ్ల పండుగ చేసుకుందామని చెప్పడం హాస్యాస్పదమన్న విమర్శలు వస్తున్నాయి. సహజంగా, ప్రకృతి సిద్ధంగా పారుతున్న నదులకు ఎగువన ప్రాజెక్టులు కట్టకుండా.. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో దాదాపు రాష్ట్ర ఖజానాను ఖాళీ చేశారని విపక్షాలు ఆరోపిస్తున్నాయి.

ఇక నియామకాల గురించి ఎంత తక్కువగా చెప్పుకుంటే అంత మంచిదంటున్నారు యువకులు, నిరుద్యోగులు. తెలంగాణ ఆవిర్భవించినప్పటి నుంచీ మన నియామకాలు మనకే అని కలలు గన్న యువత.. చకోర పక్షుల్లా ఎదురుచూస్తున్నారు. అయినా నోటిఫికేషన్ల జాడ లేదు. వచ్చిన అరకొర నోటిఫికేషన్లు ఇప్పుడు వివాదాస్పదమయ్యాయి. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన ఉద్యోగ నియామకాల పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ అవడం.. దాదాపు 50 మంది దాకా అరెస్ట్ అవడం టీఎస్‌పీఎస్సీ లోపాలకు, నిర్వహణ తీరుకు నిదర్శనంగా నిలుస్తోంది. ఏండ్లు, నెలల తరబడి పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయి నిజాయితీగా పరీక్షలు రాసిన అభ్యర్థులు.. తమ వ్యయప్రయాసలన్నీ వృథా అయ్యాయని మథన పడుతున్నారు. మళ్లీ నోటిఫికేషన్లు ఎప్పుడిస్తారో అని ఆందోళన చెందుతున్నారు.

తెలంగాణే ఊపిరిగా, తెలంగాణే ఏకైక లక్ష్యంగా, తెలంగాణే ఆశయంగా పార్టీని స్థాపించానన్న కేసీఆర్.. ఆ పార్టీని కూడా చరిత్రపుటల్లోకి నెట్టేశారు. తెలంగాణ తప్ప.. రెండో ఆలోచన లేదని ఇన్నాళ్లు చెప్పిన కేసీఆర్.. తెలంగాణ రాష్ట్రసమితి పార్టీని కనుమరుగు చేశారు. తమ పార్టీని భారత రాష్ట్ర సమితిగా మార్చేశారు. జాతీయ రాజకీయాల పేరుతో.. ఇన్నాళ్లు పాడిన తెలంగాణ సెంటిమెంట్‌కు ఒకరకంగా తన పార్టీ తరఫున పాతరేశారు.

ఈ తరుణంలో తెలంగాణ పేరుతో దశాబ్ది ఉత్సవాలు నిర్వహించే అర్హత టీఆర్ఎస్ ప్రభుత్వానికి లేదని విపక్షాలు వాదిస్తున్నాయి. తెలంగాణ పేరుతో, తెలంగాణ సమాజానికి, తెలంగాణ యువతకు, తెలంగాణ ప్రజలకు ఏం ఒనగూర్చారని వందల కోట్ల రూపాయలు ఖర్చుచేసి ఉత్సవాలు నిర్వహిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

**తెలంగాణ కోసమే ఆవిర్భవించామని, తెలంగాణ అభివృద్దే ఏకైక లక్ష్యమంటూ చెప్పుకున్న టీఆర్ఎస్ ఈ దశాబ్ద కాలంలో అనేక వివాదాస్పద నిర్ణయాలు తీసుకుంది. తీసుకుంటూనే ఉంది. ఎన్ని విమర్శలు వచ్చినా, ఎంతమంది ఆక్షేపించినా, తన వైఖరిని మాత్రం కేసీఆర్ మార్చుకోవడం లేదన్నది అనేక సందర్భాల్లో స్పష్టమవుతోంది.**





# కార్యదక్షుడు శత్రుఘ్నుడు

శ్రీ రామాయణంలో శత్రుఘ్నుని చరిత్ర స్వల్పమైనా ఘనమైనది. భరతుని ఆజ్ఞలను శిరసావహించాడు. శ్రీరాముని వెంట లక్ష్మణుడు నడచినట్లు భరతుని వెంట ఆయన సేవాభావంతో మెలగినట్లు చూడవచ్చు. శ్రీరామునికి మాత్రం ముగ్గురు తమ్ములపై ఎనలేని వాత్సల్యం ఉండేది.

ఆవేశం ఎక్కువ గల ఆయన, శ్రీరాముని వనవాసానికి అసలు కారణం మంథర అని తెలుసుకొని ఆమెను వధించేందుకు ఈడ్చుకు వచ్చాడు. భరతుని మాటలతో శాంతపడి విడిచిపెట్టాడు. అడవికేగిన శ్రీరామచంద్రుని అయోధ్యకు తిరిగి తీసుకు రావడానికి భరతునితో చిత్రకూటానికి వెళ్లాడు. కానీ రాముడు అందుకు అంగీకరించడు. చివరికి రాముడి పాదుకలను తనతో తీసుకుని వచ్చి రాజ్య భారాన్ని వహిస్తుంటాడు భరతుడు. పేరుకు భరతుడు రాజ్యభారం వహిస్తున్నా అందులో శత్రుఘ్నుని పాత్ర చాలా ముఖ్యమైనది. రాచకార్య నిర్వహణలో భరతుడికి సాయంగా ఉండేవాడు. అలాగే ముగ్గురన్నలు అయోధ్యలో లేనప్పుడు ముగ్గురు రాణులకీ శత్రుఘ్నుడే అండగా ఉండేవాడు.

అగ్రజుడైన రాముడి పాదుకలను పూజిస్తూ భరతుడు నందిగ్రామంలో ఉన్నంతకాలం అయోధ్య శత్రుఘ్నుని రక్షణలో ఉంది. భరతుని ఆజ్ఞానుసారం వ్యవహారాలను చక్కబరిచేవాడు. శ్రుతకీర్తిని వివాహం చేసుకున్న శతృఘ్నునకు సుబాహు, శత్రుఘాతి అను కుమారులున్నారు.

రావణ సంహారం చేసి శ్రీరామచంద్రుడు సీతా పరివార సమేతంగా వస్తున్నాడని హనుమ ద్వారా తెలుసుకున్న శత్రుఘ్నుడు పరమానంద భరితుడైనాడు. అయోధ్యను సర్వసుందరంగా. సుశోభితంగా అలంక రింప చేసాడు. రాజమార్గాలను, చిన్నచిన్న త్రోవలను కూడా సరిచేయిం చాడు. సప్తవర్ణమయంగా అయోధ్య నగరాన్ని క్షణాలలో తీర్చి దిద్దాడు. మితభాషి అయిన శత్రుఘ్నుడు కార్య రంగాన మాత్రం విశేషమైన ప్రతిభను చూపించడం గమనించవచ్చు.

**లవణాసుర వధ**

రాముడు రాజ్యం చేసే కాలంలో లవణాసురుడనే రాక్షసుడు రుషులను, ప్రజలను అనేక బాధలు పెడుతూ ఉండేవాడు. ఒకనాడు రుషులందరూ రామచంద్రుని సభకు వచ్చి తమ ఇక్కట్లను విన్నవించుకున్నారు. ఆ అసుర సంహారానికి ఎవరిని పంపుదామని శ్రీరామ చంద్రుడు సభికులను ప్రశ్నించినప్పుడు భరతుడు సన్నద్ధుడుకాగా, ఆ అవకాశం తనకు ఇవ్వాలని శత్రుఘ్నుడు అనుమతి కోరాడు. 'మీ వనవాస కాలంలో మీ

ఆధ్యాత్మికం



## ❋ 'మొక్క'బడి ❋

మెట్ట ప్రాంతాలలో, కొండలు, గుట్టలపై, రోడ్డుకు ఇరుపక్కలా ఎక్కువగా పెరిగే చెట్లలో రేల కూడా ఒకటి. దీనిని చాలామంది చూసే ఉంటారు. ఈ చెట్టు ఎన్నో ఔషధగుణాలను కలిగి ఉంటుంది.

అనేక రకాల అనారోగ్య సమస్యలను నయం చేయడంలో ఇది ఎంతగానో ఉపయోగ పడుతుంది. రేలచెట్టులో ఉండే ఔషధ గుణాల గురించి, ఈ చెట్టు వల్ల కలిగే ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

రేల చెట్టు కషాయం చేదుగా ఉండి వేడి చేసే గుణాన్ని కలిగి ఉంటుంది. మలబద్ధకాన్ని తగ్గించ డంలో ఈ చెట్టు ఎంతగానో

తరపున రాజ్యభారం వహించిన అన్న భరతుడు అలసిపోయినాడు. కాబట్టి ఆయనకు కొంతకాలం విశ్రాంతి అవసరం. లవణాసుర వధకు నేను వెళతాను' అని విన్నవించాడు.

శత్రుఘ్నుని మాటలకు శ్రీరాముడు ఎంతగానో సంతసించి, సమయోచిత ఆలోచనకు మెచ్చుకున్నాడు. లవణాసురుని అంతమొందించేందుకు అపారమైన సైన్యాన్ని, ధనాన్ని చేకూర్చి విజయుడవై రమ్మని దీవించి పంపాడు.

శత్రుఘ్నుడు ఏడు రోజులు ప్రయాణించి యమునానది తీరాన చ్యవన మహర్షి ఆశ్రమంలో బసచేశాడు. లవణాసురుని గమనాన్ని, దినచర్యలను మహర్షిని అడిగి తెలుసుకొన్నాడు. ఆతని దుర్మార్గపు చర్యలను, ప్రజలు, రుషులు పడే బాధలను చ్యవనమహర్షి వివరించాడు.

రావణుడి సోదరి కుంభిని కుమారుడు లవణాసురుడు. ఆతని తండ్రి మధు గొప్ప శివభక్తుడు. అతని భక్తికి మెచ్చిన శివుడు అతనికి మహిమాన్వితమైన త్రిశూలాన్ని ప్రసాదించాడని, అది ప్రస్తుతం లవణాసురుని వద్ద ఉందని, అది చెంతఉండగా లవణాసురుని ఎవరూ జయించలేరనీ చెప్పాడు చ్యవనుడు.

మధురా నగరం నుండి వేటకు వెళ్లి తిరిగి వస్తున్న లవణాసురుడి వద్ద త్రిశూలం లేదన్న సంగతి గ్రహించిన శత్రుఘ్నుడు ఆతనిని అడ్డగించి, రెచ్చగొట్టి అతనితో పోరుకు దిగాడు. రాముని స్మరించి ఒక దివ్యాస్త్రంతో అతన్ని సంహరించాడు. తరువాత మధురానగరాన్ని పునర్నిర్మించాడు. రుషులు, ప్రజలకు శాంతిని చేకూర్చి వారి కోరిక మేరకు పన్నెండు సంవత్సరాలు అక్కడనే ఉండి, అయోధ్యకు తిరిగి వచ్చాడు. శ్రీరామచంద్రుని ఆదేశంతో తిరిగి మధునగరం చేరి ప్రజారంజకంగా పాలించాడు.

శ్రీరామచంద్రుడి అవతార పరిసమాప్తి సమీపిస్తున్నదని తెలుసుకున్న శత్రుఘ్నుడు తన కుమారులైన సుబాహుని మధుర రాజ్యానికి, శత్రుఘాతిని విదిశా నగరానికి పట్టాభిషిక్తులను చేసి అయోధ్యకు చేరి అన్నగారితో సరయూ నదిలో కలిసిపోయి పరంధామాన్ని చేరాడు.

యథాతథంగా శ్రీమహావిష్ణువు చేతిలో శంఖంగా మారి పోయాడు. ★

# రుచికి చేదు, ఆరోగ్యానికి తీపి 'రేల'

ఉపయోగపడుతుంది. చర్మ రోగాలను, కఫ రోగాలను, క్రిమి రోగాలను, విషాన్ని హరించడంలో కూడా ఇది సహాయపడుతుంది. రేల చెట్టు బెరడును దంచి దానిని ఒక గ్లాస్ నీటిలో వేసి ఒక కప్పు కషాయం అయ్యే వరకు మరిగించి వడకట్టి గోరు వెచ్చగా తాగడం వల్ల, మూత్రం నుండి రక్తం పడడం తగ్గుతుంది. రేల పువ్వులను ఇతర దినుసులతో కలిపి పచ్చడిగా కూడా చేసుకుని తినవచ్చు. ఈ పచ్చడి ఎంతో రుచిగా ఉంటుంది. జ్వరం తగ్గిన వారు పథ్యంగా దీనిని  తినవచ్చు. దీనివల్ల మలబద్ధకం తగ్గి సుఖ విరేచనం అవుతుంది. ఈ చెట్టు చిగుళ్లను బియ్యం కడిగిన నీటితో కలిపి మెత్తగా నూరి,దానిని  కుష్టు వల్ల కలిగిన పుండ్లపై ఉంచుతూ ఉంటే క్రమంగా ఆ పుద్దు మానిపోతాయి. ★





# నిజమైన భక్తి

అది కింజన్ వాడి అనే కుగ్రామం. ఆ గ్రామంలో గణేశ్ అని ఓ భక్తుడు. ఆయన గణపతి ఉపాసకుడు. తుకారాం అనే భక్తుడితో భగవంతుడు కలిసి ఆరగించినట్టు తన ఇష్టదైవమైన వినాయకుడు తనతో కలిసి ఎందుకు తినడం లేదని బాధపడ్డారు.

ఆలోచించి, ఆలోచించి... ఓరోజు అతను తుకారాం దగ్గరకు వెళ్లి, పండరీనాథుడు మీతో రోజూ కూర్చుని భోం చేస్తున్నట్టే, వినాయకుడు నాతో కూర్చుని భోంచేసేటట్టుగా చెయ్యాలి అని ప్రాధేయపడ్డాడు గణేశ్ భక్తుడు.

'నువ్వు భక్తితో పిలిస్తే అతను తప్పకుండా నీతో కలిసి భోం చేస్తాడ'న్నాడు తుకారాం.

అది భోజనం వేళ. తుకారం పక్కనే పాండురంగడికి ఓ విస్తరాకు, గణేశ్‌కి ఓ విస్తరాకు వేయించాడు.

గణేశ్ భక్తుడు చాలా సేపు పిలిచినా వినాయకుడు రాలేదు.

అప్పుడు తుకారాం, గణేశా! సముద్రంలో బోల్తా పడిన ఓ భక్తుడి పడవను కాపాడటానికి వినాయకుడు వెళ్లాడు.ఇప్పుడే ఇక్కడికి వచ్చాడ'న్నాడు.

సముద్రంలోని ఉప్పు నీరు దేహం నుంచి బొట్టు బొట్టుగా కారుతూ అక్కడ నిల్చున్న వినాయకుడిని చూశాడు గణేశ భక్తుడు. ఆ క్షణంలోనే వినాయకుడిని భోజనానికి ఆహ్వానించాడు. కానీ వినాయకుడు కదలలేదు.

దాంతో గణేశ భక్తుడు ఎంతో బాధపడ్డాడు. తుకారాంని చూసి 'స్వామీ! మీరు పిలవండి' అని కోరాడు.

తుకారాం అలానే వేడుకున్నాడు. వినాయకుడు, పాండురంగడు ఆ తర్వాత భోం చేశారు. ఆకులో వడ్డించిన ఆహార పదార్థాలు లేకుండా పోవడం అందరికీ కనిపించగా, తుకారాంకి మాత్రం వారిద్దరు భుజించడం కనిపించింది.

భక్తికి కావలసింది నిజమైన ప్రేమ అనే విషయాన్ని అప్పుడే గ్రహించాడు గణేశ భక్తుడు. ★

రిత్విక్ మాట్లాడలేదు.

"విజయం ఓ మత్తు రిత్విక్. బతికి వున్నంత వరకూ ఓ మెట్టుకూడా దిగకూడదు అనిపిస్తుంటుంది. ఒకప్పటి రచనలు వేరు. ఇప్పటి పాఠకులు వేరు. అందుకే నీ రచనలు ఎన్నో తిరస్కరించాను. నా మీద వచ్చే విమర్శలు నాకు తెలుసు. చెత్త కథలకు, నవలలకు బహుమతులు ఇస్తాననుకుంటారు. ఆ రచనల గురించి నాకు తెలుసు. కొన్ని రచనల్లోని గాఢతను మామూలు పాఠకులు భరించలేరు. నన్ను విమర్శించేవారు నేను ప్రచురించిన మంచి రచనల గురించి మాట్లాడరు. నువ్వు అలానే అనుకుంటావా?"

"ఎవరి స్ట్రాటజీలు వారికుంటాయి సర్. సాధారణ ప్రచురణకి అంగీకరించ నప్పుడు కోపం వస్తుంది. నేను పత్రిక పెట్టినా అలాంటిది వుంటుంది".

"పత్రిక పెట్టే ఆలోచన వుందా?"

"ఈ వయసులోనా! నా పుస్తకాలను ప్రచురించు కుంటే చాలు".

గోవింద్ నవ్వాడు. కారు ముందుకు సాగుతోంది.

* * *

రిత్విక్‌ని ఓ ఇంటి ముందు దింపారు.

"ఇది మన గెస్ట్ హౌస్. నువ్వు ఇక్కడ వుంటావు. ఇక్కడ నీకు ఏం కావాలన్నా మన వాళ్లున్నారు. కిచెన్ వుంది. నేను రాత్రికి వస్తాను" అని గోవింద్ వెళ్లి పోయాడు. ముందుగా హీటర్ స్విచ్ ఆన్ చేసాడు రిత్విక్. ఇంటి దగ్గర హారికకు ముందే చెప్పాడు. నేను విజయవాడ చేరుకున్నాక ఫోన్ చేస్తాను. నువ్వు చేయవద్దు అని.

"ఇప్పుడే గెస్ట్ హౌస్‌కి చేరుకున్నాను. ఇక్కడ చాలా కంఫర్ట్‌గా వుంది. నేను పిల్లల్తో మాట్లాడతాను. పాస్‌పోర్ట్ వచ్చేదాకా నువ్వు ఇంటి దగ్గర వుండు. తర్వాత నీ ప్రయాణం గురించి ఆలోచించుదాం. రాత్రి పూట మీ అక్కను నీ దగ్గరకు రమ్మను. తను ఖాళీగానే వుంది కాబట్టి



ఎండిపై రామమూర్తి స్మారక నవలల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన రచన

3



# మహా సంకల్పం



పది రోజులు నీ దగ్గర వుండమను” చెప్పాడు హారికకు.

“ఎందుకు రమ్మన్నారో దారిలో చెప్పారా?”

“ఇంకా లేదు. ఆయన చెప్పాక నీతో మాట్లాడ తాను”.

“అప్పుడప్పుడు మీరు ఫోన్ చేయండి. మీరు ఎలాంటి మీటింగ్స్‌లో వుంటారో నాకు తెలియదు. నేను డిస్ట్రబ్ చేయటం బాగుండదు”.

“అలాగే”.

ఇంకొందరు మిత్రులతో మాట్లాడాడు.

తర్వాత ఇద్దరు కొడుకులతో మాట్లాడి స్నానం చేసాడు. అక్కడ గోవింద్ బుద్ధ పత్రికలున్నాయి. అలాగే అన్ని రకాల దినపత్రికలు వున్నాయి. ఓ చోట ర్యాక్స్ నిండా రకరకాల పుస్తకాలు, గోడల మీద గోవింద్ చిత్రపటాలు వున్నాయి. పుస్తకాలను చూస్తుంటే ఆశ్చర్యం అనిపించింది. అన్నిరకాల పుస్తకాలు వున్నాయి. అన్నీ వందల్లో, వేలల్లో వున్న పుస్తకాలు-ఖరీదైనవి.

తన గదిలో టేబుల్ వుంది. దాని మీద లెటర్ ప్యాడ్‌వుంది. రకరకాల రంగుల ఎ-4 పేపర్స్ వున్నాయి. అన్ని రంగుల పెన్స్ వున్నాయి. అందమైన కుర్చీ వుంది. అత్యంత ఆధునికమైన లెడ్ టీ.వి. వుంది.టేబుల్ ల్యాంప్ వుంది. ఇదో క్రియేటివ్ రూమ్‌లా వుంది.

ప్రపంచాన్ని మరిచిపోయి రాసుకోవచ్చు ఇక్కడ.

అంతలోనే అతనికి మార్క్స్ గుర్తొచ్చాడు.

ప్రపంచానికి కొత్త మార్గాన్ని నిర్దేశించిన ఆ మహ నీయుడు రాసుకోవటానికి ఇంక్ కోసం, కాగితాల కోసం తన కోట్‌ని తాకట్టు పెట్టవలసి



పి. చంద్రశేఖర ఆజాద్

వచ్చింది. తనకు కావలసిన సమాచారం కోసం ఆయన లైబ్రరీకి వెళ్లాడు. కోట్ లేదని ఆయన్ని లోపలకు రానీయలేదు. మళ్లీ కోటును విడిపించుకోవటానికి చేసిన ప్రయ త్నంలో అతను కొని తెచ్చుకున్న సిరా ఎండి పోయింది.

ఇది చదివినప్పుడు మనసు బాధతో వూగి పోయింది. చరిత్రలో ఇలాంటి మహానుభావులు ఎందరో వున్నారు. అలాంటి వారిని తలుచు కున్నప్పుడు మాత్రం మనం ఎందుకు రాస్తున్నాం? ఎవరి కోసం రాస్తున్నాం? అన్న బాధ కలుగుతుం టుంది.

ఏదిఏమైనా ఇప్పుడు చాలా మార్పులు వచ్చాయి. బాదరబందీ, ఆర్థిక సమస్యలు లేకపోతే, ఇలాంటి అవకాశాలుంటే గొప్ప సృష్టి జరగవచ్చు అను కున్నాడు.

అంతలోనే నవ్వు వచ్చింది.

ఇలాంటి అవకాశాలు వున్నవారు ఈ దేశంలో చాలా మంది వున్నారు. అంత మాత్రాన గొప్ప సృజన జరగటం లేదని.

దారిలో గోవింద్ గారి ఆరోగ్యం గురించి అడగా లనిపించింది. అయినా ధైర్యం చేయలేకపోయాడు. ఇంతకు ముందు పసివాడిలా హాయిగా నవ్వే ఫోటోలు చూసాడు. ఇప్పుడు కాస్త లావు అయ్యారు. అంతే... తనకే రకరకాల సమస్యలు వచ్చాయి. గోవింద్ తన కంటే ఏడు సంవత్సరాలు పెద్దవారు. శారీరక సమస్యలు రాకుండా ఎలా వుంటాయి!

“చూద్దాం. ఆయనే చెబుతారు” అనుకున్నాడు.

* * *

రాత్రి తొమ్మిది గంటలవుతోంది.

అంతకు ముందు ఆయన ఫోన్ చేసి చెప్పారు.

“మనం డిన్నర్ కలిసి చేద్దాం. కాస్త ఆలస్యం అయినా నువ్వు వెయిట్ చెయ్యి”. గోవింద్ ముందు నుండి సంస్థలోనూ, వ్యక్తిగతం గానూ ఓ క్రమశిక్షణను ఏర్పరిచాడు. అక్కడికి ఎవరు వెళ్లినా తగిన మర్యాదలు జరుగుతాయి.

అక్కడి స్టాఫ్ ముందు కూర్చోమంటారు. తర్వాత అటెండర్ మంచి నీళ్లు తీసుకుని వస్తాడు. కాఫీ, టీ, ఏది కావాలంటే అది యిస్తారు. గోవింద్‌జీని కలవాలంటే మాత్రం ప్రాసెస్ వుంటుంది.

సాధారణంగా ఆయన్ని ఆఫీసు సమయంలో కలవటం అరుదుగా వుంటుంది. తాను రమ్మంటే తప్ప బయట నుండి వచ్చిన వారు కలవలేరు. అందులోనూ అనేక ప్రాంతాల నుండి రచయితలు, పాఠకులు వస్తుంటారు. వారందరినీ కలిసి మాట్లాడటం మొదలుపెడితే ఆఫీస్ పని చేసుకోవటం వుండదు.

మధ్యాహ్నం కొంచెం సేపు నిద్రపోయాడు. తర్వాత అక్కడున్న పుస్తకాల్లో ఒకటి తీసుకుని చదివాడు. అప్పుడు దారిలో వస్తున్నప్పుడు తన పిల్లల గురించి అడిగిన సంగతి గుర్తు వచ్చింది. ఎందుకలా అడిగారు? మామూలుగా అడిగారా? ఇంకేదయినా కారణం వుందా? అనిపించింది.

నిజానికి పిల్లల గురించి రిత్విక్ ఎప్పుడూ పెద్దగా పట్టించుకోలేదు. వారి గురించి హారిక చూసుకుంది. తను కూడా తక్కువ చదువుకుంది. హోమ్ మేకర్‌గా మొదటి నుంచి వుంది. హారిక కూడా ఉద్యోగం చేసి వుంటే ఎలా వుండేదో తెలియదు. ఇప్పుడు అనుమానం వస్తోంది.

ప్రపంచంలోని ఎంతటి సెలబ్రెటీలయినా పిల్లల విషయంలో గట్టి సమస్యలు ఎదుర్కొన్నారు. అరుదుగానే తండ్రిని, తల్లిని మించిన వారు తయారయ్యారు.

“మీరూ మీ రచనలు తప్ప మాకోసం ఎప్పుడు సమయం యిచ్చారు. అసలు మీ ప్రపంచంలో మాచోటు ఏమిటి? మీరు ఓ అందమైన కుటుంబాన్ని తయారు చేసుకోకుండా ప్రపంచం గురించి, మనుషుల గురించి ఎలా మాట్లాడతారు? ఇతరుల జీవితాల్లోకి, మనసుల్లోకి ఎలా తొంగి చూస్తారు?” అని అడుగుతున్నట్లు అనిపించింది.

అదే సమయంలో హారిక గుర్తు వచ్చింది.

హారిక నా గురించి ఏమనుకుంటోంది? నాతో జీవితం తనకు కంఫర్ట్‌గా వుందా? రాజీపడి బతుకుతోందా?

అప్పటికప్పుడు ఫోన్ చేయాలనిపించి చేసాడు.

"టీ తాగారా" అంది.

"తాగాను. ముందో విషయం చెప్పు. నా గురించి నీ అభిప్రాయం ఏమిటి?"

"కొత్తగా అడుగుతున్నారేంటి?" అంది హారిక.

"ఆలస్యంగా అడుగుతున్నాను. ఇప్పటికయినా అడగకపోతే నేను ఎవరో తెలుసుకునే అవకాశంరాదు అనిపించింది".

"మన పెళ్లి జరిగి నలభై రెండు సంవత్సరాలు అయిందండి. ఇప్పుడు మీకు నా అభిప్రాయం అవసరమా?"

"అందుకే అడుగుతున్నాను".

"తెలుసుకుని ఏం చేయాలని?"

"తప్పులుంటే సరి చేసుకుందామని?"

"ఇందుకా మిమ్మల్ని గోవింద్‌గారు పిలిచింది!"

"ఎందుకు పిలిచారో నాకింకా తెలియదు. కొన్ని ప్రయాణాలు, కొన్ని ప్రశ్నలు మనల్ని వెనక్కి తిరిగి చూసుకోమంటాయి హారికా! రచయితలు సహజంగా ఊహల్లో బతుకుతుంటారు. వారి కల్పన ఊహ. తమ తీరని కోరికల్ని రచనలో చూసుకుంటారు. మా అంత పసిపిల్లలు ఎవరూ వుండరేమో!"

"నా గురించి మీరు ఏమనుకుంటున్నారు?" అంది హారిక.

"ప్రశ్నకు ప్రశ్న సమాధానమా?"

"మీకే కాదు. అందరికీ అభిప్రాయాలు కావాలి. నేనూ తప్పులుంటే సరి చేసుకోవాలి కదా. నేను మీ జీవితంలోకి వచ్చాక బరువుగా ఫీలయ్యారా? బాధ్యతగానా, ప్రేమగానా?"

రిత్విక్ మాట్లాడలేదు.



"మీ జీవితంలోకి రాక ముందు హారిక వేరు. తర్వాత మీ రచనలకు మొదటి పాఠకురాల్ని నేను. ఆ అలవాటు ఇతర పుస్తకాలను చదివేలా చేసింది. ఎంతో కొంత నేర్చుకుంటాం కదా" అని....
"మీరు ప్రశాంతంగా వుండండి. నా గురించో, పిల్లల గురించో ఆలోచించ వద్దు. మనం మాట్లాడు కుంటానికి ఇంకా సమయం వుంది. ఇప్పటి వరకు మనకు చిన్న చిన్న సమస్యలు మాత్రం వచ్చాయి. మన కుటుంబాన్ని కుదిపివేసే సంక్షోభం రాలేదు".

"చూసారా మీరు మాట్లాడలేకపోతున్నారు. ఇలాంటి ప్రశ్నలకి అప్పటికప్పుడు సమాధానాలు చెప్పటం కష్టం. జరిగిపోయిన జీవితం గురించి తవ్వుకోవాలి కదా".

"నువ్వు మాట్లాడుతుంటే అందులో కవిత్వం వుందనిపిస్తోంది హారికా!"

"మీ జీవితంలోకి రాక ముందు హారిక వేరు. తర్వాత మీ రచనలకు మొదటి పాఠకురాల్ని నేను. ఆ అలవాటు ఇతర పుస్తకాలను చదివేలా చేసింది. ఎంతో కొంత నేర్చుకుంటాం కదా" అని....

"మీరు ప్రశాంతంగా వుండండి. నా గురించో, పిల్లల గురించో ఆలోచించ వద్దు. మనం మాట్లాడు కుంటానికి ఇంకా సమయం వుంది. ఇప్పటి వరకు మనకు చిన్న చిన్న సమస్యలు మాత్రం వచ్చాయి. మన కుటుంబాన్ని కుదిపివేసే సంక్షోభం రాలేదు".

"అలాంటిది వస్తుందంటావా?"

"సామెత చెబుతారుగా.. వాన రాకడా... ప్రాణం పోకడా ఎవరు చెప్పగలరని. ఎవరి జీవితంలో నయినా, ఎప్పుడయినా ఏదయినా జరగవచ్చు..." అంది.

వాన...వాన చినుకులు...మానస గుర్తొచ్చాడు. నిజంగానే అతను కథ కోసం చాలా నెలలు ఎదురు చూసాడు. కథ రాయనందుకు కోపం వచ్చి వుంటుంది. వాన చినుకులు ఎవరి కోసం? ఎవర్ని తడపటానికి? అందరూ బయటకు రాకుండా ఇళ్లల్లో కూర్చుని కాఫీలు తాగుతూ కిటికీల నుండి చినుకుల్ని చూస్తుంటే ఎవర్నీ తాకవు. భూమిలో ఇంకుతుం టాయి. అవును. వాన చినుకులు నేల కోసం, మనుషులు వాన కోసమే ఎదురు చూస్తారు. అందులోనూ తొలకరి వానలంటే మరీ ఉత్సాహం.

అయితే వాన జడివానగా, తుఫాన్‌గా మార వచ్చు. అప్పుడు గాలి తోడయితే, భూకంపం వస్తే, సునామీగా, ఉప్పెనగా మారవచ్చు. కొన్ని దశాబ్దా లుగా అత్యంత శ్రమతో నిర్మించుకున్నవన్నీ కళ్ల ముందు కొట్టుకుపోతుంటే నిస్సహాయంగా చూడాల్సిందే.

వాన చినుకులు రాలని ప్రాంతాలున్నాయి. మనుషులున్నారు. వారి గుండెలు నెర్రెలిచ్చిన నేలలా వుంటాయి.

హారిక మాటలు వింటే మా జీవితాల్లోనూ తుఫాన్ రాబోతోందా అనిపించింది రిత్విక్‌కి.

గెస్ట్ హౌస్ బయటకు వచ్చాడు. అక్కడ లాన్ వుంది. అందమైన క్రోటన్స్ వున్నాయి. అక్కడ ఓ వయసు మీరిన వ్యక్తి పని చేసుకుంటున్నాడు. మొక్కలకి పాదులు చేస్తున్నాడు.

తలఎత్తి చూసాడు. ఆకాశం కనిపించింది. అప్పుడు చూసాడు. మూడు అంతస్తులుగా ఆ గెస్ట్ హౌస్‌ని కట్టారు. మూడో అంతస్తు మీద ఓ రూమ్



కనిపిస్తోంది. ఆ అద్దాలకు తెరలు వేలాడుతున్నాయి.

లోపలకి వెళ్లాడు. అప్పుడు గమనించాడు. అక్కడ లిఫ్ట్ వుంది. పైకి వెళ్లాడు. అక్కడ ఆగాడు. అది కేవలం ఓ రూమ్ కాదని అనిపించింది. తాళం వేసి వుంది. పైన రూఫ్ గార్డెన్ వుంది.

మళ్లీ కిందకి వచ్చాడు. పుస్తకం అందుకున్నాడు.

టీ తాగుతుంటే ఫోన్. అప్పుడు ఆరు గంటలు.

పది గంటలకు గోవింద్ బుద్ధ వచ్చాడు.

* * *

"బోర్ కొట్టిందా?" అడిగాడు రిత్విక్‌ని.

"లేదు సరే. ఇదో ద్వీపంలా వుంది. అన్ని ఏర్పాట్లు వున్న ద్వీపం. నాలాంటి వాళ్లకు ఇక్కడ బోర్ కొట్టే అవకాశాలు తక్కువ".

"ద్వీపాల్లో మనకు కావాల్సిన మనుషులు లేకపోతే...." అన్నాడు బుద్ధ.

రిత్విక్ ఆశ్చర్యంగా చూస్తున్నాడు. ఇద్దరూ ఫస్ట్ ఫ్లోర్ హాల్లో వున్నారు. ఆయన వెళ్లి ఓ స్కాచ్ బాటిల్ తీసుకు వచ్చి చూపించి...

"ఇది ఫర్వాలేదా? లేదంటే నువ్వు వెళ్లి నీకు నచ్చింది సెలక్ట్ చేసుకో రిత్విక్".

"నేను...." అంటూ ఆగిపోయాడు.

**మొదటిసారి కట్టుకున్న ఇల్లు క్రమంగా ఇరుకవుతుంది. ఇంకాస్త పెద్ద ఇల్లు కావాలి. ఎక్కువ గదులు వుండాలి అనుకుంటాం. డబ్బులు వస్తుంటాయి. అప్పుడు కట్టేవి మన కోసం కాదు. మన ఇగోని సంతృప్తి పరుచుకోవటానికి. నువ్వు ద్వీపం అంటున్నావు. అప్పుడప్పుడు మనుషులకి అలా ద్వీపాలకు పరుగులు తీయాలనిపిస్తుంది. ముఖ్యంగా భావుకులకి.**

"అకేషనల్‌గా డ్రింక్ చేస్తానని చెప్పావు కదా!" తలదించుకున్నాడు.

"నా ముందు డ్రింక్ తీసుకోవటానికి యిబ్బంది పడుతున్నావా! నాకు స్మోకింగ్ అలవాటు వుండేది. మా నాన్న దగ్గర మాత్రం తాగేవాడ్ని కాదు-పెద్దయ్యాక కూడా. మీ పిల్లలు స్మోక్ చేస్తారా?"

"నాకు తెలిసి చేయరు సర్".

"సరే. కూర్చో" అన్నాడు నవ్వుతూ.

ఇంతలో ఓ సర్వెంట్ వచ్చి అన్ని ఏర్పాట్లు చేసి వెళ్లాడు.

"మనం ఇల్లుకట్టుకోవాలనుకుంటాం. ఎందుకు? అందరం కలిసి బతకాలి అని. గృహప్రవేశం చేస్తాం. పాలు పొంగిస్తాం. ఆ ఇంటి నుంచి ఒక్కొక్కరూ వెళ్లి పోతుంటారు. చివరికి ఇద్దరు మిగులుతారు. వాళ్లు భార్యాభర్తలు. అందులో ఒకరు వెళ్లిపోయారనుకో..అప్పుడేం జరుగుతుంది" అన్నాడు గోవింద్.

అతన్నే చూస్తుంటే...

"క్రమంగా శిథిలం అవుతుంది. మనం శిథిల భవనాలను ఎన్నో చూస్తుంటాం. ప్రతిదాని వెనకాల ఓ కథ వుంటుంది కదూ...."

"అవును సర్".

"చీర్స్" అన్నాడు. తర్వాత...

"మొదటిసారి కట్టుకున్న ఇల్లు క్రమంగా ఇరుకవుతుంది. ఇంకాస్త పెద్ద ఇల్లు కావాలి. ఎక్కువ గదులు వుండాలి అనుకుంటాం. డబ్బులు వస్తుంటాయి. అప్పుడు కట్టేవి మన కోసం కాదు. మన ఇగోని సంతృప్తి పరుచుకోవటానికి. నువ్వు ద్వీపం అంటున్నావు. అప్పుడప్పుడు మనుషులకి అలా ద్వీపాలకు పరుగులు తీయాలనిపిస్తుంది. ముఖ్యంగా భావుకులకి. అక్కడ ఓ ప్రేయసి లేకుండా, కనీసం లైఫ్ పార్ట్నర్ లేకుండా సముద్రాన్ని, చెట్లను ఎంజాయ్ చేయగలరా ఎవరయినా...."

**(సశేషం)**


**జాగృతి** ఆధ్వర్యంలో ఏపీయూఎస్ వ్యవస్థాపక కార్యదర్శి

## స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక

'నవలల పోటీ- 2023'కి రచయితలను ఆహ్వానిస్తున్నాం..



1936-2022

**ప్రథమ బహుమతి రూ. 25,000**

**ద్వితీయ బహుమతి రూ. 20,000**

**సూచనలు :**

➺ ఇతివృత్తం భారతీయ జీవన విధానానికి, విలువలకు అద్దం పట్టేదిగా ఉండాలి. సామాజిక, చారిత్రక, పౌరాణిక అంశాలను స్వీకరించవచ్చు. వ్యావహారిక భాషలోనే ఉండాలి. ➺ నవల 125-150 (ఎ4, 15 పాయింట్) పేజీలకు మించరాదు. ➺ సాధ్యమైనంతవరకు డీటీపీ చేయించిన రచనలనే, పోస్ట్ ద్వారా మాత్రమే పంపాలి. వ్రాతప్రతులైతే చక్కని దస్తూరితో, ఒక్క కొట్టివేత కూడా ఉండరాదు. ➺ నవల మీద రచయిత పేరు ఉండరాదు. విడిగా హామీపత్రంలో పూర్తి చిరునామా మొబైల్ నంబర్‌తో సహా రాయాలి. రచన తమ సొంతమని, అనువాదం, అనుసరణ కాదని, ఎక్కడా ప్రచురితం, ప్రసారం కాలేదని హామీ ఇవ్వాలి. ➺ ఎంపిక విషయంలో తుది నిర్ణయం న్యాయనిర్ణేతలదే. ఉత్తర, ప్రత్యుత్తరాలకు తావు లేదు.

➺ **నవలలు పంపవలసిన చిరునామా : 3-4-228/4/1, జాగృతిభవన్, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్- 500027.**

**నవలలు మాకు చేరవలసిన ఆఖరి తేదీ : 21 జూన్, 2023**

# సివిల్స్ 'మణుల'కు

ఉదాహరిస్తే ఎన్నో చరితలు. అవన్నీ స్ఫూర్తిమంత జీవితాలు. 'సివిల్స్' అనగానే యువతలో ఒక అనురక్తి, ఎన్ని స్థితిగతులనైనా ఎదిరించి నిలిచి గెలిచి తీరాలన్న తపన. ఆ పరీక్షల తుది ఫలితాలు వెలువడిన ప్రతిసారీ మన దేశంలోని కోట్లాది చూపులు విజేతలపైనే కేంద్రీకృతమవుతాయి. వారు ఏం మాట్లాడారు? ఎలా తమ విజయగాథలు వెల్లడించారన్నదే అందరిలోని ఏకైక ఆసక్తి. సివిల్ సర్వీసులంటే అందరికీ తెలిసిన ఐఏఎస్, ఐపీఎస్ మాత్రమే కాదు. దాదాపు పాతిక అఖిల భారత సేవాసర్వీసుల సమాహారమే సివిల్స్. అడ్మినిస్ట్రేటివ్ అంటే కలెక్టర్, పోలీసు అనగానే సూపరింటెండెంట్ (ఐపీఎస్ ఎస్పీ) మనకు గుర్తుకొస్తారు. వివరించాలంటే – ఐఎఫ్ఎస్, ఐఆర్ఎస్, మరెన్నో జాతీయ స్థాయి వ్యవస్థలున్నాయి. అందుకే ప్రత్యేకించి యువత ఆశలన్నీ సివిల్స్ గెలుపుపైనే! ఆ పరీక్షల్లో (లిఖిత, మౌఖిక) నెగ్గిన వారికి శిక్షణలు అన్నీ వడపోతల మయంగా ఉంటుంటాయి.

సివిల్స్‌లో గెలుపొంది పాలనారంగాన వెలుగొందాలని ఎంతగానో ఉవ్విళ్లూరుతుంటారు. కాలక్రమంలో ర్యాంకుల సాధనలూ వికేంద్రీకృతమయ్యాయి. ఢిల్లీతోపాటు ఉత్తరప్రదేశ్, రాజస్తాన్, బిహార్, మరికొన్ని ఇతర ప్రాంతాలకు జతగా ఉభయ తెలుగు రాష్ట్రాలూ చేరాయిప్పుడు. సివిల్స్ టాప్ ర్యాంకర్లలో దశాబ్దకాల పరిణామాలను గమనిస్తే నాడు రాజస్తాన్, నేడు యూపీ. ఆ మధ్యకాల టాపర్లలో కర్ణాటక, హరియాణా యువశక్తికి తోడుగా కర్నాటక, తెలంగాణ యువతనీ చూడొచ్చు. ఉత్తరాది, దక్షిణాది అని ప్రత్యేకమంటూ ఏమీ లేదు. తాజా వివరాల్ని పరిశీలించి చూస్తే, దరిదాపు 50 మంది భాగ్యనగరం లేదా ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయులూ/ఆయా చోట్ల సుశిక్షణ తీసుకున్నవారే! ప్రధానంగా సివిల్స్ మీదే ఎందుకంత మోజు అనుకుంటున్నారా? అధికారిక సేవారూపంలో వారందరికీ (ర్యాంకర్లు) ఎన్నో ఆశలూ, ఆశయాలూ ఉన్నాయి కనుక. ముఖ్యంగా యువతుల ప్రతిభ, పట్టుదల అనంతం.

తల్లిదండ్రులు ప్రభుత్వ సర్వీసులో ఉంటే, ఆ ప్రభావం వారి సంతానంపైన చాలా ఎక్కువ. కండక్టర్ కొడుకు కలెక్టర్ అవుతాడా? అతి సాధారణ ఉద్యోగి పిల్లలు సివిల్స్ దాకా ఎదుగుతారా? అనే ప్రశ్నలు గతానికే పరిమితం. సామాజిక, సాంకేతిక పరిజ్ఞానం అన్ని అంతరాలనూ చెరివేసింది. మగపిల్లలైనా, ఆడపిల్లలైనా, ఆర్థికస్థాయి ఎలాంటిదైనా లక్ష్యం మటుకు ఒకటే! సివిల్స్‌లో విజయం, అదీ ర్యాంకు బలంతో! యూపీ రాజధాని నగరం లఖన్‌వూ ప్రాంతంలో ఓ కుగ్రామముంది. అక్కడి వారిలో సగం మందికి పైగా సివిల్స్ విజేతలే. అందరూ యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్‌సీ) ఆరాధకులే. ఆ సంస్థ నిర్వహించే పరీక్షలు పరమ ప్రామాణికతకు మారు పేరని ఉమాహారతి చాటి చెప్తున్నారు. సివిల్స్ పరీక్షల మూడో ర్యాంకర్ ఆమె. తెలుగు ఆణిముత్యం. ప్రశ్నలకు సమాధానాలు రాయడంలో, ముఖాముఖిలో దీటుగా బదులివ్వడం లోనూ 'శభాష్' అనిపించుకున్నారు. తండ్రి ఎస్పీ, సోదరుడు మునుపు ఐఈఎస్ ర్యాంక్ హోల్డర్. వారే ఆ అమ్మాయికి స్ఫూర్తికారకులు. ఆమె ఇంటి దగ్గరే ఉంటూ పరీక్షలకు సంసిద్ధమయ్యారు. ఇది మరో విశిష్టత. 'మీలా ర్యాంకర్ కావాలంటే ఏ విధంగా చదవాలి' అని అడిగితే, 'ఏది ఎంతవరకో అంతవరకే చదివితే సరి' అంటూ సమాధానమిచ్చారు. 'పరీక్షల్లో వైఫల్యాలకు బెదరకూడదు' అనేది ఇంకో జవాబు. వీటిని బట్టే, ఉమాహారతి ప్రస్ఫుటత్వం ప్రతీ ఒక్కరికీ తేటతెల్లమవుతుంది.

**ప్రతిభా సామర్థ్యాల కలనేత**

2022 సివిల్స్‌లో యువతులదే ప్రజ్ఞ.



కాజల్ (కేరళ)



షెరిన్ (కేరళ)



నిధి (హైదరాబాద్)

# జయహో!

మొదటి నాలుగు ర్యాంకులూ వారికే! ఉమాహారతిది మూడో ర్యాంక్ అనుకున్నాం కదా– మరి మొట్టమొదటి ర్యాంకర్ ఇషిత. మార్కుల్లో చరిత్ర సృష్టికర్త. ఆలిండియా ఫస్ట్ ర్యాంక్ విజయురాలు. రెండో ర్యాంకర్ గరిమ. నాలుగో ర్యాంకు సాధకురాలు స్మృతి. వీరంతా సంపాదించిన మార్కులు ఎందరెందరికో ఆదర్శప్రేరకాలు. చిన్న వయసులోనే పాటవాన్ని నిరూపించుకున్నారు. ఇషిత వయసు 27. రోజూ 10 గంటలుపైగా చదివి పరీక్షలకు సంసిద్ధులయ్యారు. తాను సామాజిక సేవారంగంలో కూడా మిన్న. అనేకమంది బాలలకు చదువు చెప్పి, చెప్పించి ఉదారులయ్యారు. క్రీడల్లోనూ తానే సాటిలేని వ్యక్తి. జన్మస్థలి హైదరాబాద్ ప్రాంతం. తండ్రి ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో వింగ్ కమాండర్. ఆయన స్మృతి సూచకంగా ప్రభుత్వ సేవారంగాన్ని ఎంచుకున్నారు ఇషిత. అలాగే గరిమ, స్మృతి – వీరిద్దరికీ ప్రభుత్వ పాలనా రంగం మీద జిజ్ఞాస. హైదరాబాద్‌కే చెందిన నిధికి మూడో యత్నంలో ర్యాంకు లభించింది. అమ్మా నాన్నా స్వస్థలం కర్ణాటక అయినా, కుటుంబమంతా భాగ్యనగరంలోనే స్థిరపడిందన్నారు.

**సకలాంగుల పటిమ**

అత్యంత విశేష వ్యక్తులు మరో ముగ్గురున్నారు. వారు దివ్యాంగులు. కేరళ యువతి అఖిల ఐదేళ్ల పసిప్రాయంలోనే రోడ్డు ప్రమాదంలో చేతిని కోల్పోయారు! ఒంటి చేయి, తలరాత.. ఇటువంటి వాటి గురించీ యోచన చేయలేదు. ఆశావాదంతో నిలిచారామె. సివిల్స్ మెయిన్స్ రాస్తుంటే, విపరీతమైన వెన్నునొప్పి! అయినా తన ప్రయత్నం ఆగలేదు. ఇంతకుమించిన ఆత్మవిశ్వాస పటిమ ఇంకెక్కడైనా ఉంటుందా? కేరళకే చెందిన కాజల్ కుడిచేతికి మణికట్టు ఉండదు! అరుదైన వ్యాధి ఫలితం. అయినప్పటికీ శ్రమించి సాధించిన నేర్పరి. అదే రాష్ట్రానికి సంబంధించిన షెరిన్‌కు కొన్ని శరీర భాగాల్లో పక్షవాత సమస్య. ఆ లోపాన్ని విజయవంతంగా, ఫలప్రదంగా అధిగమించి తనదైన గుర్తింపును యువలోకంలో సంపాదించుకున్నారు. రెండు సంవత్సరాల పాటు మంచంలోనే ఉండిపోవాల్సి వచ్చింది. అటువంటి పరిస్థితిలో సైతం విద్యను ఆపలేదు సరికదా మున్ముందుకు కొనసాగించారా లలన. ఇతర సహాయంతో పరీక్ష రాసి, ర్యాంకర్ అయ్యారు.

**తెలుగు వెలుగుల ధగధగ**

తెలుగు రాష్ట్రాలకు సంబంధించి; కల్యాణి, లక్ష్మీసుజాత, శ్రుతి, సుస్మిత, వినూత్న... వీరంతా ర్యాంకులు సముపార్జించినవారే. గట్టి పట్టుతో విజేతలుగా నిలిచి స్ఫూరిమంతులుగా చరిత్రకెక్కారు. శ్రీకాకుళం జిల్లా ఒప్పంగి అమ్మాయి కల్యాణి. ఇప్పటికే గ్రూప్ వన్‌కి ఎంపికై ట్రెజరీ ఉద్యోగం చేస్తున్నారు. శిక్షణలో ఉండగానే, సివిల్స్‌లో పనిచేసే అవకాశం లభ్యమైంది. హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ చేసిన రిచా 54వ ర్యాంకుతో పటిమ చాటుకున్నారు. మరో ర్యాంకర్.. నిజామాబాద్ స్వస్థలమైన దీప్తి మాతృమూర్తి ఉపాధ్యాయురాలు. తండ్రి బ్యాంకు మేనేజరు. దీప్తి భర్త వైద్యుడు. ఆమె మామ రెవిన్యూ విభాగంలో పనిచేసి రిటైరయ్యారు. అందరి స్ఫూర్తి ఆదర్శాలతో లక్ష్యాన్ని సాధించానంటున్నారు దీప్తి. ఇలా ఎందరెందరో వికాస ప్రదాతలు, సేవారంగాన్ని సుసంపన్నం చేస్తున్న పడతులు.



**జంధ్యాల శరత్‌బాబు**
**సీనియర్ జర్నలిస్ట్**

**ఉక్కు సంకల్ప ప్రతీక**

ప్రతి సంవత్సరం లక్షల మంది యూపీఎస్సీ పరీక్ష రాస్తుంటారు. అర్హులు ఆయా ప్రభుత్వ సర్వీసులో నియమితులవుతుంటారు. ఆ పరీక్షలు ఎంతెతో ప్రతిష్ఠాత్మకలు. ఏనాడో 1854లో రూపొందిన సివిల్ కమిషన్ కాలక్రమంలో యూపీఎస్సీగా ఆవిర్భవించింది. అన్నట్లు అప్పట్లో (బ్రిటిష్ కాలంలో) లండన్‌లో మాత్రమే పరీక్ష. ఆ క్రమంలో విశ్వకవి రవీంద్రనాథ ఠాగూర్ సోదరుడు సత్యేంద్రనాథ్ పరీక్ష రాసి, కృతార్థతతో చరిత్ర సృజించిన మొదటి భారతీయుడు.

ఈ అఖిల భారత సర్వీసులన్నింటికీ పితామహుడు సర్దార్ వల్లభభాయి పటేల్. ఉక్కుమనిషి. మనం స్వాతంత్ర్యం సాధించిన సంవత్సరంలోనే ఐఏఎస్, ఐపీఎస్‌లు ఏర్పాటయ్యాయి. ఆ అనంతరం ఇండియన్ ఫారెస్ట్ సర్వీసు వంటివి జత చేరాయి. ఇంతటి ప్రతిభా సమన్విత పరీక్షల్లో విజయబావుటా ఎగురవేసి ర్యాంకర్లుగా వెలుగుతున్న యువతులందరికీ జేజేలు పలకాలందరూ. వారి సేవా సామర్థ్యాలే జాతి పురోగతి, పురోగమన వైభవాలకు దిక్సూచికలు! ★



తండ్రితో ఉమా హారతి

తల్లితో ఇషిత

కల్యాణి (శ్రీకాకుళం)

# మంచుకోట

ప్రపంచంలోనే అతి ఎత్తయిన ఎవరెస్ట్ శిఖరం మీద ఆ ఇద్దరు పర్వతారోహకులు ఆ రోజు పాదాలు మోపారు. కరచాలనం చేసుకున్నారు. అతి కష్టం మీద తప్ప ఊపిరి అందని ఆ ప్రదేశం వదిలి తిరుగు ప్రయాణం ఆరంభించారు. మే 29,1953న ఆ శిఖరం మీద ఆ ఇద్దరు గడిపిన ఆ పదిహేను అతి చల్లని నిమిషాలకు ప్రపంచ చరిత్ర సమున్నత స్థానం ఇచ్చింది. అలాంటి చరిత్రను సృష్టించినవారే టెన్జింగ్ నార్గే, సర్ ఎడ్మండ్ పెర్సివల్ హిల్లరీ. నార్గే టిబెట్ షెర్పా జాతీయుడు. హిల్లరీ న్యూజిల్యాండ్ దేశీయుడు. కానీ తరువాతి కాలమంతా సర్ హిల్లరీ (జూలై 20,1919- జనవరి 11,2008) హిమసానువులకు ప్రజలు, ప్రభుత్వాలు, పరిశ్రమలు పట్టిస్తున్న దుస్థితి గురించి క్షోభిస్తూనే ఉన్నారు. వాటి రక్షణకు తన ప్రయత్నం తాను చేశారు. 1960లో హిమాలయన్ ట్రస్ట్ పేరుతో నేపాలీలకు సేవలు ఆరంభించారు. నిజమే, పర్యాటకులు, కొందరు భక్తులు విసిరేసిన ప్లాస్టిక్ సీసాలతో కప్పడిపోయిన మంచు పర్వతాల అంచులను చూస్తే కన్నీరొస్తుంది. వాటిని శుభ్రంచేయడం కంటే పాకిస్తాన్‌తో యుద్ధంచేయడం చాలా సులభం. ఇది ఇటీవలి పరిస్థితి. కానీ అది జరిగిన సుదీర్ఘకాలం తరువాత కూడా, **మే 6, 1990 'ఇలస్ట్రేటెడ్ వీక్లీ ఆఫ్ ఇండియా'**కు హిల్లరీ రాసిన వ్యాసం (సేవింగ్ ది హిమాలయాస్) లోను మంచుపర్వతాలకు కలుగుతున్న నష్టం గురించిన ఆక్రోశమే కనిపిస్తుంది. భారత్‌కి 'పెట్టని కోట' వంటి హిమాలయాల రక్షణకోసం మనం చేసిందేమిటి? చేయగలిగిందేమిటి? అంటూ మనను మనం ప్రశ్నించుకునేటట్టు చేస్తుంది. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆ వ్యాసంలోని కొన్ని భాగాలు.

నలభయ్ ఏళ్ల క్రితం నేను మొదటిసారి నేపాల్ వెళ్లినప్పుడు అదొక అసాధారణ సుందరదేశం. ఆ అంబర చుంబిత మహా పర్వతసానువులు నేటికీ అలాగే ఉన్నాయి. కానీ వాటి నిటారు పాదాల దగ్గర దృశ్యం మాత్రం చాలావరకు మారిపోయింది. ఒకనాడున్న ఆ దట్టమైన అడవులు ఇప్పుడు తరిగిపోయాయి. వర్షాలతో భూమికోత జరిగి, ఆ మట్టంతా పర్వతాలలోని నదులలోకి, హిందూ మహాసముద్రంలోకి కొట్టుకుపోతోంది. ఇదంతా అక్కడ పర్యాటకుల సంఖ్య బాగా పెరిగిపోవడంతో వచ్చిన ముప్పు. ఎముకలు కొరికే ఆ చలిలో రాత్రిళ్లు అత్యవసరంగా మంటలు వేయడానికి కట్టెల కోసం అడవులు కొట్టిస్తున్నారు. ఇందుకు బాగా డబ్బులు ఇస్తున్నారు. ఆ ముప్పునకు ఇంకొక ప్రధాన కారణం స్థానికంగా జనాభా పెరగడం కూడా. వీళ్లు అడవులను విపరీతంగా నరికి, సాగు కోసం ఆ ప్రాంతాన్ని వినియోగిస్తున్నారు. ఇదంతా ఎప్పుడు ఆగిపోతుందో, అప్పుడు అదో అద్భుతమే అవుతుంది. భూటాన్ నుంచి పాకిస్తాన్ వరకు విస్తరించి ఉన్న హిమాలయ పర్వత శ్రేణులు ఈ భూగోళం మీద దిగ్భ్రాంతిని కలిగించే ప్రాంతాలుగా చెప్పుకోవచ్చు. అక్కడ ఆకాశాన్ని అందుకుంటున్నట్టు ఉండే పర్వతాలే కాదు, పొడవైన హిమానీ నదాలు, మహోగ్రంగా జాలువారే నదులు, విస్తృతమైన కొండపీఠాలు, వాటి మధ్య సారవంతమైన గ్రామాలు ఉన్నాయి. విస్తారమైన ఎడారులు, కారడవులకూ కూడా ఇది నిలయమే. జీవ వైవిధ్యమే కాదు, వివిధ రకాల సంస్కృతులను ఆచరించే తెగలవారు నివసించే కొండ ప్రాంతాలు కూడా ఉన్నాయి. అనేక మతాచారాలు, భాషలు కూడా కనిపిస్తాయి. 1951లో నేను తొలిసారి హిమాలయ ప్రాంతాలకు వెళ్లినప్పుడు అక్కడి ప్రజలు ఏకాంత జీవనం గడుపుతూ ఉండేవారు. వారికి పట్టణ, నగర జీవనం ఎలా ఉంటుందో దాదాపు తెలియదు. రైలు లేదా బస్సు ఎలా ఉంటాయో కూడా వారు ఎరుగరంటే అతిశయోక్తి కాదు. ఇక విదేశీయుడు అన్నవాడిని వారు అప్పటికి చూసి ఉండరు.

ఇవాళ మనం చెప్పుకుంటున్న పర్యాటకం అనేది కూడా అప్పుడు అక్కడేమీ కనిపించేది కాదు. అయితే తరువాత అక్కడ వచ్చిన మార్పు ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న సాహసోపేత పర్యాటకం వల్లనే అనిపిస్తుంది. మారుమూల ప్రాంతాలకు కూడా రోడ్లు నిర్మించారు. అలాగే ఇటీవలి కాలంలో హిమాలయ కనుమలలో డ్రైవింగ్, పర్వతారోహణ, నదులలో ఈత వంటి కృత్యాలు చేయడానికి మనుషులలో ఆసక్తి బాగా పెరిగింది. ప్రధానంగా యువతలో ఈ ధోరణి ఎక్కువ. అలాగే విమానాల రాకపోకలకు కూడా ఇక్కడ ఏర్పాట్లు చేశారు. ఇందులో కొందరు హిమాలయాలలోని పుణ్యక్షేత్రాలకు వచ్చేవారూ ఉన్నారు. ఈ మార్పు మూలంగా అంతా చేటే జరిగిందని ఎవరూ అనడం లేదు. అలా అని అంతా ఆ ప్రాంతం మంచికే అని కూడా అనలేం. పర్యాటకం ద్వారా ఆదాయం వచ్చి పడడంతో స్థానికుల జీవన



# మాయమైపోకూడదు



## సర్ ఎడ్మండ్ హిల్లరీ

ప్రమాణాలు గణనీయంగా వృద్ధి చెందిన మాట నిజమే. అదే సమయంలో అక్కడ లోయలు, దారులు, కొండ వాలులు, నదులు, సరస్సులు చెత్తచెదారంతో నిండి పోతున్నాయి. పర్యాటకుల వంటావార్పు కోసం, చలి మంటల కోసం అక్కడి అడవులు బలైపోతున్నాయి. కొండ అంచుల మీద వందలాది చిన్న చిన్న హోటళ్లు కనిపిస్తాయి. కానీ వాటిలో చాలావాటికి మరుగుదొడ్ల సౌకర్యం లేదు. కొన్నింటికి ఆ ఏర్పాటు ఉన్నా, అది ఏమాత్రం చాలేది కాదు. ఆ రకంగా అటు పర్యాటకం పెరగడం వల్ల, ఇటు స్థానిక జనాభా పెరగడం వల్ల కూడా హిమాలయ ప్రాంత పర్యావరణం దెబ్బ తింటున్నది. సాగుభూమి క్రమంగా కనుమరుగైపోతోంది. అడవులు ఖాళీ అయిపోతున్నాయి. ఇక్కడ మాయమైన సాగు కొండవాలులకు చేరింది. మరొక వాస్తవం కూడా ఉంది. పెరుగుతున్న జనాభాను అదుపు చేయడమెలాగో ఎవరికీ అంతుబట్టడం లేదు. ధనిక దేశాలలో జనాభా అదుపులో ఉంది. కానీ మూడో ప్రపంచ దేశాలకు ఇప్పటికీ పెద్ద కుటుంబమే జీవనానికి భరోసాను ఇవ్వగలుగుతున్నది. సామాజిక భద్రతకు కూడా అదే పూచీ పడుతున్నది. పెరిగే జనాభా కారణంగా పారిశ్రామికాభి వృద్ధి, ఆహారోత్పత్తి పోటీ పడవలసి వస్తున్నది. పెరిగే పర్యాటకుల సంఖ్య చాలా ప్రభావం చూపుతున్నదన్నది రూఢి అయిన సత్యం. దీనితో హిమాలయ ప్రాంతంలోని చాలా సుందర ప్రదేశాలు పూర్తిగా నిర్లక్ష్యానికి గురి అవుతున్నాయి. ఈ ముప్పు నుంచి కాస్త సాంత్వనకు ఒక పని చేయవచ్చు. స్థానిక జనాభా తక్కువ ఉన్నచోటకు పర్యాటకులను మళ్లించడానికి తగిన ఆకర్షణలు కల్పించాలి. అప్పుడు ఎక్కువ జనాభా ఉన్నచోట్లకే పర్యాటకులు కూడా చేరుతూ ఉండడం వల్ల కలిగే అనర్థాలను నివారించ వచ్చును. పర్యాట కులు కూడా హిమాలయాల సౌందర్యానికి చేటు చేయని విధంగా వ్యవహరించేందుకు పర్యాటక సంస్థలు బాధ్యత వహించాలి. భూమి మొత్తం కాంక్రీట్ జంగిల్‌లా మారిపోకుండా కాపాడుకుంటూ, దాని సహజ సౌందర్యాన్ని రక్షించడానికి మనమంతా కూడా నిబద్ధులమై ఉండాలి.

కొద్దికాలం క్రితం ఐక్యరాజ్య సమితి నిర్వ హించిన పర్యావరణ పరిరక్షణ సదస్సుకు నేను హాజరయ్యాను. అక్కడ థోర్ హెయర్‌థాల్, జాక్విస్ కాస్టొ, సర్ పీటర్ స్కాట్ వంటివారు చెప్పిన వాస్తవా లతో నేను బెంబేలెత్తిపోయాను. సాగరాలనూ, అటవీ సంపదనూ ధ్వంసం చేయడం, దానితో వస్తున్న ప్రమాదం గురించి తీవ్ర స్థాయిలో వారు హెచ్చరిం చారు. ఓజోన్ పొరకు జరుగుతున్న చేటు, భూమి వేడెక్కడంవంటి అంశాల గురించి శాస్త్రవేత్తలు చెప్పిన మాటలు కూడా కలవరం కలిగించాయి. ఈ భూ గోళం భవిష్యత్తును తలుచు కుంటూ తీవ్ర మనో వేదనతో నేను సభా మందిరం నుంచి బయటకు వచ్చేశాను. పగటివేళ లండన్ ఇచ్చే సౌఖ్యాన్నీ, ఆకుపచ్చని చెట్లనీ, నీలాకాశాన్నీ, తివాచీ వంటి ఆకుపచ్చని గడ్డినీ వాటి మీద ఆహ్లాదంగా ఆడుకుంటున్న పక్షులనూ చూశాక మనసుకు కాస్త ఊరట దొరికింది. నిజంగానే ప్రకృతి ఇంకా కాస్త అందంగానే కనిపిస్తున్నది. కాబట్టి ఏదో కొంచెం ఆశ.

ఈ కొంచెం ఆశ అయినా మిగిలి ఉండడానికి చాలా పెద్ద కృషి జరగాలి. ప్రభుత్వాలు, పారిశ్రామిక సంస్థలు, నిజానికి వ్యక్తులు కూడా ఆ కృషిని అకుంఠితంగా సాగించాలి. తనను తాను పునఃసృష్టి చేసుకునే అద్భుత లక్షణం ప్రకృతికి ఉన్న మాట నిజమే కావచ్చు. కానీ దానిని ధ్వంసం చేసే శక్తి మానవాళికి అంతకంటే ఎన్నో రెట్లు ఎక్కువ. మనం చేసే ప్రతి పనిని ఆర్థిక ప్రయోజనాలు శాసించడం నేటి చేదునిజం. పరిశుభ్ర పర్యావరణం అనే అంశం కంటే లాభార్జనకే పెద్దపీట వేస్తున్నారు. భవిష్యత్తులో ప్రజాభిప్రాయానికి ఇంకా బలం పెరుగుతుంది. ఓట్ల మీదే ఆధారపడే ప్రభుత్వాలు వారి వత్తిడికి లొంగక తప్పదు. అయితే ప్రభుత్వాలు గట్టిగా తలుచుకుంటే పరిశ్రమలను అదుపు చేయడం కష్టం కాదు. నిజానికి ఇప్పటికే పెద్ద పెద్ద పరిశ్రమలు, కార్పొరేషన్లు పరిశుభ్ర పర్యావరణ కోసం జరిగే ప్రయత్నంలో తమ భాగస్వామ్యం ఉంటుందని చెప్పాయి. కానీ ఇదొక్కటే చాలదు. చక్కని పర్యావరణం కోసం, కాలుష్య నివారణ కోసం ప్రభుత్వాలు, ప్రజలు, పారిశ్రామిక సంస్థలు కలసికట్టుగా కఠోరదీక్ష వహించాలి. అప్పుడే ప్రకృతి తన సౌందర్యాన్ని తను నిలుపుకోగలుగుతుంది. హిమాలయాలంటే అందరికీ శ్రేయస్సును కూర్చేవి. కాబట్టి వాటిని నాశనం చేసే ఏ చర్యనూ అను మతించరాదు. సాగనివ్వరాదు. అలాగే అడవులను రక్షించుకోవాలి. నివాస ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచాలి. కాలుష్యం నుంచి నదులను కాపాడుకోవాలి. కొండ ప్రాంతాలలో ఈ అందాల ప్రకృతిని నిర్దయగా, అర్థరహితంగా ధ్వంసం చేసే పనిని నిరోధించాలి. హిమాలయాల ఉనికికి ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కొనడానికే హిమాలయన్ ట్రస్ట్ ఏర్పాటు చేశాం. కాగితాల మీద ఎన్ని రక్షణ చర్యలు ఉన్నా నిష్ప్రయోజనమే. మనమంతా గట్టిగా నమ్మవలసింది హిమాలయాల రక్షణ, అక్కడి ప్రజల రక్షణ గురించి. అందుకు సంబంధించి కార్యాచరణ గురించి. అక్కడ చూపవలసిన చిత్తశుద్ధి గురించి. ★



ఎడ్మండ్ హిల్లరీ, షెర్పా టెన్జింగ్ నార్గే

# మతం మారిన వారు మళ్లీ

మతం మారిన గిరిజనులందరూ తిరిగి హిందూమతంలోకి రావాలని, వారిని సాదరంగా హిందూమతంలోకి తిరిగి ఆహ్వానిస్తున్నామని ఆదిలా బాద్ ఎంపీ, బీజేపీ నాయకుడు సోయం బాపూరావు పిలుపునిచ్చారు. మతం మారిన గిరిజనులను షెడ్యూల్డ్ తెగల జాబితా నుంచి తొలగించాలని కోరుతూ తెలంగాణ జనజాతి సురక్షా మంచ్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్‌లోని స్థానిక రామ్‌లీలా మైదానంలో గిరిజన సంస్కృతి పరిరక్షణ సమ్మేళనం పేరుతో మే 28న 'డి– లిస్టింగ్' కోరుతూ బహిరంగ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి అన్ని తెలంగాణ జిల్లాల నుంచి ఆదివాసీలు హాజరయ్యారు. ఈ సభలో మాట్లాడిన ఎంపీ, మతం మారిన గిరిజనులను షెడ్యూల్డ్ తెగల జాబితా నుంచి తొలగించాలన్న డిమాండ్‌ను తాను పార్లమెంట్‌లో ప్రస్తావిస్తానని, ఆ దిశగా అడుగులు పడిన తర్వాత, కేంద్రం తగు చర్యలు తీసుకున్న తర్వాత మతం మారిని వారు తిరిగి హిందూ మతంలోకి వస్తానంటే అంగీకరించ లేమని తేల్చి చెప్పారు. మతం మారిన గిరిజనులను వెంటనే షెడ్యూల్డ్ తెగల జాబితా నుంచి తొల గించాలని కోరారు. ఆదివాసీ గూడెల్లో క్రైస్తవ మత ప్రచారకులు గిరిజనులను ప్రలోభాలకు గురిచేసి, మతం మార్చేస్తున్నారని మండిపడ్డారు. ఇందుకు వారు అనుసరిస్తున్న పద్ధతులు గర్హనీయమని ఆయన ఆరోపించారు. అనారోగ్యానికి గురైన గిరిజనులకు పారాసిటమోల్ ట్యాబ్లెట్ ఇచ్చి, ఆరోగ్యవంతులుగా చేస్తున్నారని, కానీ గిరిజనులకు మాత్రం మాత్ర సంగతి చెప్పకుండా, ఏసుప్రభువు వల్లే ఆరోగ్యం నయమైందని మభ్య పెడుతున్నారని ఎంపీ అన్నారు. జన్వారం మొదలు ఆదిలాబాద్ వరకూ 1200 మంది గిరిజనులు మతం మారారని, ముఖ్యంగా 12 మంది పాస్టర్లు పెద్ద ఎత్తున బలవంతపు మత మార్పిళ్లకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఇలా ప్రలోభాలకు గురిచేసే వ్యక్తులు ఈ పిచ్చి ప్రయత్నాలు మాను కోవాలని, లేని పక్షంలో బుల్లెట్ దెబ్బలకు సిద్ధంగా ఉండాలంటూ తీవ్రంగా హెచ్చరించారు. సభ ముఖ్య ఉద్దేశాన్ని సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ న్యాయవాది, జనజాతి సురక్షా మంచ్ బాధ్యులు హెచ్.కె. నాగు వివరించారు.




మతం మారిన గిరిజనులను వెంటనే షెడ్యూల్డ్ తెగల జాబితా నుంచి తొలగించాలని లేకుంటే అసలైన గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగు తోందన్నారు. గతంలో ఎంపీలందరూ కలిసి.. ఈ విషయంలో ప్రయత్నం చేశారని గుర్తు చేశారు. ఇదే అంశంపై సంయుక్త పార్లమెంటరీ సంఘం కూడా ఏర్పాటైందన్నారు. రాజ్యాంగంలో 2ఏ నిబంధన 2 లో ఏం ఉన్నప్పటికీ, గిరిజన విశ్వాసాలను త్యజించి క్రైస్తవం లేదా ఇస్లాంలోకి మారిన ఏ వ్యక్తి అయినా షెడ్యూల్డ్ తెగకు చెందిన సభ్యునిగా పరిగణించొద్దని 1967 లో సంయుక్త పార్లమెంటరీ సంఘం సిఫార్సు చేసిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రస్తుత సామాజిక, రాజకీయ పరిస్థితులు వేగంగా మారిపోతున్నాయని, డీ–లిస్టింగ్ చేయని కారణంగా అసలు సిసలైన గిరిజనులు ఆర్థికంగా, సామాజి కంగా, రాజకీయంగా తీవ్రంగా నష్టపోతున్నారని హెచ్.కె. నాగు తెలిపారు.

పాండర్ కవడ– ఖేలాపూర్ నియోజకవర్గ శాసన సభ్యులు సందీప్ దూర్వే మాట్లాడుతూ.. రాజ్యాం గంలో ఆదివాసీ అన్న పదంలేని కారణంగా తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. మాజీ ఎంపీ, ప్రముఖ గిరిజన నాయకుడు కార్తీక్ ఉ్రావ్ అలకరించారు.

# పోస్ట్‌మెన్ సేవలు ప్రత్యేకమైనవి

ఎండనక, వాననక నిరంతరం విధులు నిర్వహిస్తూ, కీలకమైన సమాచారాలని మన ఇంటిదగ్గర అందించే పోస్ట్‌మెన్ సేవలు నిరుపమానమైనవని, అందులో భాగంగానే వారు 'జాగృతి' జాతీయ వారపత్రికను ప్రజానీకానికి చేర్చడంలో ప్రశంసనీయమైన సేవలు అంది స్తున్నారని నిర్మల్ కేశవ సేవాసంఘం ప్రముఖులు కట్టా నాగాచారి అన్నారు. పోస్ట్‌మెన్ సేవాపరాయణ త్వానికి గుర్తుగా నిర్మల్‌లో వారిని ఘనంగా సత్క రించారు. సమాచారాన్ని సమాజానికి చేర వేయడంలో పోస్ట్‌మెన్‌దే కీలకపాత్ర అని నాగాచారి కొనియాడారు. జాగృతి వారపత్రిక, కేశవ సేవా సంఘం సంయుక్తంగా నిర్మల్ నగరంలో పద్మశాలి సంఘ భవనంలో మే 23న సన్మాన కార్యక్రమం నిర్వహించాయి. జాగృతి ప్రముఖ్ రాఘవులు, జిల్లా సంఘచాలక్ నూకల విజయ్‌కుమార్ వేదికను అలకరించారు.

తరువాత పోస్ట్‌మెన్ స్పందించారు. ప్రియదర్శిని నగర్ పోస్ట్‌మెన్ బి. దుర్గయ్య మాట్లాడుతూ, తాను ప్రతి వారం జాగృతితో పాటు 250 వివిధ పత్రికలను ఆయా చిరునామాలకు చేరుస్తున్నాననీ, దీనిని గుర్తించి జాగృతి వారు ఈ రకంగా సన్మానించడం ఎంతో ఆనందంగా ఉందనీ చెబుతూ, జాగృతి వారపత్రికకు ధన్యవాదాలు తెలియజేశారు. మరో పోస్ట్‌మెన్ పంకజ్‌కుమార్ మాట్లాడుతూ, తాను సుమారు 200 వివిధ పత్రికలు ప్రతివారం ఇంటింటికి చేరవేస్తున్నాననీ, ఇలాంటి సత్కారం వృత్తి విషయంలో ఎంతో ఉత్తేజాన్ని ఇస్తుందనీ

# హిందూధర్మంలోకి రావాలి!



## గిరిజన సోదరులకు అదిలాబాద్ ఎంపీ బాపూరావు పిలుపు

**మతమార్పిళ్లు ఆపకుంటే తుపాకీ దెబ్బలు తప్పవు.**

డీ-లిస్టింగ్ విషయంలో విశేషంగా ప్రయత్నాలు చేశారని, వారి కారణంగానే ఈ ఉద్యమం ఇంత వేగంగా దేశంలో బలపడుతున్నదని అన్నారు. గిరిజన సంస్కృతి అత్యంత విశేషమైందని, దీని పట్ల అందరూ వినమ్ర పూర్వకంగా ఆచరిస్తూ… నడుచుకోవాలని సూచించారు. మతం మారిన గిరిజనులను షెడ్యూల్డ్ తెగల జాబితా నుంచి తొలగించే ప్రయత్నం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హయాంలో కొద్దిగా జరిగిందని, అయితే, క్రైస్తవ లాబీయింగ్ దీనికి అడ్డు పడిందని పేర్కొన్నారు. దీంతో ఆదివాసీలు తీవ్రంగా నష్టపోయారన్నారు. కార్తీక్ ఉరాన్ కాలంలోనే ఈ డిమాండ్ ప్రారంభమైందని, దాని తర్వాత జనజాతి సురక్షామంచ్ ఆధ్వర్యంలో దేశంలో అత్యంత వేగంగా ఉద్యమం ముందుకు సాగుతోందన్నారు. కొన్ని పార్టీలకు కేవలం గిరిజన ఓట్లు మాత్రమే కావాలని, కానీ బీజేపీ గిరిజన మహిళ ద్రౌపది ముర్ముకు రాష్ట్రపతి వంటి అత్యున్నత రాజ్యాంగ పదవి ఇచ్చిందని గుర్తు చేశారు. మత మార్పిళ్ల పేరుతో గ్రామాలకు వచ్చే వారి విషయంలో అత్యంత జాగరూకతతో ఉండాలని ఎమ్మెల్యే సందీప్ దూర్వే సూచించారు.

మతంమారిన గిరిజనులను వెంటనే షెడ్యూల్డ్ తెగల జాబితా నుంచి తొలగించాలని కిన్వట్ ఎమ్మెల్యే కేరాం భీంరావ్ కూడా తన ప్రసంగంలో కోరారు. జనజాతి సురక్షా మంచ్ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా ఈ ఉద్యమం నడుస్తోందని గుర్తు చేశారు. కొంత మంది గిరిజనులు వారి వారి తెగ సంస్కృతి, సంప్రదాయాలను విడిచి, క్రైస్తవులు, ముస్లింలుగా మతం మారిపోతున్నారన్నారని, ఇది శోచనీయమని అన్నారు. అయినా షెడ్యూల్డు తెగలకు చెందాల్సిన సౌకర్యాలను పొందుతున్నారని మండిపడ్డారు. దీంతో నిజమైన గిరిజనులు పొందాల్సిన సౌకర్యాలు, హక్కులను 80 శాతం మేర నష్టపోతున్నారన్నారు.

ఈ సందర్భంగా స్థానిక శ్రీ సరస్వతీ శిశు మందిర్ హౌసింగ్ బోర్డు పాఠశాల నుంచి ప్రధాన వీధుల గుండా రామ్‌లీలా మైదానం వరకూ గిరిజనులు వాసీలు జనజాతి సురక్షా మంచ్ జెండాలను చేతబూని భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిడాం భీమ్‌రావ్, మెస్రామ్ దుర్గు, వినాయక్ రావ్ మహారాజ్, పంద్రమ్ జైవంత్ రావు, సిడాం తులసీరాం పటేల్, మెస్రమ్ అను పటేల్, యశ్వంత్ మహారాజ్, కొడప సోనేరావు, ఆత్రం నాగుబాయ్, టేకాం చంటుబాయ్, మేకల లింగస్వామి, ఆత్రం భీంరావు, కోటా సురేందర్, కొండపు నగేష్, మెస్రం రాజేశ్వర్, తొడసం అజయ్‌తో పాటు జనజాతి సురక్షా మంచ్ అఖిల భారత అధికారులు, జనజాతి సురక్షా మంచ్ తెలంగాణ ప్రాంత అధికారులు, వనవాసీ కల్యాణ పరిషత్ అఖిల భారత స్థాయి అధికారులు, వనవాసీ కల్యాణ పరిషత్ తెలంగాణ ప్రాంత స్థాయి అధికారులు పాల్గొన్నారు. ★



అన్నారు. దీనిద్వారా మరింత బాధ్యతతో, విధులు నిర్వర్తించడానికి దోహదం చేస్తుందని సంతోషంగా చెప్పారు. నగర ప్రచార ప్రముఖ్ శ్రీధర్ కార్యక్రమం నిర్వహించారు. జాగృతి పాఠకులు, జ్యేష్ట కార్యకర్త సోలాపూర్ రాజేశ్వర్ , మైసర్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు. సన్మాన కార్యక్రమం అనంతరం జాగృతి పాఠకుల సమావేశం నిర్వహించారు. వారపత్రిక చందాల పెంపు, పోస్ట్‌మెన్‌తో నిరంతర సంపర్కంలో ఉండడం గురించి కూడా చర్చించారు. ★

నైజాం విముక్త స్వాతంత్ర్య అమృతోత్సవాలు

# రజాకారుల చెర వీడిన

1947 తరువాత నిజాం నవాబు తన గద్దెను కాపాడుకోవడానికి 'అనల్ మలిక్' (ప్రతీ ముస్లిం పాలకుడే) సిద్ధాంతానికి మెరుగులు దిద్దాడు. భారత్ వత్తిడి చేస్తే పాకిస్తాన్‌లో చేరతానని బెదిరించేవాడు. అయితే పాకిస్తాన్ పెత్తనం అతడు సహించ లేదు. బహదూర్‌ఖాన్ మజ్లిస్ ఇత్తెహాదుల్ ముసల్మీన్ స్థాపించడానికి తోడ్పడ్డాడు. బహదూర్ ఖాన్ మరణించాక ఖాసీం రజ్వీ నాయకుడయ్యాడు. ఇతని ఉపన్యాస ధోరణి తీవ్రమైనది. భాషా ప్రయోగం తీక్షణంగా ఉండేది. నిజాం నవాబు రజ్వీకి అనధికారికంగా అధికారం హస్తగతం చేశాడు.


దాశరథి రంగాచార్య

అసలే మత పిచ్చి. అందునా అధికారం చేతికి వచ్చింది. రజ్వీ సుమారు లక్ష మంది అనుచరులను తయారు చేశాడు. వాళ్లే రజాకారులు. మిర్జా ఇస్మాయిల్ తరువాత ప్రధాని అయిన చిత్తారే నవాబు మీసాలు పట్టుకొని నోట్లో ఉమ్మేటంతటి సాహసం చేశాడు రజ్వీ. నిజాం ప్రధానిని మార్చుకున్నాడు కానీ, రజ్వీని పల్లెత్తు మాట అనలేదు. ప్రధానిగా లాయక్ ఆలీని తెచ్చుకున్నాడు. అలాగే పనాహ్ గజీర్ (శరణార్థులు)లను తెచ్చుకున్నాడు. వారు హైదరాబాద్ ఫుట్‌పాత్‌ల మీద ఉంటూ అర్ధరూపాయికి ప్లేటు బిర్యానీ అమ్మేవారు. జనం ఎగబడ్డారు. ఎలా సాధ్యం అని ఆలోచించలేదు. తరువాత రజకులు తమ గాడిదలు కనపడడం లేదని ఫిర్యాదు చేశారు. పోలీసుల పరిశోధనలో నిజం తెలిసింది. గధేకి బిర్యానీ-దోభియోకీ పరేషానీ అంటూ ఉర్దూ పేపరులో వచ్చింది.

బ్రిటిష్‌వారు వెళ్లిపోవడంతో ఆంధ్రా ప్రాంతం స్వతంత్రమైంది. కానీ నైజాం నిరంకుశ నిజాం ఏలుబడిలోనే ఉంది. అక్కడి చట్టాలూ, పరిపాలనా, శిక్షలు వేరు. పరిస్థితులు అతి దారుణంగా పరిణమిస్తున్నాయి. ప్రజల ప్రాణ, ధన, మానాలకు రక్షణ లేకుండా పోయింది. వీటిలో గార్ల జాగీరు ఒకటి.

దాశరథి రంగాచారి, చిలుకూరి శ్రీరాములు ఈ ప్రాంతం వారే.

చిలుకూరి శ్రీరాములు సౌమ్యులు, విద్యాంసులు. ఆనందరామాయణ కర్త. గార్లలో మంచి పలుకుబడి గలవారు. కొంతకాలం జాగీరుబడిలో ఉపాధ్యాయులుగా పనిచేశారు. దాశరథికి ఆప్తులు. ప్రభుత్వ అధికారులతోనూ, వర్తకులతోనూ మంచి సంబంధాలున్నాయి. వారిలో చాలామంది ఆయన విద్యార్థులు. శ్రీరాములు సతీమణి ఆదరణీయురాలు. పెద్ద ముత్తైదువ. వదాన్య. ఆమె మీదనే దారుణం జరిగింది. లైంగిక అత్యాచారం జరిగింది. ఆ అభిమానవతి వెంటనే బావిలో పడి ఆత్మహత్య చేసుకున్నది. రషీద్ బొర్రా తహశీల్దారు కొడుకు. ప్రస్తుత తహశీల్దారు తమ్ముడు. వారు కోరుకున్న ఆడది పక్కన చేరాల్సిందే. రషీద్ రజాకారుల్లో చేరాడు. సాలార్ (కమాండర్) అయ్యాడు. అనలే దుష్టుడు అధికార అండ లభించింది. ఇక చెప్పాలా, చెలరేగి పోయాడు.

శ్రీరాములు ఊరిలో లేని సమయంలో ఓ రజాకార్ వారి ఇంటికి వచ్చాడు. ఆయన శ్రీమతి ఒంటరిగా ఉన్నారు. వారి గేదె బందెలదొడ్డిలో పడ్డదని, వచ్చి విడిపించుకు వెళ్లమన్నాడు. ఆమె నమ్మింది. వచ్చిన వాని వెంట వెళ్లింది. అతడు రషీద్ దగ్గరకు తీసుకువెళ్లాడు. అతడే తహశీల్దారు అనుకుందామె. బిడ్డ ముందు తల్లి నిలిచినంత నమ్మకంతో నిలిచింది. తన బర్రెను వదలమని ధైర్యంగా అడిగింది. రషీద్ అంటే తండ్రి "నిఖా" చేసుకున్న ఆమెను ఉంచుకున్న నీచుడు. శ్రీరాములు సతీమణి వలువలు లాగేశాడు (దాశరధి తన ఆత్మకథ 'జీవనయానం' 237 పేజీలో 'రషీద్ వాడిన భాష నేను ఇక్కడ వ్రాయలేదు, సమంజసం కాదు' అని పేర్కొన్నారు). ఆమె ఇంటికి వచ్చి బావిలో దూకి మరణించింది. మస్తాన్ తహశీల్దార్ మార్బలంలోని వాడు, దాశరథి శిష్యుడు. ఇంటికి వచ్చి విషయం చెప్పాడు.

దాశరథి, గ్రామస్తులు కలసి తహశీల్దారు ఇంటికి వెళ్లారు. తహశీల్దారు అపరాధిలా తలవంచుకొని నుంచున్నాడు. "హై షర్మిందా హూ సారే కాయేనాత్ షర్మిందాహై. మై ముజ్బూర్ హు మదద్ నహీ కర్ సక్తా"(నేను సిగ్గుపడుతున్నాను, సమస్త ప్రకృతి సిగ్గుపడుతుంది. నేను నిస్సహాయుణ్ణి, ఏమీ చేయలేను) అన్నాడు. ప్రధాని చిత్తారి నవాబ్ నోట్లో ఊసిన రజాకార్లను మందలించలేని నిజాం నవాబు లాంటివాడే తహశీల్దారు. రాత్రి వేళప్పుడు అఫ్జల్, మస్తాన్ దాశరథిని కలసి మీరు ఇక్కడ ఉండవద్దు. ఆంధ్రా ప్రాంతంలో ఎక్కడికైనా పారిపొమ్మన్నారు.

అదే రాత్రి మిత్రుడు పానుగంటి నాగేశ్వరరావు, దామినేని వేంకటేశ్వర్రావులు దాశరది ఇంటికి వచ్చారు. రషీద్‌పై ఎదురు దాడి చేయాలని గట్టిగా చెప్పారు వారిద్దరూ. కానీ దాడి జరిగితే గ్రామం దగ్ధమవుతుంది. నిర్దోషులు బలి అవుతారని దాశరథి వారిని శాంతపరిచి పంపించేశాడు. కాని వారిద్దరూ ఒకరి తరువాత ఒకరు బలయ్యారు. రషీద్‌ను ఎవరూ ఏమీ చేయలేకపోయారు. కానీ దైవిక న్యాయం గొప్పది. ఒక స్త్రీ విషయంలోనే రషీద్ హతుడయ్యాడు.

రజాకార్లు గొల్లచర్ల గ్రామంపై పడ్డారు. ఇళ్లు తగుల బెట్టారు. తగలబడుతున్న ఒక ఇంట్లోంచి ఒక తల్లి పసిబిడ్డను భుజాన వేసుకొని బయటపడ్డది. అది ఒక రజాకారు చూశాడు. పసిబిడ్డను తల్లి నుంచి గుంజుకున్నాడు. మంటల్లోకి విసిరేశాడు. తల్లి బిడ్డ కోసం మంటల్లోకి ఉరికింది. తల్లీబిడ్డలు మసి అయ్యారు. గొల్లచర్లలో దోచుకున్న మంగళసూత్రాలు, బంగారం బిందెలలో నింపుకుని పట్టుకుపోయారు. స్త్రీలను నానా హింసలు పెట్టారు. సామూహిక

మానభంగాలు చేశారు. వక్షోజాలు గాయపరిచి ఆనందించారు. ఎంతమందిని హత్య చేశారో లెక్కలేదు. ఊరు వల్లకాడు చేసిపోయారు. ఆ తరువాత పెరుమాళ్ల సంకేస గ్రామంపై దాడి చేశారు.'అల్లాహో అక్బర్', 'ఆజాద్ హైదరాబాద్ జిందాబాద్', 'అలా హ్రజత్ – పాయిందాబాద్' అన్న నినాదాలు చేస్తూ ధ్వంసం చేశారు. తుమ్మా శేషయ్య కోసం వచ్చారు. తలుపులకు బయట నుండి గొళ్లేలు పెట్టారు. ఇళ్లకు నిప్పంటించారు. ఇళ్లు తగులబడుతున్నాయి. లోపల చిక్కుకుపోయిన వారి హాహాకారాలు విని రజాకార్లు ఆనందంతో గంతులేశారు.

ఊరి బయట రజాకార్లు చితి పేర్చారు. దొరికిన వారిని సజీవంగా అందులోకి తోశారు. కాలుతున్న ఇళ్ల నుంచి బయటకు వచ్చిన వాళ్లను దారుణంగా కాల్చి చంపారు. జిహాద్ జరిగిపోయిందని పట్టలేని ఆనందంతో పరుగులు పెట్టారు. చితిమంటల వెలుగులో తాగారు, తిన్నారు. తందనాలాడి గ్రామం నుండి కదిలారు. కొద్ది రోజుల తర్వాత రజాకార్ల బయ్యారం గ్రామంపై దాడి చేయడానికి బయలు దేరారు. మహిళలు కారం కలిపిన నీళ్ల ముంతలతో

# రంగాచారి

రజాకార్ల వెంటపడ్డారు. గిరిజన మహిళలు కొరకంచులు పట్టుకుని అంటించారు. పురుషుల కర్రలతోనూ బరిసెలతోనూ ఎదిరించారు. చెట్టు కొకడు, గుట్టకొకడు పరుగులు తీశారు. అలా పారిపోయేటప్పుడు ఇద్దరు యువతులను ఎత్తుకు పోయారు. తరువాత వారి మృతదేహాలు కన్పించాయి. అయితే రజాకారులు వెళ్తూ వెళ్తూ పంటలకు నిప్పటించి పారిపోయారు. పంటలు బూడిదై పోయాయి.

దామినేని వెంకటేశ్వర్రావు కోసం రంగాపురానికి రజాకారులు గుర్రాల మీద వచ్చారు. దామినేనిని చూపించమని అనేక మందిని కొట్టారు. ఆడవాళ్ల జుత్తు కత్తిరించారు. దిగంబరంగా తిప్పారు. మానభంగాలు చేశారు. అయినా వారు చెప్పలేదు. ఈ లోగా దామినేని పారిపోవడానికి ప్రయత్నించగా కాల్చి చంపారు.

గూడా సూర్యనారాయణమూర్తి దాశరథి మిత్రబృందంలోని వాడే. కానీ రాజకీయాలకు కాస్త దూరం. సర్కారీ కొలువు చేస్తున్నాడు. హైదరాబాదు నుండి త్రివర్ణ పతాకం తెచ్చాడు. కాంగ్రెసు వారు జాతీయ పతాకం ఎగురవేసే కార్యక్రమం చేపట్టారు. ఆ కార్యక్రమానికి ప్రభావితుడయి సూర్యనారాయణ పతాకం తెచ్చాడు. అది ఎగుర వేసే కార్యక్రమం కోసం దాశరథి ఇంటికి వచ్చాడు. అదే సమయానికి బీరోలు అమృతరెడ్డి మరో క్లాసుమేట్ కూడా వచ్చారు. వాళ్లకు టీ ఇచ్చిన దాశరథి తల్లి తన ముగ్గురు కూతుళ్లను తీసుకుని ఊరు వదిలి వెళ్లి పోదలుచుకున్నట్లు చెప్పారు. కొద్దిరోజుల తరువాత బెజవాడ చేరుకున్నారు. ఆ సమయానికి పెద్ద కొడుకు దాశరథి కృష్ణమాచారి జైలులో ఉన్నారు. చిన్న కొడుకు తాసీలు కచేరీ మీద జెండా ఎగరేయాలని నిర్ణయించుకున్నాడు. ఆ సాహసం ఏమిటో తెలియదు, 'పోతే ప్రాణమేగా' అనుకున్నారు.

మీసాల సర్వర్ జమేదార్ దాశరథి ఇంటికి వచ్చి దగ్గాడు. అతడు దగ్గాడంటే ఎవరికో మూడిందని. 'మోజీమీ సాబ్ బులారై' (పోలీసు సూపర్నెంటు పిలుస్తున్నాడు) అన్నాడు సర్వర్. 'నేను రేపు వెలుగు రేఖల్ని చూడను' అనుకున్నారు దాశరథి. సర్వర్, దాశరథి బయలుదేరి స్టేషన్‌కు వెళ్తున్నారు. ఇంతలో పూసాల నారాయణ అరుగు మీద నిలబడ్డాడు.

**ఊరి బయట రజాకార్లు చితి పేర్చారు. దొరికిన వారిని సజీవంగా అందులోకి తోశారు. కాలుతున్న ఇళ్ల నుంచి బయటకు వచ్చిన వాళ్లను దారుణంగా కాల్చి చంపారు. జిహాద్ జరిగిపోయిందని పట్టలేని ఆనందంతో పరుగులు పెట్టారు. చితిమంటల వెలుగులో తాగారు, తిన్నారు. తందనాలాడి గ్రామం నుండి కదిలారు. కొద్ది రోజుల తర్వాత రజాకార్ల బయ్యారం గ్రామంపై దాడి చేయడానికి బయలు దేరారు. మహిళలు కారం కలిపిన నీళ్ల ముంతలతో రజాకార్ల వెంటపడ్డారు.**

సర్వర్‌ను చూడలేదు "ఎక్కడికి" అని దాశరథిని అడిగాడు. సర్వర్ విన్నాడు. 'అబె సునార్ తూభీ చెల్ '(అరె కంసాలి నువ్వు నడువు) అన్నాడు. నారాయణ భార్య భోరుమని ఏడ్చింది. ఎదురుగా సూర్యనారాయణ పులిహోర ప్రసాదం తెస్తున్నాడు. "అబె బొమ్మన్ తూబీచెల్" (ఒరే బాపనోడా నువ్వు నడువు) అన్నాడు సర్వర్. అమృతారెడ్డి పక్క చుట్ట చంకన బెట్టుకొని వస్తున్నాడు "రెడ్డీ సాబ్ ఆప్ భీ చెలియే" అన్నాడు సర్వర్ సలాంకొట్టి. మా నలుగురిని కాజీం ఆలీ పోలీసు మెహత మీర్‌కు అప్పజెప్పాడు. పిస్తోలు అతని చేతిలో ఉంది. 'అరె గాంధీ కె బచ్చే ఇదరా' అన్నాడు దాశరథిని పిస్తోలు మడమతో బుర్ర మీద కొట్టి. అమ్మా అన్నాడు దాశరథి 'అమ్మా క్యోం బోల్తా' (అమ్మ అని ఎందుకంటావురా! గాంధీ అను. మీ అయ్య గాంధీ కదా) అన్నాడు. (ఇక్కడ వాడు వాడిన పదాలు రాస్తే ఆవేశకావేశాలకు దారితీస్తాయి) బొమ్మన్ బీక్ మాంగ్యా! సర్కార్ చెలాతా! దేఖ్తే రహో సారా హిందూస్థాన్ పాకిస్థాన్ బన్‌జాయోగా (బాపనోడా



**కాశింశెట్టి సత్యనారాయణ**
**విశ్రాంత ఆచార్యుడు**

(నెహ్రూ) బిచ్చం అడుక్కోవాలి, రాజ్యం ఏలతాడా? చూస్తూండు హిందూస్థాన్ సొంతం పాకిస్తాన్ అవుతుంది) అంటూ కాజీం ఎన్ని దెబ్బలు కొట్టాడో తెలియదు. మొదటి రెండు దెబ్బలే నొప్పిపెట్టాయి. తరువాత ఏమీ తెలియలేదు అంటారు దాశరథి (కాజీం భారతదేశాన్ని, నేతలనీ, జెండాని అనరాని మాటలు అన్నాడు). రిమాండు గదికి తీసుకువెళ్లి లోపల ఖాళీ లేక ఓ రికార్డులు ఉంచే గదిలో బంధించారు. అప్పటికే రిమాండులో ఉన్న రావూరి గోపయ్య లాంతరు వెలుగులో దాశరథి ఒంటి మీద దెబ్బలు చూశారు. రిమాండు ఖైదీలందరినీ వారి బంధువులు విడిపించుకెళ్లారు. దాశరథి ఒక్కడే మిగిలారు.

మస్తాన్, అప్జల్ అనే తన స్నేహితుల సహాయంతో పోలీసు కస్టడీ నుండి తప్పించుకున్న దాశరథి పినరెడ్డిగూడెం చేరారు. పెండ్యాల చలమయ్య రాత్రికి రాత్రి బండి కట్టించారు. కచ్చడం బండికి తెరలు కట్టారు, ఆడవారు ప్రయాణం చేస్తున్నట్లు కనపడ్డం కోసం. ఎవడైనా అడిగినా పలకడం కోసం వారి భార్యను దాశరథి వెంట పంపారు. మంగలగూడెంలో చలమయ్య తండ్రి ఉంటారు. అక్కడికి చేరారు. అక్కడ గుండు కొట్టించుకుని పూజారి వేషం వేశారు దాశరథి. పాపటపల్లిలో రైలు ఎక్కారు. ఎవరూ గుర్తించలేదు. ఎర్రుపాలెం ఒక ప్రమాద కరమైన స్టేషన్. అది దాటితే యూనియన్ ప్రాంతం (ఆంధ్రా) మొదలవుతుంది. ఎర్రుపాలెంలో పోలీసులు, రజాకారులు బండిని సోదా చేస్తారు. అక్కడ బండి సుమారు గంటపైగా ఆపారు రజాకారులు. మళ్లీ కదులు అనే వరకు బండి కదలదు. ఏవో శ్లోకాలు చదివి, ఊర్ధ్వా రానట్లుగా నటించి మొత్తం మీద బెజవాడ చేరుకున్నారు దాశరథి. రావూరి గోపయ్య దాశరథిని కౌగిలించుకొని గిరగిరా తిప్పారు.

దాశరథి బ్రతికి బయట పడినందుకు వారు ఎంతో ఆనందిం చారు. ఎందుకంత ఆనందం? అదే మానవత్వం, అదే ఆత్మీయత, అదే అనురాగం, అదే ప్రేమ, అదే వాత్సల్యం, అదే అనుబంధం, అదే జీవితం అంటారు దాశరథి. బహుశ నాలుగు వేదాలను ఆంధ్రీకరించడానికే వారు ఆనాడు బ్రతికి బయటపడ్డారు. ★

కథ

# అవ్వా...

అడవి అంతా అగ్గిపూవులనే మోదుగుపూల వేనిఛాయతో ఇప్పపూల కమ్మటి తియ్యటి గుబాళింపుతో నవవధువులా ఎంతో సింగారంతో మెరుస్తుంది.

నింగిపై నారింజరంగు వెలుతురును తుడిపేసి రాత్రి తన నల్లరంగుల్ని మెల్లగా అలుకుతుంది.

అవ్వమ్మ తన చన్నులకు వేలాడుతూ వాటిని గుద్దిగుద్ది పాలు తాగుతూ తన పొట్టమీదుగా క్రిందికి జారుతున్న యిద్దరు చంటి బిడ్డల్ని పైకి లాక్కుం టుంది. ఆమెకు పద్నాలుగో కాన్పులో కలిగిన చక్కని కవలలు వాళ్లిద్దరు.

'ఎంత ఆకలి ఈ ఇద్దరిది! వీళ్లు దంతాలు పెంచుకుని మాంసానికి మరిగినాక మిగతావాళ్లకు ఒక్క కీలుబొక్క గూడ మిగల్చరేవో!' అని అనుకుంటూ వాళ్ల నెత్తిమీద ముద్దులు పెట్టుకుంది.

తన బిడ్డల్లో మూడోవాడికీ, ఏడోవాడికీ అంతే ఆకలి. వాళ్లిద్దరూ యింతే. మాంసానికి మరగక ముందు సమున్నత శిఖరాగ్రాలపై అర్ధరాత్రి వేళల్లో పడి కాల్చే పిడుగుల్లా తన రొమ్ములపై బడి చివరి బొట్టు వరకూ పాలు జుర్రుకునేవాళ్లు. 'అందుకే మాంసానికి జేజేలు. అదే గనుక లేకుంటే ఈ పిల్లలు జీవితాంతం తన పాలిండ్లకే వేలాడుతుంటారు కాబోలు!' అని అనుకుంటూ నెగడు దగ్గరకొచ్చి కూర్చొని ఆదియ్య కోసం నిరీక్షించసాగింది. చిక్కని గులాబీరంగు జ్వాలలతో భగభగమండుతున్న సంద్రకొయ్యల నెగడు చుట్టూ పుల్లలతో, చెకుముకి రాళ్లతో ఆడుకుంటున్న పిల్లల దేహాలు బ్లడ్ మూన్స్ లా ప్రకాశిస్తున్నాయి.

ఆదియ్య అల్లంత దూరంలో కనపడగానే పిల్లలంతా తూనీగల్లా ఎగురుతూ అతనికి ఎదు రెళ్లారు. అవ్వమ్మ లేచి రొమ్ముల మీదున్న కవల శిశు వుల్ని రాతిబండ మీద ఆకుల పక్కపై పడుకోబెట్టి వచ్చి నెగడులోకి రెండు బాగా ఎండిన సంద్ర పుల్లలులాగి సిద్ధంగా నిలబడి ఉంది.

ఆదియ్య అవ్వమ్మను చూస్తూ సంతృప్తిగా నవ్వుతూ రెండు వెదురు కర్రలకు పొదుచుకొని వచ్చిన దుప్పిని భుజాల మీద నుండి దింపి, నెగడు పక్కన పడేసి గుహ పక్కనే రాతిగుంటలో నీళ్లు తాగొచ్చి అలసట తీర్చుకుంటున్నాడు.

అవ్వమ్మ పదునైన కొస కలిగి చిన్న శంఖంలా ఉన్న రాతి ఆయుధంతో ఒడుపుగా దుప్పితలను వేరు చేసింది. చకచకా తోలు తీసేసింది. దుప్పిని నెగడు అంచులో కణకణమండే నాలుగు కొరకాసులు, నిప్పులు కొన్ని బైటకి లాగి కాల్చుతుంటే పిల్లలంతా ఆకలి కళ్లతో ఆమె చుట్టూ మూగారు. దుప్పితలను కూడా ఒక గట్టి పొడవాటి కర్రకు గుచ్చి కాల్చ సాగింది.

ఆదియ్య పెద్దపెద్ద ఆకులు కోసుకొచ్చి నెగడు పక్కనే చాపలా పేర్చాడు. ఒక గంట ఆగి అవ్వమ్మ లేత సిందూరం రంగులోకి చక్కగా నిప్పులపై ఉడికిన దుప్పిని బయటకు లాగి పేర్చిన ఆకులపై పెట్టింది. కొంచెం చల్లారినాక తను కాల్చిన దుప్పి తలకాయ పైన అక్కడక్కడా కవురెక్కిన తోలు తొలగించి, ప్రేమగా నవ్వుతూ అదియ్య చేతిలో పెట్టింది. తర్వాత తను కూర్చొని చిన్న రేకులాంటి ఇసిరెతో చక్కగా కాలిన దుప్పి మాంసాన్ని కొంచెం కొంచెంగా చీల్చి యిస్తుంటే పిల్లలంతా చుట్టూ కూర్చొని లొట్టలేసుకుంటూ, ఒకరినొకరు ఊరించు కుంటూ వేడి వేడి మాంసం యిష్టంగా తింటున్నారు.

"అవ్వా...." ఏడోవాడు ఏడ్చాడు బిగ్గరగా.

"ఏంటి నాయనా....?" ఆదుర్దాగా అడిగింది అవ్వమ్మ.

"నాకది కావాలి!" అంటూ తండ్రి కొరుక్కు తింటున్న దుప్పి తలవైపు చూపించాడు వాడు.

"రా బిడ్డా రా ......" అంటూ తండ్రి పిలవగానే



వాడు తింటున్న ముక్కను మట్టిలో పడేసి తండ్రి ఒళ్లోకెళ్లి కూర్చొని ఆయన చిన్న చిన్న ముక్కల్ని కొరికి పెడుతుంటే దుప్పి తలమాంసంను ఇష్టంగా నమలసాగాడు.

పిల్లలంతా అలా ఎంతో సఖ్యంగా ఐక్యంగా కూర్చొని ఎంతో సంతోషం, సంతృప్తి నిండిన కళ్లతో ఒకరినొకరు చూసుకుంటూ, వాళ్ల పాలబుగ్గలకు అంటిన మాంసపు చమురు నెగడు వెలుగుల్లో తళతళా మెరుస్తుండగా ఆ లేతదుప్పి మాంసం భుజిస్తూ ఉండటాన్ని చూస్తున్న అవ్వమ్మకు, ఆదియ్యకు ఎంతో సంబురంగా ఉంది.

సకల రుతువుల్లో ఆ అడవి పచ్చగా ఉండాలని, అక్కడ వేల వన్యజీవులు నిత్యం వర్ధిల్లాలని ఆదియ్య,

# …వ్వ పెట్టావే!

**వేణు మరిదు**



అవ్వమ్మ అష్టదిక్కుల వైపూ తిరిగి అప్పటికింకా రూపు దాల్చని అమూర్త దేవరలకు మొక్కున్నారు. తమ బిడ్డలంతా అలా సఖ్యంగా ఐక్యంగా ఉంటూ, పుష్టిగా తింటూ ఎదగాలని వంగి వనానికి మొక్కుతూ ప్రార్థించుకున్నారు. అంతా సుష్టుగా తిన్న తర్వాత తమ పిల్లలందర్నీ గుహలోకి చేర్చి అందరూ హాయిగా చల్లగా నిద్రపోయారు. అర్ధరాత్రి వేళ కవలపాపలు గురకపెట్టి నిద్రిస్తున్న అవ్వమ్మ రొమ్ములపైకి ఎగబాకి చ్.. చ్చ్.. చ్చ్ మంటూ పాలుగుంజటం మొదలుపెట్టారు. ✻ ✻

అప్పటికింకా తయారుకాని అమూర్త దేవతలకు అవ్వమ్మ ఆదియ్య ఎంత మొక్కినా ప్రయోజనం లేకుండా పోయింది. మూడేళ్ల దారుణ అనావృష్టి వల్ల అడవి ఎండింది. వాగులు కుంటలు నెర్రెల నోళ్లు తెరిచాయి. నీటి బుగ్గలన్నీ ఇంకిపోయాయి. చాలాకాలం పాటు ఒక్క పువ్వూ పూయలేదు. ఒక్క పండూ రాలలేదు. కుందేళ్ల నుండి సింహాల వరకూ, నెమళ్ల నుండి తాబేళ్ల వరకూ వన్యజీవులన్నీ దాహంతో ఆర్తిగా అరిచాయి. ఒక్కొక్క జంతువూ అడవినొదిలిపెట్టి అనంత దూరాలకు వలసెల్లిపోసాగాయి. మిగిలినవేమో అడవిలోనే ఎండకు మాడి మరణించాయి.

అడవిలో అకాల,అనూహ్య క్షామానికి ఆదియ్య,అవ్వమ్మలు కుదేలయ్యారు. దుప్పులు, కణుజుల సంగతేమోగానీ కుందేళ్లు కూడా కరవైనాయి. ఆధునికునికైనా, ఆదిమజాతివానికైనా దీర్ఘకాల ఆకలి ఘోరకలే కదా! పిల్లల డొక్కలెండి పోయాయి. ఎక్కడో దూరంగా ఒక చోట కొండరాళ్ల మధ్య చిన్నచెలమి నుండి చుక్కలు చుక్కలుగా ఊరే కొద్ది నీటిని ఆకు దొప్పల్లో పట్టి తెచ్చి దాహం తీరుస్తున్నాడు ఆదియ్య. పిల్లలు ఆకలి తాళలేక ఆకులలమలు తినటం మొదలుపెట్టారు. ఒక రోజు మూడోవాడు, నాలుగో వాడు క్షుద్బాధ భరించలేక చెట్ల కింద పడివున్న ముష్టికాయలు తిని మరణించారు. దాంతో భీతి చెందిన ఆదియ్య అవ్వమ్మలు వెదురు పుల్లలతో, ఆకులు, నారలతో కావిళ్లు అల్లి వాటిలో పిల్లలను కూర్చోబెట్టుకుని హుటాహుటిన ఆ ఆడవిని వదలపెట్టి గమ్యం తెలియని బహుదూర గమనానికి సిద్ధమయ్యారు.

✻ ✻ ✻

అడవి నిండుతనాన్ని ఆలంబనంగా జీవించే వారిని మైదానపు నగ్నత్వం వికర్షిస్తుంది. అడవిది సుందర సకలవర్ణ శోభిత ఆచ్ఛాదనం. మైదానానిది విసుగు పుట్టించే ఏకరీతి మృదుత్వం!

ఆడవి దాటి ఓ సుదూర మైదానం చేరిన ఆదియ్య, అవ్వమ్మలకు మైదానంలో ఏ రుచి ఏ రంగు నచ్చలేదు. తమ వనజీవనంలో చల్లటి నల్లటి నీడల్లో సుఖ సుషుప్తులు ఆస్వాదించిన వారికి మైదానపు ఏకరూపు చూసి విసుగు పుట్టేది. ఐనా తప్పదు కదా! తమ పిలగాళ్లకు కాయోగడుసో పెట్టి బతికించుకుని మళ్లీ వానలు పడి క్షామం తొలగిన తర్వాత అడవికి మరలుదామని నిశ్చయించుకున్నారు.

అడవిలో అనూహ్యంగా ఏర్పడిన క్షామం వలన కొండగుహల్లో నివసిస్తూ ఉన్న తమలాంటి వనవాసులు చాలా సంఖ్యలో ఆ విశాల మైదానంలో అక్కడక్కడా చెట్లకొమ్మలు, మండలతో గుడిసెల్లాంటివి వేసుకొని జీవిస్తున్నారు. ఆదియ్య కూడా ఒక చిన్న నీటి కుంటకు సమీపంలో అలాంటి గుడిసె వేసుకొని తన సహచరిని, పిల్లల్ని అందులోకి తరలించాడు.

ఆవాసం అమరింది గానీ ఆహారం దొరికేలా లేదు. ఆదియ్యకు ఎక్కడ చూసినా ఎలుకలేగానీ ఎనుములు కనపడనే లేదు. దుంపలేగానీ దుప్పుల జాడనే లేదు.

ఆదియ్యకు పిల్లల ఆకలి తీర్చటం రోజువారీ విషమ పరీక్ష అయింది. వేసవిలో నీరెండి తన మధ్యలో అక్కడక్కడా బురద గుంటలతో, మిగతా అంతా నెర్రెలతో వానకోసం, వరదకోసం ఎదురు చూస్తున్న నదిఒడ్డు పొడుగునా మైళ్ల దూరంపాటు బారుగా పరుచుకున్న పొదల్లోని కుందేళ్లను వేటాడి తెచ్చి అవ్వమ్మకిస్తే తాటికమ్మలో, రెల్లుదుబ్బులో రాజేసి ఆ మంటలో వాటిని కమ్మగా కాల్చి పెట్టేది. కుందేళ్లు దొరకనిరోజు తాబేళు, అవీ దొరకనప్పుడు కప్పలు లేదా మండ్రగబ్బలు. ఆ కప్పలూ దొరకని రోజుల్లో ఆకలి తిప్పలు... ఏది దొరికినా సమంగా సంతోషంగా పంచేది ఆ తల్లి. సౌఖ్యంగా ఐఖ్యంగా ఆరగించేవారు ఆ పిల్లలు. ఆదియ్య అవ్వమ్మలు అడవిని మాత్రం మర్చిపోలేక పోతున్నారు. గతించిన నాటి వనస్మృతులను తీయగా నెమరువేసుకుంటూ రోజులు నెట్టుకొస్తుంటే పిల్లలు మాత్రం అడవిని పూర్తిగా మర్చిపోయారు. సువిశాల మైదానంలో వెండిని పిండిజేసి బారుగా పోసినట్లున్న ఇసుక మృత్తికలు, తుదిలేనట్లుగా నది అంచుల పరచుకొని ఉన్న మెత్తటి ఒండ్రుమట్టి దిబ్బలు ఆ పిల్లలకు ఆటస్థలాలయ్యాయి. తల్లి పెట్టింది తింటూ రేయింబవళ్లు వెన్నెల మైదానంపై ఏవేవో వింత వింత కొత్త కొత్త ఆటల్లో మునిగితేలేవారు.

కొంతకాలమాగి అడవిని కాటేసిన క్షామమే మైదానాన్నీ కబళించింది. అక్కడా వాన మాయమయ్యింది. సమస్త క్షేత్రం నిర్జలమైంది. ఒళ్ళంతా యాసిడ్ దాడికి గురైన పడతిదేహంలా మైదానం వికారంగా పొక్కులు దేలినట్లు కన్పిస్తుంది. కుందేళ్ల కోసం వెతుకుతూ ఎక్కడో దూరంగా కొండవాలులో ఒక సన్నటి నీటి చెలమిని చూసాడు ఆదియ్య. రోజూ అక్కడికి మండే ఎండలో నడిచొచ్చి ఆకుల దొప్పల్లో, ఎండుకాయల బుర్రల్లో నీళ్లు తీసుకొచ్చి అందరి దాహం తీరుస్తున్నాడు. ఆ చుట్టు పక్కల తమలాగే

కొత్తగా గుడిసెలేసుకుని జీవిస్తున్న మిగతా పూర్వ వనవాసులకు ఆ గుప్త 'జలనిధి' ఉనికి తెలియకుండా జాగ్రత్తపడేవాడు!

కరువు ఉధృతమైంది. ఎండి నెర్రెలిచ్చిన బురద కుంటల్లో నుండి తాబేళ్లు, ఎండ్రకాయలూ అదృశ్య మయ్యాయి. ఇక కలుగుల్లో ఎలుకలే గతి. ఆదియ్య పట్టి తెచ్చిన ఎలుకల్ని గుట్టగా పోసి, తోకలు తలలు గిల్లి తీసి వాటిని చితుకు పుల్లల మంటలో కాల్చి పెడుతుంటే ఆవురావురుమంటూ ఆరగించేవాళ్లు పిల్లలు. అయితే ఆ ఎలుకల మాంసం తిని పొట్ట సహించక ఒకరిద్దరు పిల్లలు డోక్కున్నారు. ఇక మైదానం అంతా ఒకటే పారుకుంటున్నారు ఆరోవాడు, ఏడోవాడు!

కరువు ఉధృతమైంది. ఎండి నెర్రెలిచ్చిన బురద కుంటల్లో నుండి తాబేళ్లు, ఎండ్రకాయలూ అదృశ్య మయ్యాయి. ఇక కలుగుల్లో ఎలుకలే గతి. ఆదియ్య పట్టి తెచ్చిన ఎలుకల్ని గుట్టగా పోసి, తోకలు తలలు గిల్లి తీసి వాటిని చితుకు పుల్లల మంటలో కాల్చి పెడుతుంటే ఆవురావురు మంటూ ఆరగించేవాళ్లు పిల్లలు. అయితే ఆ ఎలుకల మాంసం తిని పొట్ట సహించక ఒకరిద్దరు పిల్లలు డోక్కున్నారు. ఇక మైదానం అంతా ఒకటే పారుకుంటున్నారు ఆరోవాడు, ఏడోవాడు!



అవ్వమ్మ మళ్లీ నీళ్లుపోసుకుంది–పదిహేనవ కాన్పు కోసం! ఆమె రొమ్ముల్లో పాలచుక్కలూ కరువై కవలబిడ్డల్లో ఒకడు ఒకనాడు ప్రాణాలొదిలాడు. మిగిలిన రెండోవాడూ శుష్కించి ఎముకలగూడ య్యాడు. ఆదియ్య, అవ్వమ్మలు దుఃఖిస్తూ ఆర్తిగా మళ్లీ ఆకాశం వైపుగా చేతులెత్తి ఇంకా 'రుపుదాల్చని' దేవరలకు తమ బిడ్డలను క్షామం నుండి కాపాడమని ప్రార్థించారు.

ఒకనాడు ఆదియ్య చూలాలైన తన సహచరికి ఆ ఎలుకల. కప్పల కూడు కాకుండా ఏదైనా మంచి తిండి పెట్టాలని, కనీసం ఒక్క పూటన్నా ఆమె కడుపు నిండుగా తృప్తిగా తింటుంటే చూడాలని ఎంతగానో ఆశించి నది సమీపాన కొండవాలుల్లోకి బయలు దేరాడు. అన్ని తావులలో అణువణువూ ఆశగా గాలించాడు. సందెపొద్దుల వరకు ప్రతి పుట్టాగుట్టా వెతికాడు. తాము కాల్చుకొని రుచిగా తినగలిగిన ఒక్క జీవి దొరకలేదు. దాంతో ఆదియ్య ఉస్సురు మన్నాడు.

ఇంతలో భోరున అకాల వర్షం మొదలైంది. వర్షం మోసుకొచ్చిన చల్లటి ఈదురుగాలి ఒక్కసారే తాకటంతో ఎప్పటినుండో కాగికాగివున్న కొండలు పులకరించిపోతున్నట్లుగా ఊగసాగాయి. ఆ క్షణం వరకూ నిర్జీవంగా నిలిచి మృతదేహాల్లా ఉన్న మోడుబారిన చెట్లు చైతన్యంతో ఊగుతూ, గుట్టల శరీరాలపై నిక్కబొడుచుకున్న రోమాల్లా నిలబడ్డాయి. వేళగాని వేళలో, రుతువు గాని రుతువులో దాడి చేస్తున్న ఆ వానకు విస్మయం చెందాడు అదియ్య. ఐతే ఇక నుండి తమకు నీటి కరువు ఉండదనే ఆనందం ఆ వర్షభీతిని దాచింది. వానకు తడుస్తూ వణుకుతూ గుట్టపైన ఒక బండరాళ్ల కలుగులోకి దూరుతూ తలెత్తి దూరంగా చూసాడు.

సుదూరంగా మైదానం తనపై పడుతున్న ఆ శీతల వర్షానికి పులకరించి తనను తాను హర్షంతో వరదమయం చేసుకుంటూ ఉన్నది. ఆ కొండకు ఆవల ఉన్న నది ఎన్నో రోజులు ప్రయాణించి దాహంతో సొమ్మ సిల్లబోతూ ఒక్కసారిగా కళ్లముందు ఒయాసిస్సు కనిపిస్తే అందులోకి దూకి మరీ దాహం తీర్చుకునే ఎడారి బేహారిలా తన దాహార్తిని తీర్చు కుంటుంది. ఐతే ఈ వాన అడవిలో కూడా యిలాగే కురిసి ఉండొచ్చు. అవ్వమ్మను, పిల్లల్ని తీసుకుని త్వరలో అడవికి తరలిపోవాలని అనుకున్నాడు! అది సరే … అవ్వమ్మ ఈ అకాల వర్షానికి అక్కడ పిల్లల్ని ఎలా కాపాడుకుంటుందో ఏమో? అసలే తను గర్భిణి. తమ గుడిసె సహా తన వాళ్లంతా ఆ వెల్లువకి బలయ్యేఉంటారని దిగులుపడుతూ అక్కడే గాఢ నిద్రలోకి ఒరిగిపోయాడు ఆదియ్య.

తెల్లవారే 'గుర్ గుర్' మనే రొద చెవులకు తాకేసరికి ఆదియ్య దిగ్గున లేచి చూసుకుంటే భళ్లున తెల్లారింది. రాత్రి కలుగులోంచి బయటకు వచ్చి చూస్తే దిగువ చిన్నలోయలాంటిచోట అడవి పంది ఒకటి ఈని ఉన్నది. పిల్లల్ని నాకుతూ గురగుర శబ్దాలు చేస్తుందది. 'హమ్మనీ … ఇన్నాళ్లూ కన పడకుండా ఎక్కడ నక్కావే!' అనుకుంటూ సద్దు చేయకుండా భద్రంగా అక్కడినుండి జరిగి మైదానం వైపు నడక సాగించాడు. తల్లి పొట్టచుట్టూ పాకుతున్న ఆ వన్యజీవి పిల్లల్ని చూడగానే అవ్వమ్మ, తన బిడ్డలు గుర్తొచ్చారు ఆదియ్యకు.

దీర్ఘకాలం శుష్కమై, నిర్జలమై ఉంటూ ఒక్కసారిగా తడిసిన ఆ క్షేత్రమంతా విడుదల చేస్తున్న తియ్యటి మట్టి గుబాళింపును ఆస్వాదిస్తూ నీరెండలో చెట్టూ పుట్టా దాటుకుని ముందుకు సాగుతున్నాడు ఆదియ్య. ముందుకు నడుస్తున్న కొద్దీ తన బిడ్డల్ని చూసుకోవాలనే ఆదుర్దా హెచ్చిస్తుంది అతనిలో.

ఆదియ్య మైదానానికి సమీపంలో ఉండగా ముందురోజు కురిసిన జడివానకు కొత్తకుండలా నిండివున్న ఒక నీటికుంట ఒడ్డున ఏపుగా పెరిగిన గడ్డిపొదల అంచుల్లో చాలా బారులు తీరి ఎన్నో రకాల వందల పక్షులు గుంపులు గుంపులుగా నేలవాలి ఏవో మేస్తున్నాయి. ఆదియ్య మహా ఆసక్తిగా 'అవి ఏమి తింటున్నాయో'…. అని అనుకుంటూ దగ్గరికెళ్ళి పరిశీలించసాగాడు.

ఆ పక్షులన్నీ ఆ నీరెండకు చిరు స్వర్ణపుష్పాల్లా మెరుస్తున్న ఏవో ధాన్యపు గింజల్ని మేస్తున్నాయి. కొన్ని చిన్న పిట్టలు రాత్రి గాలిదుమారానికి రాలి, వానకు తడిసి ఉబ్బిన ఆ గింజల్ని తమ ముక్కులతో పొడుస్తుంటే గడ్డి పూవుల్లాంటి మెతుకులు బైట పడుతున్నాయి. వాటిని అవి ఎంతో ఇష్టంగా మేస్తు న్నాయి. ఆదియ్య తడిసి ఉబ్బిన ఆ ధాన్యపు గింజల్ని ఓ గుప్పెడు యేరి నోట్లో పోసుకొని నమిలాడు.

"అబ్బ! ఎంత కమ్మగా ఉన్నాయి!" అని ఇంకో గుప్పెడు తీసుకొని బుక్క సాగాడు. కాల్చిన కమురు వాసనల మాంసపు మదపు రుచి మాత్రమే తెలిసిన



ఆదియ్య జిహ్వాకు ఆ గింజల రుచి అమృతతుల్యంగా అన్పించింది. ఐతే ఒక్కటే చిక్కు! ఆ ధాన్యపు గింజల్ని నములుతుంటే వాటి పైపొట్టు దవడలకు గుచ్చు కుంటుంది. ఐనా బాగా నమిలి నమిలి తీయటి పిండి గుజ్జును మింగి పొట్టు ముద్దను ఊసాడు.

తినటానికి ఏ ప్రాణీ దొరకనపుడు వాటితోనే పిల్లల ఆకలిని తీర్చవచ్చని ఇసుక రాకుండా జాగ్రత్తగా మరిన్ని గింజల్ని యేరుకుని తన మొలతోలులో కట్టుకుని మైదానంలో తాముండే ప్రదేశంవైపు వడివడిగా నడుస్తూ చేరుకున్నాడు.

ఆదియ్యకు అవ్వమ్మ కన్పించలేదు. పిల్లల జాడకూడా లేదు. తమ గుడెసె కూలిపోయి కప్పువిడిపోయి అల్లంత దూరంలో ఒక వర్రెలో పడిపోయి ఉంది. ఆదియ్య వ్యాకులత నిండిన గొంతుకతో పెద్దగా పిలుస్తూ తన వారిని వెదుక్కుంటూ దగ్గర్లోని చిన్న అడవితోపులోకి వెళ్లి చూసాడు. అక్కడ చెట్ల తొర్రల్లో ఉన్న పిల్లలంతా అతడ్ని చూసి

"బా.... బా..... బాపు వచ్చిండు" అంటూ క్రిందికి దూక సాగారు. ఆ పక్కనే కొద్ది దూరంలో ఓ కట్టెపుల్లతో గొయ్యి తవ్వుతూ కన్పించింది అవ్వమ్మ. పక్కనే ఇసుకపై రెండో కవలశిశువు శుష్కించిపోయిన మృతదేహం. ఆదియ్యను చూడగానే భోరుమని రోదిస్తూ ఉరుకొచ్చి అతణ్ణి గట్టిగా చుట్టుకుపోయింది అవ్వమ్మ.

"నా గుండెల్లో పాలెండిపోయాయి కదయ్యా... ఆకలి, చలి మన బిడ్డను..."

ఆదియ్య దుఃఖాన్ని దిగమింగుకుంటూనే ఆమెను ఓదార్చాడు. పిల్లలకు యిదంతా పట్టదు. ఆట, ఆకలి మాత్రమే తెలిసిన ఆ పసివాళ్లకు చావు కేవలం అపుడపుడూ తటస్తించే ఓ ఉదంతం మాత్రమే!

కవల శిశువు విగతదేహాన్ని ఖననం చేసి, అంతకు ముందు తమ గుడిసెవున్న చోటుకివచ్చి కూర్చొన్నారు అంతా. ఆ తుఫానురాత్రి తమ పిల్లలందర్ని అలా చెట్లతొర్రల్లోఉంచి రక్షించినందుకు ఆదియ్య అవ్వమ్మను ఎంతో మెచ్చుకోలుగా చూస్తూ తన మొలతోలు మూట విప్పాడు. అందులో తడికి ఉబ్బివున్న ధాన్యపు గింజల్ని ఆకలి కళ్లతో తనవైపే చూస్తున్న పిల్లలకు తలా పిడికెడు చేతుల్లో పోసాడు. అవ్వమ్మకూ కొన్ని గింజలు పోసి, తనూ ఓ పిడికెడు నోట్లో పోసుకొని తనలా నమలమని, పొట్టు పిప్పిని చివరికి ఊసెయ్యమని సైగలతోనే వివరిం చాడు.

పెద్దోడు నములుతూ గట్టిగా అరిచాడు.

"అయ్యో ...... ఇవి చాలా బాగున్నాయ్ ......యింకా పెట్టు!"

"మాక్కూడా అయ్యా ....." అంటూ మిగతా వాళ్లు చేతులు చాపారు. ఆదియ్య మిగిలిన గింజల్ని తలా కొంచెం పంచాడు.

తొమ్మిదోవాడు గింజలగుజ్జు యిష్టంగా మింగుతూ, పిప్పి ఊస్తూ తల్లి ఒడిలోకి చేరి గోముగా అంటున్నాడు "అవ్వా ...... నాకు రోజు ఇదే కావాలి. ఆ ఎలికలు చెడ కంపు!"

ఆరోవాడు, ఏడోవాడు కూడా అదే అరిచారు.

"అవునవ్వా ఆ ఎలికలు, మండ్రగబ్బలు తినలేం! చూసావుగా అవ్వా నువ్వు. రాత్రంతా ఆ చెట్టు తొర్రంతా పారినాం...'' అంటూ వాళ్ల తల్లి భుజాలపైకి చేరారు.

మిగతా పిల్లలూ ఆ గింజలే కావాలని బృందగానంలా అరిచారు.

"పిల్లలంతా తెగ యిష్టపడుతున్నారు. ఎక్కడి నుండి తెచ్చావయ్యా వీటిని?" తనూ వాటిని ప్రీతిగా నములుతూ అడిగింది అవ్వమ్మ.

"గుట్టదిగినాక ... మైదానం మొదట్లో నీటి కుంట వొడ్డున ఎత్తైన గట్టి దుబ్బుల మధ్య అవ్వమ్మా.... పిట్టలు యిష్టంగా మేస్తంటే కొన్ని ఏరుకొచ్చానే".

వెదజల్లుతుంది వరి అన్నం. దానివైపే మధ్య మధ్యలో చూస్తూ, గుటకలు మింగుతూ ఇంటి చుట్టూ ఒండ్రు ఇసుకలో దొర్లుతూ ఆడుకుంటున్నారు ఓ పాతికమందికిపైగా చిన్నారులు.

ఒకవైపు ఇంటి ముందు ఈ రోజుకి అన్నం ఉడుకుతుంటే ఇంటి లోపల మధ్యలో నలుగురు కోడళ్లు రెండు వడ్లగుంటల్లో రేపటికి వడ్లు దంపుతున్నారు.

ఇంతలో పాలపిట్టలా ఒక చిన్నారి రివ్వున లోపలికి దూసుకొచ్చి కిలకిలా నవ్వుతూ రెండు పిడికిళ్ల నిండా బియ్యం అందుకుని వేగంగా బయటకు ఉరికింది.

బయట రాతిగోడపై వాలివున్న పిచుకల ముందు వాటిని పోసి మళ్లీ ఆటకు పరిగెత్తింది.

"ఏయ్ పిల్లా ఎందుకే 'మన' తిండిగింజలన్నీ

**'అబ్బ! ఎంత కమ్మగా ఉన్నాయి!" అని ఇంకో గుప్పెడు తీసుకొని బుక్క సాగాడు. కాల్చిన కమురు వాసనల మాంసపు మదపు రుచి మాత్రమే తెలిసిన ఆదియ్య జిహ్వాకు ఆ గింజల రుచి అమృతతుల్యంగా అన్పించింది. ఓఐతే ఒక్కటే చిక్కు! ఆ ధాన్యపు గింజల్ని నములుతుంటే వాటి పైపొట్టు దవడలకు గుచ్చుకుంటుంది. ఐనా బాగా నమిలి నమిలి తీయటి పిండి గుజ్జును మింగి పొట్టు ముద్దను ఊసాడు.**



''రేపు మనం మళ్లీ అక్కడికెళ్ళి ఇంకా పట్టుకొద్దాం... పిల్లలకు ఏది నచ్చుతుందో మనమూ అదే తిందామయ్యా!... రోజూ అంత దూరం పోవటం కష్టమైతే మరిన్ని గింజల్ని తీసుకొచ్చి ఇక్కడే చల్లుదాం....".

"అబ్బ! ఎంత మంచి ఆలోచన నీదీ అవ్వమ్మా! సరే అలాగే చేద్దాం. రా యిక. నాలుగు కొమ్మలు లాక్కొచ్చి ఇంకో గుడిసె వేసుకుందాం... రా... పైకి లే" అంటూ ఆదియ్య ఆమెను ఉత్సాహపరిచాడు.

పిల్లలంతా మెత్తటి చల్లటి యిసుక తిన్నెలపై మళ్లీ ఆటకు బయల్దేరారు

* * *

"అవ్వా...."

"అయ్యా....."

"బువ్వ!"

"ఉమ్మగిల్తంది. పెడతా ఆగు బిడ్డా."

చేతిలో చిన్న మట్టిగిన్నెతో పొయ్యి ముందు నిల్చున్న ఆ చిన్నారి అవ్వమ్మకు 'పందొమ్మిదో' మనవరాలు. అవ్వమ్మకిప్పుడు నూట ఆరో యేడు. యింకా ఉక్కు ముక్కలా ఉంది. ఆ అతి పెద్ద ఉమ్మడి కుటుంబంలో ఆమెదే యింకా పెత్తనం!

పెద్ద రాళ్ల పొయ్యిపై గంగాళం అంత మట్టి పాత్రలో కుతకుత ఉడుకుతూ అంచుకుపైన పొంగుతూ కమ్మని తియ్యని గంజి వాసనను చుట్టూ

ఆ 'పాడు' పిట్టలకేసి ఆగంచేస్తావ్? బుద్ధిలేనిదానా!" – లోపలినుండి కోపంగా మొత్తుకుంటుంది. ఆ అమ్మాయి పెద్దమ్మ.

రాతిగోడపై ఆ పాప తమకు పోసిన గింజల్ని తినబోతూ పక్షులు మోరలెత్తి ఆ మాటలన్న ఆమెవైపు, తనవైపు చిరుకోపంతో, వెటకారంతో చూసినట్లుగా అనిపించింది బైటకూర్చొని రేపటివంటకు కట్టెపుల్లలు సిద్ధం చేస్తున్న ఆదియ్యకు.

ఇంతలో "రేయ్ రాండ్రా... అవ్వ బువ్వ పెడతంది... రావాలోచ్ రావాలి!" అంటూ కీచు గొంతుకతో ఒక బక్క పిల్లవాడు పొయ్యి దగ్గర నుండి కేకవేసాడు.

పిల్లల గుంపంతా పొయ్యి వైపు కేకలేస్తూ కదిలింది.

అప్పుడే మాటలొస్తున్న అవ్వమ్మ ముదిమనవరాళ్లలో ఒకతైన చిన్నారి బుజ్జిపాప చిరు అడుగులతో అవ్వమ్మనుచేరి లేతపిండెల్లాంటి తన ఎడమ చేతి వేళ్లతో అవ్వమ్మ చేతిని వెచ్చగా స్పృశిస్తూ, తన కుడి చేతిని ముందుకు బారుగా చాపుతూ ముద్దుగా అడుగుతుంది ' అవ్వా ...... బువ్వ పెట్టవా!"

(వేల గడ్డిజాతులనుండి ధాన్యాన్ని వేరుచేసి, సాగుచేసి మనకు

''బువ్వ''ను ప్రసాదించిన పురాయుగ మానవులకు ప్రణామాలు.) ★

# అస్సాం ఉపాధ్యాయులకు ప్రభుత్వ పాఠాలు



పిల్లలకు విద్యాబుద్ధులు చెప్పవలసిన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు హుందాగా కనిపించవలసిన అవసరాన్ని ఎవరూ కాదనలేరు. ఇప్పుడు అస్సాం ప్రభుత్వం వారికి కొన్ని నిబంధనలు పెట్టింది. అవన్నీ వస్త్రధారణకు సంబంధించనవే. రాష్ట్ర విద్యాశాఖ ఆయా విద్యా సంస్థలకు ఈ మేరకు ఆదేశాలు అందాయి.

ఈ ఆదేశాల ప్రకారం ఇకపై ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు జీన్స్, లెగ్గింగ్స్, టీషర్ట్స్ వేసుకుని తరగతి గదులకు రాకూడదు. మొత్తంగా చూస్తే పాఠాలు చెప్పేవారు ఇలాంటి వస్త్రధారణలో కనిపించడం సమాజానికి అంగీకారయోగ్యంగా లేదు. కొందరు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు తమ ఇష్టానుసారం వస్త్రాలు ధరించి వస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఈ ధోరణిని సమాజం అంగీకరించడం లేదు. ఎందుకంటే ఆ రకమైన వస్త్రధారణ అభ్యంతరకరంగా ఉంటున్నది. పాఠాలు చెప్పేవారు అందుకు తగిన వాతావరణాన్ని కల్పించడానికి హుందాగా కనిపంచిచే వస్త్రధారణలో ఉండాలని సమాజం ఆశిస్తున్నది. కాబట్టి వస్త్రధారణకు సంబంధించి ఈ ఆదేశాలను అనుసరించాలని విద్యాశాఖ కోరుతున్నదని ఆ ఆదేశంలో పేర్కొన్నారు. వృత్తి పట్ల గౌరవం, నిబద్ధత, విస్తృత అవగాహనలకు అది అవసరమని కూడా చెబుతున్నామని ఆదేశంలో వెల్లడించారు.

అక్కడి విద్యాశాఖ చెప్పిన సూచనలు ఇలా ఉన్నాయి.

1. ఉపాధ్యాయులు సాధారణ పేంట్, షర్ట్ లేదా ఇతర సంప్రదాయక దుస్తులలో తరగతులకు రావాలి. జీన్స్, టీషర్ట్‌ను అనుమతించరు.

2. ఉపాధ్యాయినులు హుందాగా ఉండే సల్వార్ కమీజ్, చీర, లేదా మెఖేలా చదర్‌లో ఉండాలి. వీరికి జీన్స్, టీషర్ట్, లెగ్గింగ్ వంటివి నిషిద్ధం.

3. ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు కూడా కళ్లకు కొట్టినట్టు ఉండే ముతక రంగులు కలిగిన దుస్తులు ధరించరాదు. లేత రంగులు, చూడడానికి ఆహ్లాదంగా ఉండే రంగుల దుస్తులే ధరించాలి. ప్రత్యేక కార్యక్రమాలకీ, విందులూ వినోదాలకి వేసుకు వెళ్లే దుస్తులు పూర్తిగా నిషిద్ధం.

అంతేకాదు, ఈ ఆదేశాలను తుచ తప్పకుండా ఆచరించాలి. లేకపోతే క్రమశిక్షణ చర్యలు తప్పవని కూడా చెప్పేసింది విద్యాశాఖ. ★


## కార్టూన్‌ల పోటీ

జొన్నలగడ్డ లక్ష్మీనారాయణ ఆర్థిక సహకారంతో

జాగృతి తెలుగు వారపత్రిక 'కార్టూన్‌ల పోటీ-2023' నిర్వహిస్తున్నది.

యువ, కొత్త, సమర్థులైన కార్టూనిస్టులను;

సమాజంలో ఆరోగ్యకరమైన హాస్యాన్ని పెంపొందించే కార్టూన్‌లను ప్రోత్సహించడమే ఈ పోటీ ముఖ్య ఉద్దేశం.

ప్రథమ బహుమతి : రూ.5000/-

ద్వితీయ బహుమతి : రూ.3000/-

తృతీయ బహుమతి : రూ.2000/-

రూ.500 చొప్పున పది ప్రోత్సాహక బహుమతులు

- కార్టూన్‌లు ఎవరినీ, ఏ వర్గాన్నీ, భారతీయ కుటుంబ విలువలు, మహిళ, సంస్కృతీ సంప్రదాయాలను కించపరచేలా ఉండరాదు.
- అందరికీ చక్కని హాస్యాన్ని పంచేవిగా ఉండాలి.
- ఒక కార్టూనిస్టు ఐదు కార్టూన్‌లకు మించి పంపరాదు.
- కార్టూన్‌లు 8(H) × 10(W) సైజులోనే వేసి పంపగలరు.
- కార్టూన్‌లను స్కాన్ చేసి jagriticompetition@gmail.com కు మెయిల్ చేయాలి. లేదా **కార్టూన్‌ల పోటీ, జాగృతి తెలుగు వారపత్రిక, 3-4-228/4/1**, కాచిగూడ, హైదరాబాద్-**500027**కు పోస్టు చేయాలి.

కార్టూన్‌లు చేరవలసిన చివరి తేదీ : **జూన్ 12, 2023.**

# కశ్మీర్‌ను నెత్తుటిలో నాన్చుతున్న ఐరాస




**ఐక్య రాజ్య సమితి మానవాళినంతటినీ స్వర్గధామంలోకి తీసుకుపోవడానికి సృష్టించినది కాదు. కానీ మనుషులను నరకం బారి నుంచి తప్పించడానికి ఉద్దేశించినది మాత్రమే అన్నాడొక ప్రముఖుడు. కానీ కశ్మీర్‌ను మాత్రం ఐక్య రాజ్యసమితి ఏడున్నర దశాబ్దాల పాటు నరకంలోనే నిలబెట్టి ఉంచింది. కశ్మీర్ భూతల స్వర్గం అనే మాటను ప్రపంచం మరచిపోయేందుకు తన వంతు పాత్రను కూడా నిర్వహించింది. ఐరాస కశ్మీర్ వ్యవహారంలో అతి పెద్ద వైఫల్యం. దాని పాత్ర చరిత్రాత్మక తప్పిదం. లోయలో శాంతిభద్రతల విషయంలో ఐరాసది కేవలం సలహాదారు పాత్ర మాత్రమే. కానీ ఆ లోయ తలరాత దాని చేతిలోనే ఉందని మన కాంగ్రెస్ నాయకత్వం నమ్మినట్టు కనిపిస్తుంది. 1947లో భారత్, పాకిస్తాన్ విభజన జరిగిన వెంటనే తలెత్తిన ఈ సమస్య ఇప్పటికీ రగులుతూనే ఉంది. రావణకాష్టం అన్నదానికి గొప్ప ఉదాహరణ. 75 ఏళ్ల నుంచి కశ్మీర్‌కూ, ఆక్రమిత కశ్మీర్‌కూ మధ్య పడిన ఇనుపతెరను ఐరాస కాస్త కూడా కదపలేకపోయింది. ఆక్రమిత కశ్మీర్ స్వేచ్ఛ కోసం ఘోషిస్తున్నా కూడా ఐరాసకు వినిపించడం లేదు. సమితి వ్యవహారాలకు సంబంధించి కశ్మీర్ సమస్యకు కనుచూపు మేరలో కూడా పరిష్కారం కనిపించడంలేదు.**

మొత్తం 565 సంస్థానాలలో జునాగఢ్, హైదరాబాద్ సమస్యలు పరిష్కారం అయినప్పటికి కశ్మీర్ సంస్థానం సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. భారత్‌కు ఒక సవాలుగా మారిపోయింది. విలీనం గురించి రెండు దేశాల మధ్య వివాదం తలెత్తగానే భారత్ సమస్యను ఐక్య రాజ్యసమితి భద్రతామండలి పరిధిలోకి తీసుకువెళ్లింది. సమితి తీర్మానం 39 (1948) చేసింది. ఫలితమే యునైటెడ్ నేషన్స్ కమిషన్ ఫర్ ఇండియా అండ్ పాకిస్తాన్ ఏర్పాటు. తరువాత 1950, 1951, 1952,1957, 1965, 1971లలో కూడా తీర్మానాలు జరిగాయి. ఐక్యరాజ్య సమితి పరిధిలో సమస్య ఉండగానే భారత్, పాక్ రెండు పర్యాయాలు యుద్ధాలు చేశాయి. కార్గిల్ ఘర్షణ జరిగింది. కొన్నివందల సార్లు కాల్పులు జరిగాయి. కశ్మీర్‌ను చూపుతూ పాకిస్తాన్ భారత్‌లోని ఇంచుమించు ప్రతి రాష్ట్రంలోను విధ్వంసానికి పాల్పడింది. వేలాది ప్రాణాలు తీసింది. 1990లో కశ్మీర్ లోయ నుంచి పండిత్ వర్గాన్ని సమూలంగా తుడిచిపెట్టడానికి పెద్ద ఎత్తున హింస మొదలైంది. వీటిలో దేనినీ ఆపే శక్తి సమితికి లేదని తేలిపోయింది. కశ్మీర్ రక్తపాతం పట్ల, హింస పట్ల, అమాయకుల చావుల పట్ల, ఆఖరికి ముస్లిం మతోన్మాదం పట్ల, మైనారిటీల హక్కుల హరణ పట్ల సమితిది కేవలం మౌన ప్రేక్షకపాత్ర. కశ్మీర్ పోరాటానికి (అక్కడి ఉగ్రవాదానికి) పాకిస్తాన్ అండగా నిలుస్తుందని ఆ దేశ అధ్యక్షులు ఎన్నోసార్లు బాహాటంగానే ప్రకటించారు. అయినా సమితిలో రావలసిన కదిలిక రాలేదు. భారత్‌లో మైనారిటీలకు రక్షణ లేదంటూ వెలువడే ప్రకటనలలోని నిజాన్ని బయటకు చెప్పడానికి అది ముందుకు రాలేదు. సమితిలో జరిగేదల్లా అమెరికా పాదాల నీడలో వ్యభిచారమే అన్నాడొక విమర్శకుడు. ఇటీవలి కాలంలో చైనా చేతిలో ప్రపంచ ఆరోగ్య సంస్థ కీలుబొమ్మగా మారిందన్న అపవాదు కూడా వచ్చింది. ఈ నేపథ్యంలో దీనిని పూర్తిగా సంస్కరించాలని మోదీ అన్నమాటలు అక్షరసత్యాలు.

కశ్మీర్‌లో ఐరాస నిర్వహించిన పాత్ర ఏమిటి? శాంతిని స్థాపించిందా? అది నేతి బీరలో నేయి చందంగానే ఉంటుంది. కశ్మీర్‌లో పాకిస్తాన్ మద్దతుతో విద్రోహ కార్యకలాపాల చరిత్ర 1989 నుంచి కొత్త పుంతలు తొక్కింది. నిజానికి 1978–88 మధ్యకాలంలో పాకిస్తాన్ ఆరవ అధ్యక్షుడిగా పనిచేసిన జియా ఉల్ హక్ పాకిస్తాన్‌ను ఇస్లామీకరించి రాజకీయాల్లో, పాలనా వ్యవస్థలో, సైన్యంలో ఇస్లామిస్టులను ప్రవేశపెట్టడంతో ఈ విద్రోహ కార్యకాలపాలకు బీజం పడింది. ఈ విద్రోహ గ్రూపుల్లో ఒకవర్గం పూర్తి స్వాతంత్ర్యం కోరుతుండగా మరోవర్గం పాకిస్తాన్‌లో కలవాలన్న లక్ష్యంతో పని చేసింది. తమలోని అసంతృప్తిని వ్యక్తం చేసేందుకు అహింసామార్గాన్ని ఎంచుకునే వర్గాల సంఖ్య పరిమితం కావడం పాకిస్తాన్‌కు అనుకూలంగా

మారిన ఫలితంగా 1988 నుంచి భారత్‌కు వ్యతిరేకంగా హింసాత్మక శక్తుల ప్రాబల్యం పాక్ ప్రభుత్వం, ఐఎస్ఐ ప్రోద్బలంతో బాగా పెరుగుతూ వచ్చింది. 1987లో జమ్ముకశ్మీర్‌లో ఎన్నికలు జరిగి ఫరూక్ అబ్దుల్లా ముఖ్యమంత్రి అయ్యారు. దీనివల్ల ప్రజాస్వామ్యం కొనసాగడం పరిస్థితి అట్లా ఉంచితే విద్రోహాలకు ఈ ప్రభుత్వం ఒక ఉత్ప్రేరకంగా మారింది. ముఖ్యంగా కొంతమంది అసెంబ్లీ సభ్యులే ఏకంగా విద్రోహ గ్రూపులను నిర్వహించడం మొదలైంది. ఫలితంగా 1988లో రాష్ట్రంలో ఆందోళనలు, సమ్మెలు, దాడులు విపరీతంగా పెరిగిపోయి చివరకు 1990 నాటికి పతాక స్థాయికి చేరాయి. కేవలం కశ్మీర్ కోసం మూడు యుద్ధాలుచేసి పరాభవం పాలైన తర్వాత పాకిస్తాన్‌కు చెందిన



ఐ.ఎస్.ఐ. జమ్ముకశ్మీర్‌లో హిజ్బుల్ ముజాహిద్దీన్‌లకు మద్దతునివ్వడం మొదలు పెట్టింది. సరిగ్గా ఇదేకాలంలో వివిధ ఇస్లామిక్ రాడికల్ భావజాలాలు పుట్టుకొచ్చి, క్రమంగా వేర్పాటువాదం, ఇస్లామిక్ ఛాందసవాదంగా రూపుదిద్దుకుంది. పెద్దసంఖ్యలో జిహాదీ ముస్లిం తీవ్రవాదులు పాక్ ఆక్రమిత కశ్మీర్ నుంచి, జమ్ముకశ్మీర్‌లోకి ప్రవేశించడం ప్రధాన కారణం. వీరంతా అఫ్ఘానిస్తాన్‌లో సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా పోరాడినవారు. ఈ సీమాంతర ఉగ్రవాదానికి స్వస్తి చెప్పాలని భారత్ ఎన్నిసార్లు హితవు చెప్పినా పాకిస్తాన్ వినిపించుకో లేదు. 2017 మార్చి నాటికి ప్రభుత్వ సమాచారం ప్రకారం ఈ విద్రోహకాండలో 41 వేల మంది ప్రాణాలు కోల్పోగా ఇందులో 14వేల మంది ప్రజలు, 5వేల మంది భద్రతా బలగాలు, 22 వేల మంది మిలిటెంట్లు ఉన్నారు. ఈ మరణాల్లో అత్యధిక శాతం 1990–2000 మధ్యకాలంలో చోటు చేసుకున్నవే కావడం గమనార్హం. 2015లో నాటి పాక్ అధ్యక్షుడు పర్వేజ్ ముషారఫ్ అప్పట్లో మాట్లాడుతూ.. 1990 ప్రాంతంలో పాకిస్తాన్ ప్రభుత్వం ఉగ్రవాదులకు వెన్నుదన్నుగా నిలిచిందన్న సత్యాన్ని స్వయంగా అంగీకరించారు. అమెరికాకు చెందిన కౌన్సిల్ ఆఫ్ ఫారెన్ రిలేషన్స్ సంస్థ, అల్‌ఖాయిదా దాని అనుబంధ సంస్థ జైషే మహమ్మద్‌లు కశ్మీర్‌లో ఉగ్రవా దాన్ని ప్రోత్సహిస్తున్నాయని తన నివేదికలో స్పష్టం చేసింది. పాక్ సైన్యంలోని సీనియర్ అధికార్లు మిలిటెంట్లు, క్రిమినల్ గ్రూపులకు మద్దతునిస్తున్నారని అమెరికాకు చెందిన ప్రఖ్యాత సూఫీ జర్నలిస్ట్ స్టీఫెన్ సులేమాన్ స్క్వార్జ్ పేర్కొనడం గమనార్హం.



జమలాపురపు విఠల్‌రావు
సీనియర్ జర్నలిస్ట్

### ఉగ్రవాదాన్ని అరికట్టే చర్యలేవి?

2001, అక్టోబర్‌లో జమ్ముకశ్మీర్ అసెంబ్లీపై బాంబు దాడి (27 మంది మరణించారు), 2001 డిసెంబర్‌లో పార్లమెంట్‌పై దాడి (దాడికి పాల్పడిన ఐదుగురు సహా 14 మంది మరణించారు), 2003, జులై 13న శ్రీనగర్‌లోని ఖాసిమ్ నగర్ మార్కెట్‌లో బాంబు దాడి (27 మంది మరణం), ఆల్ పార్టీ హురియత్ కాన్ఫరెన్స్ నేత అబ్దుల్ ఘనీలోన్ హత్య, 2005లో శ్రీనగర్‌లో సైనిక వాహనంపై దాడి, 2005 జులై 29న బాద్‌షా చౌక్ దాడి, 2005, అక్టోబర్ 18న జమ్ముకశ్మీర్ విద్యాశాఖ మంత్రి గులాం నబీలోన్ హత్య, 2016, సెప్టెంబర్ 18న యురి దాడి (18 మంది మరణించారు), 2019, ఫిబ్రవరి 19న పుల్వామా దాడి (38 మంది సిఆర్‌పీఎఫ్ జవాన్ల వీరమరణం) ఇవన్నీ.. మిలిటెంట్ల దాడులు. వీటికితోడు డిసెంబర్ 24,1999న ఉగ్రవాదులు ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానాన్ని హైజాక్ చేసి కందహార్‌కు తీసుకెళ్లారు. దీనిపై మీడియాలో విపరీతంగా ప్రచారం రావడంతో విమాన ప్రయాణికుల రక్షణ విషయంలో తీవ్ర ఒత్తిడికి గురైన ప్రభుత్వం ఉగ్రవాది మౌలానా మసూద్ అజర్‌ను విడుదల చేసింది. ఫిబ్రవరి 18, 2007న సంఝౌతా ఎక్స్‌ప్రెస్‌లో బాంబు పేలి 68 మంది మరణించారు. ఈ రైలు న్యూఢిల్లీ–లాహోర్ మధ్య నడిచేది. 2008లో ముంబయిలో పదిమంది ఉగ్రవాదులు జరిపిన దాడిలో 173 మంది మరణించగా 308 మంది గాయపడ్డారు. అయితే ఇన్ని దాడులు జరుగుతున్నా వీటిని అరికట్టే విషయంలో మాత్రం ఐరాస ప్రేక్షక పాత్రకే పరిమితమైందని చెప్పక తప్పదు.

### పాక్ ఉక్కుపాదాల కింద పీఓకే

మరి పాక్ ఆక్రమిత కశ్మీర్ పరిస్థితేంటి? 1980–90 మధ్యకాలం నుంచి 'జిహాద్' పేరుతో మతమౌఢ్య శక్తులు అక్కడి యువత మెదళ్లలో విషం నింపి శిక్షణలు ఇచ్చి కలాష్నికోవ్ రైఫిల్స్ ఇచ్చి అత్యంత శక్తిమంతమైన భారత సైన్యం పైకే ఎగదోసాయి. కశ్మీర్‌ను విముక్తం చేయాలంటూ టీవీలు, న్యూస్‌పేపర్లు, మసీదుల్లో చేసిన విపరీత ప్రచారం చివరకు పీఓకే అభివృద్ధిని నిరోధించడమే కాదు అక్కడి మానవ సంపద విధ్వంసానికి దారితీసింది. స్వర్గతుల్యమైన ఇస్లామిక్ స్టేట్ ఆవిర్భ విస్తుందంటూ యువకులను మభ్యపెట్టి విధ్వంసం వైపు నడిపించిన పాపం ఇప్పుడు పీఓకేను కట్టికుడుపుతోంది. జిహాదీ ఉద్యమం వల్ల హత్యలు, లూటీలు పెరిగిపోయాయి. ఫలితంగా మానవ మరణాలు, ఆస్తి విధ్వంసాలు, పెద్దసంఖ్యలో ప్రజలు నిరాశ్రయులవడమే కాదు, కాల్పుల విరమణ రేఖకు ఇరువైపులా వేలాదిమంది ప్రాణాలు కోల్పోయారు. పిల్లలను బలవంతంగా బడి మానిపించడం వల్ల వారి బాల్యం ఛిద్రమైంది. జిహాద్ పేరుతో సకల సౌకర్యాలు అనుభవించింది పాక్ జనరల్స్, రాజకీయ నాయకులు, మతపెద్దలు, జిహాద్ కౌన్సిల్, ఫ్రీడమ్ కాన్ఫరెన్స్‌కు చెందినవారు మాత్రమేనని న్యూస్ ఇంటర్వెన్షన్ వరల్డ్ పేర్కొంది. మానవాభివృద్ధి ప్రాజెక్టులకు కాకుండా విధ్వంస కార్యకలాపాలకు పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టిన ఫలితం ఇప్పుడు పీఓకే అనుభవిస్తోంది. నేడు కశ్మీర్‌కు స్వేచ్ఛ కావాలంటూ ప్రచారాలు చేసేవారిని ఎవరూ పట్టించుకునే పరిస్థితి లేదని న్యూ ఇంటర్వెన్షన్ వరల్డ్ పేర్కొంది. గత 75 సంవత్సరాల అస్థిరత తర్వాత ఇప్పుడు జిహాదీ ఉగ్రవాదం నుంచి విముక్తమైన జమ్ముకశ్మీర్ శాంతిసుస్థిరతల వైపు వేగంగా పయనిస్తుండగా, ఒకవైపు దుర్భర దారిద్ర్యం మరో వైపు అణచివేత చర్యలతో దయనీయ పరిస్థితుల్లో బతుకులీడుస్తున్న పాక్ ఆక్రమిత కశ్మీర్ ప్రజలపై, పాకిస్తాన్ ప్రభుత్వం, సైన్యం 15వ రాజ్యాంగ సవరణ పేరుతో ఉక్కుపాదం మోపడానికి ప్రయతిస్తున్నాయి.

26 పేజీలతో కూడిన ఈ డాక్యుమెంట్ ప్రకారం పీఓకే ఆర్థిక అధికారాలు పాక్ ప్రభుత్వానికి బదిలీ అవుతాయి. దీనిపై ఇప్పటికే సంప్రదింపులు మొదలుకాగా, అమల్లోకి వచ్చినట్లయితే పీఓకే ప్రావెన్స్‌కున్న ప్రస్తుత స్థాయి మరింత దిగజారడం ఖాయం. నిజానికి 2022, జూన్ 29నే పాకిస్తాన్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ అండ్ పార్లమెంటరీ అఫైర్స్ అండ్ హ్యూమన్ రైట్స్ ఈ డాక్యుమెంట్‌కు తుది రూపం ఇచ్చింది. ముసాయిదాను పరిశీలించడానికి అప్పట్లో ఒక కమిటీని పాక్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీని ప్రకారం ఏర్పాటయ్యే కశ్మీర్ కౌన్సిల్‌లో 7గురు పాక్, ఆరుగురు పీఓకె సభ్యులు ఉంటారు. పీఓకేకు సంబంధించి కశ్మీర్ కౌన్సిల్ రూపొందించే చట్టాలను, పీఓకే లెజిస్లేటివ్ అసెంబ్లీలో చర్చించ డానికి వీల్లేదు. పీఓకే కోర్టులు కూడా వీటిని విచారించడానికి వీల్లేదు. పీఓకే వార్షిక బడ్జెట్‌ను కూడా ఈ కౌన్సిల్ రూపొంది స్తుంది. ఆఖరికి విద్యా సంస్థల్లో పాఠ్యప్రణాళికను కూడా ఇదే తయారు చేస్తుంది. గత నాలుగేళ్లుగా మౌలిక సదుపాయాల కొరత, విద్యుత్ కోతలు, నీటి సరఫరా లేక నానా అగచాట్లు పడుతున్న పీఓకే ప్రజల నెత్తిమీద పాక్ ప్రభుత్వం, సైన్యం ఉమ్మడిగా రుద్దుతున్న నిరంకుశ పాలనకు చిహ్నమిది. నేడు పీఓకేలో ఆకలికేకలు మిన్నంటు తున్నా పట్టించుకునే దిక్కులేదు. 70 ఏళ్లుగా హింసను ఎగదోసి, విధ్వంసానికి కారకులైన వారు పీఓకే ప్రజలకు చూపిస్తున్న 'స్వర్గం' ఇదే! అయితే ఇవేవీ ఐక్యరాజ్య సమితికి ఏమాత్రం పట్టలేదు. భారత్, పాకిస్తాన్ మధ్య శాంతియుత వాతావరణం కోసం ఐరాస సాగించిన యత్నాలు ఎన్నడూ సఫలం కాకపోవడమే ఇందుకు నిదర్శనం.

ప్రపంచ వ్యాప్తంగా కూడా శాంతి స్థాపన, యుద్ధాల నివారణలో ఐక్యరాజ్య సమితి వైఫల్యాలు సుస్పష్టం. 1945లో ఐక్యరాజ్య సమితి (యు.ఎన్) ఏర్పాటైన దగ్గరి నుంచి ఇప్పటివరకు ప్రపంచ వ్యాప్తంగా అనేక యుద్ధాలు జరిగాయి వీటిల్లో కొన్ని ఇంకా జరుగు తున్నాయి కూడా. మరి సంస్థ ప్రధాన లక్ష్యమైన శాంతిస్థాపన, వివాదాల పరిష్కారం విషయంలో ఇంతవరకు సఫలీకృతమైన దాఖలాలు కనిపించవు. ఇందుకు ప్రధాన కారణం సంస్థలోని ఐదు శాశ్వత సభ్యత్వ దేశాలకున్న వీటో అధికారం! ఈ వీటో అధికారమే సంస్థ వైఫల్యాలకు మూలకారణ మని చెప్పాలి. తమకున్న ఈ ప్రత్యేక అధికారాన్ని మరో దేశాలతో పంచుకోవడం వీటికి ఎంతమాత్రం ఇష్టం ఉండదు. ఈ నేపథ్యంలో విదేశాంగ మంత్రి జైశంకర్ ఇటీవలి కాలంలో ఐక్యరాజ్య సమితి (యూఎన్)ని '1945లో కనుగొన్న స్తబ్ద యంత్రాంగం'గా అంటే 'వర్తమాన పరిస్థితులకు అనుగుణంగా విస్తరణకు నోచని' సంస్థ అని పేర్కొనడం సహేతుకం. ఇప్పటి వరకు మొత్తం 11



సార్లు ప్రపంచంలో వివిధ దేశాల్లో శాంతిస్థాపన విషయంలో ఐక్యరాజ్య సమితి విఫలం కావడానికి ఈ శాశ్వత సభ్యదేశాల అహంకార వైఖరే ప్రధాన కారణం. 1948లో యూదుల దేశం ఇజ్రాయిల్ ఏర్పాటైన దగ్గరి నుంచి ఇప్పటివరకు పాలస్తీనా సమస్యకు ఒక పరిష్కారం లభించలేదు. యూఎస్–వియత్నాం యుద్ధం ముగిసి కంబోడియాలో జరిగిన అంతర్యుద్ధం అనంతరం ఖ్మేర్‌రూజ్ కంబోడియాను నియంత్రణలోకి తీసుకొని అల్ట్రా మావోయిజాన్ని ప్రవేశపెట్టి దేశాన్ని సోషలిస్టు దేశంగా మార్చిన తర్వాత చోటుచేసుకున్న మారణకాండలో రెండు మిలియన్ల మంది మరణించినా ఐరాస ఖ్మేర్‌రూజ్‌ను గుర్తించింది. 1991లో సోమాలియా నిరంకుశ పాలకుడు మహమ్మద్ సయ్యద్ బారే పదవీచ్యుతుడైన తర్వాత, వైరి వర్గాల మధ్య చెలరేగిన సంఘర్షణ దశాబ్దాల పాటు కొనసాగింది. 1992లో మానవతా సహాయం అందించేందుకు యూఎన్ తన సహాయక సిబ్బందిని పంపినప్పటికీ, అక్కడ ప్రభుత్వమంటూ లేకపోవడంతో, యూఎన్ అధికారుల పైనే దాడులు జరిగాయి. ఇక్కడ యూఎన్ వైఫల్యం కారణంగా 5 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. 1994లో రువాండాలో సైన్యం, రువాండ్ ప్యాట్రియాట్రిక్ ఫ్రంట్ మధ్య భీకర పోరు జరిగింది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత చోటుచేసుకున్న అతిపెద్ద జాతి విధ్వంసంగా దీన్ని పేర్కొంటారు. అంతర్జాతీయ మధ్యవర్తిత్వాన్ని నిరోధించేందుకు హుటు తెగ ఆధిపత్యంలోని ప్రభుత్వం పది మంది యూఎన్ పీస్ కీపింగ్ అధికారులను చంపేసింది. కేవలం మూడు నెలల కాలంలో హుటు తెగవారు 8 లక్షల మంది టుట్సీ జాతి ప్రజలను చంపేశారు. ఈ భయంకర మైన హింసాకాండ విషయంలో యూఎన్‌ది కేవలం ప్రేక్షకపాత్రే. 1992లో బోస్నియా, హెర్జిగోవినా రెఫరెండం తర్వాత స్వాతంత్ర్యం ప్రకటించుకున్నాయి. తర్వాత బోస్నియా సెర్బులు, బోస్నియా ప్రభుత్వ సహాయంతో యుద్ధానికి దిగారు. చివరకు 1995లో 8 వేల మందిని బోస్నియన్ దళాలు చంపేశాయి. మిగిలిన వారు బతుకుజీవుడా అని యూఎన్ ఏర్పాటు చేసిన సురక్షిత ప్రాంతానికి వెళ్లినా, పెద్దగా ఆయుధాలు లేని డచ్ దళాలు వీరికి తగిన రక్షణ కల్పించలేక పోయాయి. 2003లో సూడాన్ పశ్చిమ ప్రాంతంలో డార్ఫర్‌లో పెద్దఎత్తున విధ్వంసకాండ చెలరేగింది. అరబ్‌యేతర రైతులపై ఖర్టుమ్ ప్రభుత్వం వివక్ష చూపుతున్నదన్న కారణంగా ఈ హింసాకాడ పెచ్చరిల్లింది. ఇందులో రెండు లక్షల మంది మరణించగా 2.5 మిలియన్ల మంది నిరాశ్రయు లయ్యారు. నాలుగేళ్ల తర్వాత యూఎన్ 26 వేల మంది శాంతి పరిరక్షక దళాన్ని పంపింది. అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు దేశాధ్యక్షుడు ఒమర్ హస్సన్ అల్ బషీర్‌పై యుద్ధనేరాల కింద అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. 2003లో యు.ఎస్. నేతృత్వంలో ఇరాక్‌పై జరిపిన దాడి సందర్భంగా పదిలక్షల మంది మరణించారు. 2011లో సిరియాలో చోటుచేసుకున్న ప్రజాస్వామ్య అనుకూల ప్రదర్శనకారులపై ఉగ్రవాదులనే నెపంతో బషర్ అల్ అషాద్ ప్రభుత్వం కాల్పులు జరిపించింది. అల్‌ఖైదా ఉగ్రవాదులను విడుదల చేసిన తర్వాత దేశంలో అంతర్యుద్ధం చెలరేగింది. ఇక్కడి ఘర్షణల్లో వివిధ దేశాలు కలుగజేసుకోవడం విషాదం. సిరియా సంక్షోభం కారణంగా 6.3 మిలియన్ల మంది దేశం వదిలి పారిపోయారు. మరో 6.2 మిలియన్ల మంది దేశంలోనే నిరాశ్రయులుగా మిగిలి పోవాల్సి వచ్చింది. 2011లో దక్షిణ సూడాన్ స్వతంత్ర దేశమైంది. దింకా జాతికి చెందిన దేశాధ్యక్షుడు సల్వాకీర్, న్యూయర్ జాతికి చెందిన మాజీ ఉపాధ్యక్షుడు రెయిక్ మాఛర్‌ల మధ్య విభేదాలు సివిల్‌వార్‌కు దారితీయడంతో 3,82,000 మంది మరణించారు. జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌ను ఐరాస ఏనాడూ తప్పుపట్ట లేదు. ఇవన్నీ ఐక్యరాజ్య సమితి ప్రేక్షక పాత్రకు ప్రత్యక్ష ఉదాహరణలు. ★



# సమూలంగా

**ప్రపంచ శాంతి, సుస్థిర అభివృద్ధి ప్రధాన లక్ష్యాలుగా ఏడున్నర దశాబ్దాలకు పూర్వం 1945లో ఏర్పడిన ఐక్యరాజ్య సమితి (ఐరాస) తన లక్ష్యసాధనకు ఆ దిశగా అడుగులు వేయడంలో, ప్రస్థానం సాగించడంలో ఏ మేరకు సఫలమైంది? ఐరాసకు అనుబంధంగా నిర్మించుకున్న భద్రతా మండలి, ఇతర ఐరాస అనుబంధ కీలక వేదికలు ఆశించిన లక్ష్యాలను అందుకోవడంలో ఎంతవరకు విజయం సాధించాయి? అంటే స్పష్టమైన సమాధానం చెప్పడం కొంచెం కష్టమే. విభిన్న కోణాల్లో విశ్లేషణ చేసినప్పుడు సహజంగానే ఐరాస ప్రస్థానంలో మెరుపులు కొన్ని, మరకలు మరికొన్ని దర్శనమిస్తాయి.**

ప్రపంచ శాంతి, సుస్థిర అభివృద్ధి, ఆరోగ్యం, పర్యావరణ ప్రమాణాల పెంపు వంటి ప్రధాన లక్ష్యాలను ప్రామాణికంగా తీసుకుని విశ్లేషించి నప్పుడు.. ఐరాస పట్టాలు తప్పి ప్రయాణం సాగిస్తోందనేదే ప్రముఖంగా చర్చకు వస్తోంది. ముఖ్యంగా ఐరాస ఆవిర్భావం నాటికి, నేటికి ప్రపంచం ఎన్నో మార్పులకు వేదిక అయింది. అప్పటి దాకా పరాయి పాలనలో ఉన్న అనేక లాటిన్ అమెరికా, ఆఫ్రికా దేశాలు అనంతర కాలంలో స్వతంత్ర దేశాలుగా అవతరించాయి. అయితే ఆ దేశాలకు ఐరాసలో సరైన ప్రాతినిధ్యం లభించలేదు.



**రాజనాల బాలకృష్ణ**
సీనియర్ జర్నలిస్ట్

నాడు సభ్యదేశాల సంఖ్య 50 నుంచి నాలుగు రెట్లు పెరిగినా ఆకాశంలో సగం కంటే అధికంగా ఉన్న ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలకు ఐరాసలో ప్రాతినిధ్యం లభించకపోవడం గమనార్హం.

రెండవ ప్రపంచ యుద్ధాన్ని నిరోధించడంలో నానాజాతి సమితి విఫలమైన నేపథ్యంలో 1945లో ఆవిర్భవించిన ఐరాస.. గడచిన 75 సంవత్సరాల పైచిలుకు ప్రస్థానంలో కొన్ని విజయాలను సొంతం చేసుకుంది. ముఖ్యంగా సేవాకార్యక్రమాల విషయంలో కొంత మెరుగైన ఫలితాలను సాధించింది. అదే సమయంలో అసలు విషయానికి వచ్చేసరికి.. అంతకుమించిన వైఫల్యాలను మూటకట్టుకుందని చెప్పాలి. అందుకే, ప్రస్తుతం ఐరాస ప్రపంచ వేదికలపై ఒక ప్రశ్నగా నిలుస్తోంది, తరచూ చర్చకు వస్తోంది. మారిన, మారుతున్న కాలానికి అనుగుణంగా ఐరాస స్వరూప, స్వభావాల్లో మార్పు చోటుచేసుకోక పోవడం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్న లోపంగా విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఈ వైఫల్యాలే ఐరాసలో సంస్కరణల అవసరాన్ని నొక్కి చెపుతున్నాయి.

నిజం. ఐరాస, భద్రతామండలిలో సంస్కరణల అవసరం గురించి చాలా కాలంగా చర్చ జరుగు తోంది. ఏడాదికి ఒకసారి జరిగే ఐరాస సర్వసభ్య సమావేశాల్లో సమితి పనితీరుపై ఎప్పటికప్పుడు విమర్శలు వినిపిస్తూనే ఉన్నాయి. అలాగే, విభిన్న అంతర్జాతీయ వేదికల నుంచి కూడా ఐరాసలో సంస్కరణల అవసరాన్ని నొక్కి చెప్పే ప్రకటనలు వస్తూనే ఉన్నాయి. ముఖ్యంగా మనదేశం మొదటి నుంచీ పరిస్థితులకు అనుగుణంగా, ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాల అవసరాల దృష్ట్యా ఐక్యరాజ్య సమితి పునఃనిర్మాణం జరగాలని, అలాగే ఆ సంస్కరణల్లో భద్రతామండలి కూడా భాగం కావాలని ఎప్పటినుంచో కోరుతోంది.

ఇదే క్రమంలో ఇటీవల (మే 21) జపాన్‌లోని హిరోషిమాలో జరిగిన, జీ– 7 శిఖరాగ్ర సదస్సులో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. ఐరాస, భద్రతా మండలిలో సంస్కరణల అవసరాన్ని ఒకింత ఘాటుగా, మరింత గట్టిగా నొక్కి చెప్పారు. ప్రపంచ దేశాల స్థితిగతులలో వస్తున్న మార్పులను, ప్రస్తుత ప్రపంచ అవసరాలను గుర్తించకుండా గతంలోనే ఉండిపోతే ఐరాస, భద్రతా మండలి కేవలం చర్చా వేదికలుగానే మిగిలిపోతాయని మోదీ హెచ్చ రించారు. ఐరాసను తప్పక సంస్కరించాల్సిందే అన్నారు. ప్రపంచశాంతి, సుస్థిరతలకు ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకే ఐరాస ఏర్పడిన విషయాన్ని గుర్తుచేశారు. వేర్వేరు వేదికల నుంచి ప్రపంచశాంతి, సుస్థిరతల గురించి ఎందుకు చర్చించవలసి వస్తోందంటూ విస్మయాన్ని వ్యక్తపరిచారు. పరోక్షంగా ఐరాస వైఫల్యం కారణంగానే ఈ చర్చలకు ఆస్కారం కలుగుతోందని చెప్పారు. అంతర్జాతీయ ఉగ్రవాదం, యుద్ధ నివారణ చర్యల గురించి వేర్వేరు వేదికలపై



చర్చించవలసిన అవసరం ఏర్పడుతోందంటే ఇక ఐరాస ఉన్నది ఎందుకు? ప్రపంచ శాంతి లక్ష్యంగా ఏర్పడిన ఐరాస ప్రపంచ దేశాల నడుమ ఘర్షణలను ఎందుకు నిరోధించలేకపోతోంది? ఉగ్రవాదాన్ని ప్రత్యక్షంగా చూస్తూ కూడా ఉగ్రవాదం అనే పదానికే స్పష్టమైన నిర్వచనం ఎందుకు ఇవ్వలేకపోతోంది? ఇవన్నీ సమాధానం దొరకని ప్రశ్నలని, వీటిపై ఆత్మవిమర్శ చేసుకోవాలని ప్రధాని మోదీ.. సభ్య దేశాలకు, వీటో పవర్‌ను గుప్పిట పట్టి ఐరాస ఆశయాలకు తూట్లు పొడుస్తున్న ఐదు దేశాలకు విమర్శతో కూడిన విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా, ఐరాసలో దక్షిణార్ధ గోళ దేశాల గళం కూడా వినిపించాలని, లేకపోతే ఫలితం లేని చర్చా వేదికగా ఐరాస మిగిలిపోతుందని అన్నారు. ప్రస్తుత

# సంస్కరించాలి!

ప్రపంచంలో ఐక్యరాజ్య సమితి పాత్రను మదింపు చేసుకోవడంతో పాటు ప్రపంచ భవిష్యత్తును తీర్చిదిద్ద గల సమర్థ వేదికగా దానిని తీర్చిదిద్దడానికి ఏం చేయాలనేది సమీక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

మరోవైపు ఐక్యరాజ్య సమితి 75వ వార్షికోత్సవం సందర్భంగా సర్వప్రతినిధి సభ (జనరల్ అసెంబ్లీ) ఆమోదించిన రాజకీయ ప్రకటనలోనూ నేతలు




బహుళ పక్ష భాగస్వామ్యంలో సంస్కరణలు చేపట్టవలసిన అవసరాన్ని నొక్కి చెప్పారు. రెండో ప్రపంచ యుద్ధం సృష్టించిన బీభత్స పరిస్థితుల్లో అవతరించిన ఐరాస ఘర్షణలు, ఉద్రిక్తతలు లేని నూతన సమాజ అవతరణను లక్ష్యంగా చేసుకున్నది. కాని ఆచరణలో అది దుస్సాధ్యంగానే రుజువవు తున్నది. ఏకాభిప్రాయాన్ని సాధించి, దేశాల మధ్య సామరస్య ఒప్పందాలను కుదిర్చే వేదికగా సమితి వైఫల్యం నిలువెత్తున దర్శనమిస్తున్నది. 2003లో అమెరికా, దాని మిత్ర దేశాలు కలిసి ఇరాక్‌పై జరిపిన యుద్ధాన్ని ఐక్యరాజ్య సమితి ఖండించిన సంగతి తెలిసిందే. జనవిధ్వంసక ఆయుధాలు తయారు చేస్తున్నదనే రుజువు కాని కారణం మీద సద్దాం హుస్సేన్ ఏలుబడిలోని ఇరాక్‌పై జార్జిబుష్ నేతృత్వంలో అమెరికా, దాని మిత్రదేశాలు జరిపిన దాడి ఐరాస నియమావళికి విరుద్ధమని, అది అక్రమ యుద్ధమని అప్పటి సమితి ప్రధాన కార్యదర్శి కోఫీఅన్నన్ స్వయంగా ప్రకటించారు.

ఐరాస వైఫల్యాల చిట్టా చాలా పెద్దదే. తాజాగా రష్యా – ఉక్రెయిన్ యుద్ధాన్ని నిరోధించడంలో సమితి సంపూర్ణ వైఫల్యం చెందడం చూశాం. అలాగే, ప్రపంచ వ్యాప్తంగా లక్షల మందిని పొట్టన పెట్టుకున్న కొవిడ్–19 మహమ్మారి పుట్టుకను నిర్ధారించడంలో ఐరాస అనుబంధ ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) చేతులెత్తేసిన తీరును కూడా చూశాం. ఈ అన్నిటినీ మించి పెద్దన్నల చేతిలోని ‘వీటో’ అస్త్రానికి సమితి బందీ అయిన తీరు దాని వైఫల్యాలకు అద్దం పడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఐరాస అవసరమా? అనే ప్రశ్న ప్రపంచ, ప్రాంతీయ వేదికలపై వినిపిస్తోంది. ఇందుకు, ఇంతకుముందే అనుకున్నట్లుగా ‘ఎక్కడ వేసిన గొంగళి’ అక్కడే అన్నట్లుగా సమితి సంస్కరణలకు నోచుకోకపోవడం ఒక ప్రధాన కారణం. అలాగే, వీటో అధికారం ఉన్న ఐదు శాశ్వత సభ్యదేశాలు అమెరికా, రష్యా, చైనా, ఫ్రాన్స్, ఇంగ్లాండ్‌లు తమ ప్రయోజనాలు, తమకు అనుకూలంగా ఉండే దేశాల స్వార్థ ప్రయోజనాలకు సమష్టి ప్రయోజనాలను బలిస్తున్న తీరు మరో ప్రధాన కారణం. అందుకే భారతదేశం మొదటి నుంచి శాశ్వత సభ్య దేశాల, తాత్కాలిక సభ్యదేశాల ప్రాతినిధ్య పరిధిని విస్తరించాలని డిమాండ్ చేస్తోంది.

భారతదేశానికి ఇంతవరకూ ఐరాస భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వ ఇవ్వకపోవడం ఓ అంతర్జాతీయ తప్పిదం. అమెరికా, రష్యా, చైనా, బ్రిటన్, ఫ్రాన్స్ వంటి ఐదు దేశాలకు మాత్రమే శాశ్వత సభ్యత్వం ఉంది. భారత్‌కు శాశ్వత సభ్యత్వం ఇస్తే అది భారత్‌కే కాకుండా విశ్వశాంతికి ఉపకరిస్తుంది. అంతేకాదు, మండలిలో శాశ్వత సభ్యత్వం పొందేందుకు భారత్‌కు అన్ని అర్హతలు ఉన్నాయి. జనాభాలో భారతదేశం ప్రథమ స్థానానికి చేరింది. భూభాగం విషయానికి వస్తే ప్రస్తుత శాశ్వత సభ్యదేశాల కంటే విశాల దేశం. అలాగే, జీడీపీ, ఆర్థిక సుస్థిరత, వారసత్వ నాగరికత, సాంస్కృతిక భిన్నత్వం, రాజకీయ విధానం, ఐరాస శాంతిపరిరక్షణ కార్యకలాపాలలో భారత్ భాగస్వామ్యం ఏ దేశానికి తీసిపోని విధంగా ఉంది. అన్నిటినీ మించి భద్రతా మండలి శాశ్వత సభ్యత బాధ్యతలను స్వీకరించేందుకు భారత్



భారతదేశానికి ఇంతవరకూ ఐరాస భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వ ఇవ్వకపోవడం ఓ అంతర్జాతీయ తప్పిదం. అమెరికా, రష్యా, చైనా, బ్రిటన్, ఫ్రాన్స్ వంటి ఐదు దేశాలకు మాత్రమే శాశ్వత సభ్యత్వం ఉంది. భారత్‌కు శాశ్వత సభ్యత్వం ఇస్తే అది భారత్‌కే కాకుండా విశ్వశాంతికి ఉపకరిస్తుంది.

సంసిద్ధతను వ్యక్తపరిచింది. అయితే, సైంధవ పాత్ర పోషిస్తున్న చైనా మాత్రం అడ్డుపుల్లలు వేస్తోంది.

నిజానికి, ఆ ఐదు దేశాలకు ఉన్న ‘వీటో’ అధికారం.. ఐరాస ఆశయాలకు అడ్డుగోడగా నిలుస్తోంది. అందుకే, ఐరాస తీసుకున్న అనేక కీలక నిర్ణయాలు అమలుకు నోచుకోవడం లేదు. భద్రతా మండలిలో చర్చించిన కీలక అంశాలపై ఓటింగ్ ఉంటుంది. దీని ప్రకారమే నిర్ణయాలు అమలుచేసే వీలుంటుంది. ఓటింగ్ సందర్భంగా మెజారిటీ సభ్య దేశాలు, తీర్మానానికి అనుకూలంగా ఓట్లు వేసినా అయిదు దేశాలలో ఏ ఒక్కటి తన ‘వీటో’ అధికారాన్ని వినియోగించుకున్నా ఆ తీర్మానం వీగిపోతుంది. సాధారణంగా వీటో అధికారాన్ని వినియోగించే సందర్భాలు ఎందుకు వస్తాయంటే.. అమెరికా, చైనా వంటి శాశ్వతసభ్య దేశాలు తమ జాతీయ ప్రయోజనం దెబ్బతింటుందని భావించినా, లేదా తమ కూటమిలోని దేశ ప్రయోజనం దెబ్బ తింటుందని భావించినా ‘వీటో’ను వినియోగిస్తాయి. అయితే తనకు నచ్చని దేశాన్ని ఇబ్బంది పాలు చేయాలన్నా ఈ అస్త్రం ప్రయోగిస్తున్నాయి.

‘ఆర్థిక సంపన్నమైన రెండు దేశాలు ప్రపంచాన్ని చీలుస్తున్నాయి. భవిష్యత్తు ఎలా ఉంటుందో ఊహించలేం’ అని ఐరాస సెక్రటరీ జనరల్ గుటెరస్ చేసిన వ్యాఖ్యలు సమితి సదాశయాలకు ఎదురు కానున్న అగ్నిపరీక్ష గురించి హెచ్చరిస్తున్నాయి. ఆయన సూచించినట్టు ప్రపంచమంతటా కాల్పుల విరమణకు భద్రతా మండలి వేదికగా చిత్తశుద్ధితో కూడిన కృషి జరగాలి. అమెరికా, చైనాల మధ్య ఉత్పన్నమైన ప్రచ్ఛన్న యుద్ధానికి తెర దించాలి. అప్పుడే నూతన ప్రపంచ అవతరణకు దారులు పడతాయి. లేని పక్షంలో ప్రపంచం తీవ్రమైన సంక్షోభానికి లోనవుతుంది. ★

బిఎస్.శర్మ, 9246101884

# రామాయణంలో ఉన్నదంతా ధర్మమే

శ్రీమద్రామాయణ కల్పవృక్షాన్ని తెలుగువారికి అందించిన అపరవాల్మీకి విశ్వనాథ సత్యనారాయణ గారు. 'మరల ఇదేల రామాయణం' అని అడిగిన వారికి జవాబు చెప్తుతూ "ఎవరి అనుభూతి వారిది" – 'రోజూ అదే అన్నం' తినడంలేదా?" అంటారు. సింహప్రసాద్ గారు తన ఆత్మారాముని తృప్తి కోసం రాసుకొన్న శ్రీరాముడి ధర్మపథం – తెలుగు పాఠకులకు ఓ అమృత కలశం. బహుగ్రంథ కర్తగా ప్రసిద్ధికెక్కిన, వందలాది కథలు, నవలలు రాసిన ఆయన కలం, వాల్మీకి రామాయణం ఆధారంగా శ్రీరాముడి ధర్మపథం గురించి అందించిన ఈ 340 పేజీల గ్రంథం ఓ పరిశోధనాత్మక రచన. ఓ బృహత్ విశ్లేషణాత్మక వ్యాసం.

సింహప్రసాద్ ఈ గ్రంథాన్ని కొత్తరకంగా అందించారు. 32 విభాగాలుగా రామకథను చెప్పక చెప్తూనే రామాయణ, రామనామ విశిష్టతలను తెలియజేశారు. దేశ విదేశాల్లో రాముని కథ, ఎక్కడెక్కడ ఎలా ఉందో తెలిపే విశేషాలు రాశారు. అవి ఎక్కువ మందికి తెలియని, తక్కువ తెలిసిన విశేషాలు. వీరు వెలికి తీశారు, గ్రంథస్థం చేశారు.

ఈ మహాకావ్యంలో ఉన్న ప్రధాన పాత్రలను రెండు అధ్యాయాలలో (ఎఫ్,29) పరిచయం చేశారు. ఆయా పాత్రలను విశ్లేషించారు. వాటి ప్రాముఖ్యతపై వ్యాఖ్యానం చేశారు. రామరావణుల మధ్య గల భేదాలను ఓ చిన్న పట్టిక ద్వారా తెలియజేసిన తీరు ప్రశంసనీయం. రామాయణం ఓ సామాజిక గ్రంథం, బతుకు పుస్తకం అని ప్రశంసిస్తూ , ధర్మం నిండిన రామాయణ గ్రంథం పఠిస్తే కలిగే ఫలితాలను ఒక్క ముక్కలో చెప్పారు రచయిత. "పరిపూర్ణ వ్యక్తిత్వానికి, సంపూర్ణ జీవనానికి, ధన్యజీవనానికి పెద్ద బాలశిక్ష రామాయణం" అంటారీయన.

రామాయణ పఠనంతో "మన జీవన విధానం మారిపోతుంది" అని ఘంటాపథంగా చెప్తారు



**శ్రీరాముడి ధర్మపథం**
**రచయిత :** సింహప్రసాద్
**పే.:** 340, **వెల:** రూ.250
ప్రతులకు : నవోదయ బుక్ హౌస్
హైదరాబాద్.
సెల్: 9000413413
శ్రీశ్రీ ప్రచురణలు
సెల్ : 9849061668
ఇతర ప్రధాన కేంద్రాలలో

సింహప్రసాద్.

దాదాపు 16 ప్రధాన గ్రంథాలను పఠించి, జీర్ణించుకొని ఈ 'శ్రీరాముడి ధర్మపథం' నిర్మించారు. ఈ గ్రంథపఠనం కూడా 'రామాయణ పఠన' ఫలితం ఇస్తుందనిపిస్తుంది.

పనిలో పనిగా రచయిత రాముడిని, వాల్మీకిని అన్యాయంగా విమర్శించే వామపక్ష కుహనా మేధావుల అవాకులకు సహేతుకంగా జవాబు ఇచ్చారు. వాలి సంహారం, శంబూకుని వధ, సీతమ్మ అగ్నిప్రవేశ ఘట్టాలను కూలంకషంగా చర్చించారు.

శ్రీరాముని జన్మభూమిలో తయారవుతున్న భవ్యమందిర వివరాలు, శ్రీరాముని అడుగు జాడలంటూ రామాయణ కాలం నాటి స్థలాలు నేడు ఎక్కడెక్కడున్నాయో, శ్రీలంకలోని దర్శనీయ స్థలాలను 'బోనస్'గా రచయిత అందించారు.

ఈ 'శ్రీరాముడి ధర్మపథం' రామాయణ సర్వస్వం. రామాయణానికి 'సింహానందిని' వ్యాఖ్యానం చక్కటి భాష్యం అనదగినది. 32 అధ్యాయాలు... ప్రతీ అధ్యాయాన్ని కొన్ని ఉపాఖ్యానాలుగా విభజించటంతో 'పాఠకులకు' చదవటం సులభతరం అయ్యింది.

గ్రంథం అంతా చదవటం, మననం చేసుకోవటం, రక్తగతం చేసుకోవటం అవసరమైనా, 9వ అధ్యాయాన్ని ఒకటికి రెండుసార్లు పఠించాలి అందరూ. ముఖ్యంగా యువత రాముడిని ఆదర్శంగా స్వీకరించాలి. రాముడి గుణగణాలను నారదమహర్షి వర్ణించిన షోడశ (16) లక్షణాలు ఈ గ్రంథంలో 9వ అధ్యాయంలో ఉన్నాయి. ఇవే పరిపూర్ణ మానవుని అపురూప లక్షణాలు. దాదాపు 40 పేజీలలో జగదభిరాముడిని కీర్తించారు.

"ఒక్కసారిగా మంచితనం ఊడిపడదు. ఈ 16 లక్షణాలు అలవర్చుకోవడమే వ్యక్తిత్వ వికాసం" అని అంటారు గ్రంథకర్త. రాముని గుణాలు గమనించి వాటిలో తమకు ఎన్ని ఉన్నాయో, ఏ స్థాయిలో ఉన్నాయో గ్రహించే 'చెక్-లిస్ట్' వంటిదని సింహప్రసాద్ అభిప్రాయపడ్డారు. ఉన్నత గుణాలస్థాయి పెంచుకోవాలి – లేనివి అలవర్చుకోవడానికి ప్రయత్నం చేయాలి. అప్పుడే ఉత్తములవుతారు. ఇదే రామమార్గం. ఇదే ఈ గ్రంథ ప్రయోజనం!!

ప్రభుత్వ సలహాదారు డా॥ కె.వి.రమణాచారి – తన 'నానుడి' అనే ముందుమాటలో (స్వ అక్షరాలలో లిఖించటం ప్రత్యేకత) చెప్పినట్లు ఈ గ్రంథం – చదువుతున్న ప్రతీవాణ్ణీ ఆకట్టుకొంటుంది. పుస్తకాన్ని ఆసాంతం చదివించేలా వీరిశైలి, తీరు ఉంది. పుస్తకం చదవకుండా ఉంటే మనం ఏదో కోల్పోయినట్లే. సత్యం– నాకూ అలానే అనిపించింది. ఈ పుస్తకం నిత్య పారాయణ గ్రంథం. రచయిత, పరిశోధకులు సింహప్రసాద్ ధన్యులు. అభినందనీయులు. ★

**'ఒక్కసారిగా మంచితనం ఊడిపడదు. ఈ 16 లక్షణాలు అలవర్చుకోవడమే వ్యక్తిత్వ వికాసం" అని అంటారు గ్రంథకర్త. రాముని గుణాలు గమనించి వాటిలో తమకు ఎన్ని ఉన్నాయో, ఏ స్థాయిలో ఉన్నాయో గ్రహించే 'చెక్-లిస్ట్' వంటిదని సింహప్రసాద్ అభిప్రాయపడ్డారు. ఉన్నత గుణాలస్థాయి పెంచుకోవాలి – లేనివి అలవర్చుకోవడానికి ప్రయత్నం చేయాలి. అప్పుడే ఉత్తములవుతారు.**




**విజయం వీరులను, ధీరులను మాత్రమే వరిస్తుందన్న మాటను మహేంద్రసింగ్ ధోనీ నాయకత్వంలోని చెన్నై సూపర్ కింగ్స్ మరోసారి నిజం చేసింది. ఐదోసారి ఐపీఎల్ విజేత కావడం ద్వారా ముంబై సరసన నిలిచింది.**

# ఐపీఎల్ -16లో చెన్నై 'సూపర్' షో!

దేశవిదేశాలలోని కోట్లాదిమంది అభిమానులను గత ఏడు వారాలుగా ఓలలాడిస్తూ వచ్చిన ఐపీఎల్ -16వ సీజన్‌కు వరుణదేవుడు గొప్ప ముగింపునే ఇచ్చాడు. నువ్వానేనా అన్నట్లుగాసాగిన టైటిల్ సమరంలో నాలుగుసార్లు విజేత చెన్నై సూపర్ కింగ్స్ (డక్‌వర్త్-లూయిస్ విధానం ప్రకారం) 5 వికెట్ల విజయంతో 5వ టైటిల్‌ను కైవసం చేసుకొంది.

### గుజరాత్ ఉరుములు- చెన్నై మెరుపులు!

దేశంలోని 10 నగరాలు 12 వేదికల్లో జరిగిన ఐపీఎల్-16వ సీజన్ లీగ్‌లో అత్యుత్తమంగా రాణించిన గుజరాత్ టైటాన్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్ల మధ్య జరిగిన ఫైనల్స్‌తో వర్షం రెండురోజుల పాటు దోబూచులాడింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం క్రీడాభిమానులతో కిటకిటలాడిపోయింది. మే 29న జరగాల్సిన ఈ మ్యాచ్ వర్షం కారణంగా 30న జరిగింది.

ఈ టైటిల్ సమరంలో టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆతిథ్య గుజరాత్ టైటాన్స్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 214 పరుగుల రికార్డు స్కోరు సాధించింది. ఐపీఎల్ గత 16 సీజన్ల చరిత్రలో ఫైనల్లో నమోదైన అతిపెద్ద స్కోరు ఇదే కావటం విశేషం. గత మ్యాచ్ సెంచరీ హీరో శుభ్‌మన్ గిల్ 39 పరుగుల స్కోరుకే వెనుదిరిగినా మరో ఓపెనర్ వృద్ధిమాన్ సాహా (54), యువఆటగాడు సాయి సుదర్శన్ (96 పరుగులు) మెరుపు బ్యాటింగ్‌తో గుజరాత్ టైటాన్స్ ప్రత్యర్థి ఎదుట 215 పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచగలిగింది.

### చెన్నై విజయ లక్ష్యం 1
### 5 ఓవర్లలో 171 పరుగులు

మ్యాచ్ నెగ్గాలంటే 20 ఓవర్లలో 215 పరుగులు చేయాల్సిన చెన్నై ఇన్నింగ్స్‌కు వానదెబ్బతో రెండుసార్లు అంతరాయం కలగడంతో డక్‌వర్త్-లూయిస్ విధానం ప్రకారం.. లక్ష్యాన్ని 15 ఓవర్లలో 171 పరుగులుగా నిర్ణయించారు. 15వ ఓవర్ ఆఖరి రెండు బంతుల్లో రవీంద్ర జడేజా సిక్సర్, ఫోర్ సాధించడం ద్వారా చెన్నైకి చిరస్మరణీయ విజయం అందించాడు. చెన్నై కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ ఐదోసారి సగర్వంగా ఐపీఎల్ ట్రోఫీని అందుకోగలిగాడు.

ఈ విజయంతో.. గతంలో ముంబై ఇండియన్స్ నెలకొల్పిన ఐదు ఐపీఎల్ టైటిల్స్ రికార్డును చెన్నై సూపర్ కింగ్స్ సమం చేయగలిగింది. 2010, 2011, 2018, 2021 సీజన్లలో ఐపీఎల్ టైటిల్ నెగ్గిన చెన్నై కేవలం ఏడాది విరామంలోనే ఐదో టైటిల్ కైవసం చేసుకోడం ధోనీ నాయకత్వానికి ప్రతీకగా మిగిలిపోతుంది.

### శుభ్ మన్ గిల్, మహ్మద్ షమీ షో...

ఐపీఎల్ -16వ సీజన్ అత్యుత్తమ బ్యాటర్, బౌలర్ అవార్డులను గుజరాత్ టైటాన్స్ ఓపెనర్ శుభ్ మన్ గిల్, ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమీ గెలుచుకొన్నారు. మొత్తం 17 మ్యాచ్‌ల్లో శుభ్ మన్ గిల్ 3 శతకాలతో సహా 890 పరుగులు సాధించడం ద్వారా పర్పుల్ క్యాప్ అందుకొన్నాడు. అత్యుత్తమ బౌలర్‌గా మహ్మద్ షమీ 17 మ్యాచ్‌ల్లో 28 వికెట్లు పడగొట్టడం ద్వారా ఆరెంజ్ క్యాప్ సాధించాడు. అత్యంత ప్రతిభావంతుడైన యువక్రికెటర్ అవార్డును రాజస్థాన్ రాయల్స్ ఓపెనర్ యశస్వి జైశ్వాల్ (625 పరుగులు) అందుకొన్నాడు. మ్యాన్ ఆఫ్ ది ఫైనల్ అవార్డును చెన్నై ఓపెనర్ దేవన్ కాన్వేకి దక్కింది. విజేతగా నిలిచిన చెన్నైకి 20 కోట్ల రూపాయలు, రన్నరప్ గుజరాత్ టైటాన్స్‌కు 13 కోట్ల రూపాయలు ప్రైజ్ మనీ దక్కింది.

### ఇది రికార్డుల ఐపీఎల్..

2008 నుంచి ప్రస్తుత ఐపీఎల్ వరకూ.. అత్యధిక రికార్డులు నమోదైన టోర్నీగా ప్రస్తుత 16వ సీజన్ నిలిచిపోతుంది. ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధనను తొలిసారిగా ప్రవేశ పెట్టడంతో పరుగుల మోత మోగడమే కాదు.. రికార్డులు వెల్లువెత్తాయి. ఎన్నడూ లేనంతగా 37సార్లు 200కు పైగా స్కోర్లు నమోదయ్యాయి. మొత్తం 74 మ్యాచ్‌ల్లో సగటున తొలి ఇన్నింగ్స్ లో 183 పరుగుల స్కోర్లు నమోదయ్యాయి. 8.99 రన్ రేట్ నమోదైన తొలి టోర్నీ ఇదే కావడం మరో విశేషం. వివిధ జట్ల బ్యాటర్లు 153 హాఫ్ సెంచరీలు, 11 సెంచరీలు సాధించడం మరో రికార్డుగా మిగిలిపోతుంది.

### అంబటి రాయుడు అల్విదా...!

ఈ ఐపీఎల్ సీజన్‌తో తెలుగుతేజం, చెన్నై సూపర్ కింగ్స్ మిడిలార్డర్ బ్యాటర్ అంబటి రాయుడు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఫైనల్లో కేవలం 8 బంతుల్లోనే 2 సిక్సర్లు, ఓ బౌండ్రీతో 19 పరుగుల స్కోరు సాధించడం ద్వారా 237.50 సగటు నమోదు చేయడం ద్వారా తన వంతు పాత్ర నిర్వర్తించాడు. రెండు వేర్వేరు జట్ల తరపున ఆరుసార్లు ఐపీఎల్ ట్రోఫీ నెగ్గిన ఏకైక ప్లేయర్‌గా చరిత్ర సృష్టించాడు. తన ఐపీఎల్ ప్రస్థానంలో మొత్తం 14 సీజన్లలో 204 మ్యాచ్‌లు ఆడడంతో పాటు 11 సార్లు ప్లే-ఆఫ్ రౌండ్లలోనూ, 8సార్లు ఫైనల్స్‌లోనూ పాల్గొని అరడజను ట్రోఫీలు అందుకోగలిగాడు.

2010 సీజన్లో ముంబై ఇండియన్స్ తరపున తొలిసారిగా ఆడిన రాయుడు ఈ సీజన్ ఫైనల్స్ వరకూ 204 మ్యాచ్‌ల్లో 4వేల 329 పరుగులు సాధించాడు. ఇందులో ఓ సెంచరీ, 22 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. 127 పరుగుల స్ట్రయిక్ రేట్, 2018 సీజన్లో అత్యుత్తమంగా 602 పరుగులు సాధించాడు. ఐపీఎల్ ట్రోఫీతో కెరియర్ మొదలు పెట్టి, ఐపీఎల్ ట్రోఫీతోనే ముగింపు పలికిన రాయుడుకి, వెటరన్ మహేంద్రసింగ్ ధోనీకి ఐపీఎల్-16వ సీజన్ చిరస్మరణీయంగా మిగిలిపోతుంది. ★



క్రీడా కృష్ణ, 84668 64969
సీనియర్ జర్నలిస్ట్

# దేశ హితం కోసమే ఆర్‌ఎస్‌ఎస్ శిక్షణ

## రెండు రాష్ట్రాలలో ముగిసిన శిక్షావర్గలు





**భాగ్యనగర్ :** "భారత్ అన్ని రంగాలలో అభివృద్ధిని సాధించి విశ్వగురువుగా అవతరించడం ప్రపంచానికి కూడా అవసరం. ఈ పరమవైభవ స్థితిని సాధించే లక్ష్యంతోనే ఆర్.ఎస్.ఎస్. పని చేస్తోంది. నేడు ఉన్న సూపర్‌పవర్ హోదాకు, విశ్వగురు భావనకు ఎంతో తేడా ఉంది. సూపర్ పవర్ స్థానంలో ఉన్న దేశాలు పాల్పడే వివక్ష, శోషణలకు విశ్వగురు భావనలో చోటులేదు" అని దక్షిణ మధ్య సహ క్షేత్ర ప్రచారక్ శ్రీరామ్ భరత్‌కుమార్ అన్నారు. అన్నోజిగూడ శ్రీ విద్యావిహార ఉన్నత పాఠశాలలో మే 26న జరిగిన ప్రథమవర్ష (20రోజులశిక్షణ) ముగింపు కార్యక్రమంలో శ్రీరామ్ భరత్‌కుమార్ ముఖ్యవక్తగా పాల్గొన్నారు. సమాజాన్ని సంఘటిత పరిస్తే ఆ సమాజమే తన సమస్యలను తీర్చుకోగలుగుతుందని డాక్టర్జీ భావించే వారని గుర్తుచేశారు. దేశంలో సకారాత్మక మార్పు తీసుకు వచ్చేందుకు కొందరు పనిచేస్తుంటే విచ్ఛిన్నకర శక్తులు సమస్యలు సృష్టిస్తున్నాయి. సాక్షాత్తు అంబేద్కర్ నిరాకరించిన దళిత క్రైస్తవులకు రిజర్వేషన్‌లను డిమాండ్ చేస్తూ వాటిని సాధించడం కోసం ఆయన పేరునే ఉపయోగిస్తున్నారు. అమెరికాలో తీవ్రవాద దాడులతో సమానమని భావించిన భ్రూణహత్యలు, స్వలింగ వివాహాలకు సంబంధించిన చట్టాలను మన దేశంలోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. ఆ విధంగా వివిధ రుగ్మతలను సమాజంలో ప్రవేశ పెట్టాలని చూస్తున్నారని, ఈ ధోరణిని ప్రజానీకం ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య అమృతోత్సవాలు, తెలంగాణలో నైజాం విముక్త స్వాతంత్ర్య అమృతోత్సవాలు, అయోధ్య రామమందిర నిర్మాణం కోసం నిధి సేకరణ వంటి సకారాత్మక, అద్భుత కార్యక్రమాలు జరిగాయని భరత్ కుమార్ అన్నారు.

అంతకుముందు సమారోప్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కె. సాంబిరెడ్డి మాట్లాడుతూ బలమే జీవనమని, జనంకోసం జీవించాలన్న డా. అంబేద్కర్ మాటలను గుర్తుపెట్టుకుని ముందుకు సాగాలని ఉద్బోధించారు. చల్లా వివేకానందరెడ్డి వర్గాధికారిగా వ్యవహరించారు. కార్యక్రమంలో శిక్షార్థులు ప్రదర్శించిన శారీరిక కార్యక్రమాలు 1750 మంది ఆహుతులను ఆకర్షించాయి. ★



**విశాఖపట్నం :** మే 25న చంద్రపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు సంబంధించిన ద్వితీయవర్ష సంఘ శిక్షావర్గ (20 రోజుల శిక్షణ) ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా గాయత్రి విద్యాసంస్థలు విశాఖపట్నం అధినేత ప్రొ.సోమరాజు పాల్గొని ప్రసంగిస్తూ 'అందరం ఏకమై దుష్టశక్తుల బారినుంచి దేశాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందని' అన్నారు. ఈ వర్గలో ఆంధ్రప్రదేశ్ నుండి 66,తెలంగాణ నుండి 74మంది కార్యకర్తలు శిక్షణ పొందారు. ఈ వర్గకు వర్గాధికారిగా ఆంధ్రా యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్, విద్యాభారతి ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు ప్రొ.జి.నాగేశ్వరరావు వ్యవహరించారు.

ప్రధానవక్తగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ ప్రాంత కార్యకారిణి సభ్యులు వోలేటి సత్యనారాయణ ప్రసంగిస్తూ సమాజానికి ఆపద వచ్చినప్పుడు ప్రజలకు అండగా ముందు నిలిచేది ఆర్.ఎస్.ఎస్. అని అన్నారు. సమాజంలో చెడును దూరం చేయాలని కోరుకునేవారే స్వయంసేవకులని అన్నారు. 98సంవత్సరాలలో అనేక అగ్ని పరీక్షలు తట్టుకుని దేశంలో ఏ కష్టం వచ్చినా కోట్లమందికి తాము పొందిన సంస్కారం ద్వారా స్వయంసేవకులు సేవ చేశారని వారు గుర్తు చేశారు. 'అధికారం, ఆదరణ ప్రధానం కాదు. మన పనిని నిస్వార్థంతో చేస్తూ పోవడమే ధర్మం. కార్యకర్తలైన మనం జగన్మాతను హృదయాలలో ప్రతిష్టించుకుని, ఈ దేశం కోసం పనిచేస్తూ జీవితాలను భారతమాత పాదాలపై సమర్పించుకుందాం' అని ముగించారు. ముగింపు కార్యక్రమంలో శిక్షార్థులు ప్రదర్శించిన శారీరిక కార్యక్రమాలు వీక్షకులను ఆకర్షించాయి. ★






**విజయవాడ:** విజయవాడ సమీపంలోని నూతక్కి, విజ్ఞానవిహార పాఠశాల ఆవరణలో మే 26న ప్రథమ వర్ష సంఘశిక్షావర్గ (20 రోజుల శిక్షణ) ముగింపు కార్యక్రమంలో ముఖ్యవక్తగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ ప్రాంత ప్రచారక్ ఆదిత్య ప్రసంగిస్తూ భారతదేశం స్వాతంత్ర్యం కోల్పోవడానికి కారణాలను(దోషాలను) విశ్లేషించుకొని వాటిని సవరించుకుంటూ హిందూ సంఘటనా కార్యాన్ని కొనసాగించటమే సంఘకార్య విశిష్టత అన్నారు. పునర్వైభవ స్థితికి తీసుకెళ్ళడం ద్వారా ఈ దేశాన్ని జగద్గురువుగా నిలబెట్టడమే సంఘ కార్య లక్ష్యం అన్నారు. దీనికోసం వ్యక్తిగత శీలంతో పాటు, జాతీయ శీలాన్ని నిర్మాణంచేయడం సంఘ శాఖల ద్వారా జరుగుతుందని అన్నారు. ఆర్.ఎస్.ఎస్. సంస్థగా సమాజంలోని సమస్యల గురించి పనిచేయదు. అన్ని సమస్యలకు సమాధాన మిచ్చే సౌశీల్యవంతమైన వ్యక్తులను మాత్రమే తయారు చేస్తుందని ఆదిత్య అన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ వ్యాపారస్తులు శిద్దా హనుమంత రావు, వర్గాధికారిగా సివిల్ కాంట్రాక్టర్ బి.వేణు గోపాల్ పాల్గొన్నారు. వర్గలో 155మంది కార్యకర్తలు శిక్షణ తీసుకున్నారు. శిక్షార్థులు ప్రదర్శించిన వివిధ శారీరిక అంశాలు కార్యక్రమానికి వచ్చిన ఆహుతులను ఆకర్షించాయి. ★

### ప్రథమవర్ష (విశేష)

ప్రథమవర్ష (విశేష) సంఘ శిక్షావర్గ మే 12 నుండి 26వ వరకు భాగ్యనగర్‌లోని అన్నోజిగూడ, ఆర్.వి.కెలో జరిగింది. ఇందులో ఆంధ్రప్రదేశ్ నుండి89,తెలంగాణ నుండి 76మంది కార్యకర్తలు (40 నుండి 65 సం. మధ్య వయస్సున్నవారు) శిక్షణ పొందారు.





**విశాఖపట్నం :** గుడిలోవ విజ్ఞాన విహార పాఠశాల ఆవరణలో మే 26న జరిగిన ప్రథమవర్ష సంఘ శిక్షావర్గ (20 రోజుల శిక్షణ) ముగింపు కార్య క్రమంలో ముఖ్యఅతిథిగా నోవాస్ కన్స్ట్రక్షన్స్ అధినేత వరదా ధర్మేంద్ర పాల్గొన్నారు. ప్రధాన వక్తగా విచ్చే సిన ఆంధ్రప్రదేశ్ ప్రాంత సహకార్యవాహ యుగంధర్ మాట్లాడుతూ ఆర్.ఎస్.ఎస్. చాలామందికి తెలియక మత సంస్థ అనుకుంటారని, కానీ అది గొప్ప దేశభక్తి గల సంస్థ అని అన్నారు. దేశానికి ఏ ఆపద వచ్చినా ఆర్.ఎస్.ఎస్. ముందు ఉంటుందన్నారు. దేశ భక్తులను తయారు చేయటమే ఈ వర్గ ఉద్దేశం అన్నారు. దేశాన్ని పరమవైభవ స్థితికి తీసుకు పోవటమే సంఘ లక్ష్యంగా పని చేస్తుందని అన్నారు. వర్గాధికారిగా రామకృష్ణ విద్యాసంస్థల (కర్నూలు) అధినేత డా॥ గడ్డం రామకృష్ణారెడ్డి వ్యవహరించారు. వర్గలో 167 మంది కార్యకర్తలు శిక్షణ తీసుకున్నారు. ముగింపు కార్యక్రమంలో శిక్షార్థులు ప్రదర్శించిన శారీరిక విన్యాసాలు పలువురిని ఆకర్షించాయి. ★

## ఏలూరులో సేవికా సమితి వర్గ





**ఏలూరు:** రాష్ట్ర సేవికాసమితి ఆంధ్రప్రదేశ్, శిక్షణ శిబిరం మే 6వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ఏలూరులోని సిద్ధార్థ క్వెస్ట్ రెసిడెన్షియల్ క్యాంపస్, వట్లూరులో జరిగింది.

ప్రవేశ శిక్షావర్గకు 60 మంది, ప్రబోధ వర్గకు ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల నుండి 13 మంది శిక్షార్థులు పాల్గొన్నారు. శారీరిక, బౌద్ధిక అంశాలు, వివిధ అంశాలపై చర్చలు, ఘోష్, యోగ చాప్, దండ మొదలగు అంశాలలో శిక్షణ ఇచ్చారు. శిక్షార్థులకు నలుగురు రాష్ట్ర సేవికాసమితి కేంద్ర అధికారుల, ఆర్.ఎస్.ఎస్. పెద్దల మార్గదర్శనం లభించింది. మే 19వ తేదీ శుక్రవారం ఘోష్‌తో ఏలూరు పురవిధులలో పథసంచలన్ జరిగింది. ఈ సంచలన్ కార్యక్రమం ఏలూరులోని పలువురి పుర ప్రముఖుల ప్రశంసలను అందుకున్నది. 21వ తేదీ సాయంత్రం 6 గంటలకు ముగింపు కార్యక్రమం జరిగింది. శిక్షార్థుల శారీరిక ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి మోతే త్రిపుర సుందరి, (మాజీ మున్సిపల్ చైర్మన్) ముఖ్య అతిథిగా విచ్చేశారు.

వక్త అన్నదానం సీతాగాయత్రి (అఖిల భారత ప్రముఖ కార్యవాహిక, రాష్ట్ర సేవికా సమితి) మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో తమ ప్రతిభను, నైపుణ్యాలను చాటాలని, శారీరకంగా, మానసికంగా దృఢంగా, ధైర్యంగా ఉంటూ సమస్య లను ఎదుర్కోవాలని, సమాజ కార్యంలో తమ వంతు భాగస్వామ్యాన్ని అందించా లని పేర్కొన్నారు.

వర్గ సర్వాధికారిగా వెంకటభాను, శారీరిక ప్రముఖ్‌గా ఉజ్వల మార్గదర్శనం చేశారు. ★

# బాల జాగృతి

## తెలుసుకుందాం

### పజవంగడి వినాయక దేవాలయం

కేరళలోని తిరువనంతపురం నగర నడిబొడ్డునున్న తూర్పుకోట సమీపంలో ఈ ఆలయం కొలువుదీరింది. ఈ ప్రాంగణంలో అయ్యప్ప స్వామి, దుర్గాదేవి, నాగదేవత తదితర దేవుళ్ల మందిరాలు కూడా ఉన్నాయి. 32 రూపాలలో వినాయక విగ్రహాలు ఉండటం ప్రత్యేకత. వినాయక చవితి సందర్భంగా ఇక్కడ విశిష్ట పూజలు నిర్వహిస్తారు.



## కథ | గాడిద నీడ



అరబ్బు దేశంలో ఇబ్రహీం అనే పేదవాడు గాడిదను అద్దెకిచ్చి ఆ ఆదాయంతో జీవించేవాడు.

ఒకరోజు ఒక దూరదేశపు ప్రయాణికుడు ఆ గాడిదను అద్దెకు తీసుకున్నాడు.

ప్రయాణికుడు గాడిద మీద, ఇబ్రహీం గాడిద వెనకా బయలుదేరారు.

సూర్యుడు నడినెత్తికి వచ్చి, ఎండ తీవ్రంగా ఉంది.

వాళ్లు ప్రయాణం నిలిపి, ఒకచోట విశ్రమించారు.

గాడిద నీడలో ప్రయాణికుడు పడుకున్నాడు. ఇబ్రహీం మాత్రం ఎండలోనే ఉండిపోయాడు. ఎందుకంటే గాడిద నీడ ఇద్దరికి చాలదు కాబట్టి.

గాడిద నీడలో పడుకున్న ప్రయాణికుడు నిద్రలోనికి జారుకున్నాడు.

అప్పుడు ఇబ్రహీం తన గాడిదను కొంచెం అవతలికి తీసుకుపోయి, దాని నీడలో ఈసారి తాను పడుకున్నాడు.

ఎండవేడికి ప్రయాణికుడు లేచి చూస్తే

## పద్యము

నీచగుణములెల్ల నిర్మూలమైపోవు<br>
కొదవలేదు సుజన గోష్ఠి వలన<br>
గంధ మలద మేనికంపడగినయట్లు<br>
విశ్వదాభిరామ! వినుర వేమ!

**భావం:** సుగంధ భరితమైన చందనాన్ని శరీరానికి పూసుకుంటే దేహానికుండే దుర్గంధం ఎలా పోతుందో అలాగే సుజన గోష్ఠి వలన మనలోని చెడు గుణాలన్నీ దూరమైపోతాయి. అందుచేత సదా సజ్జన సాంగత్యాన్నే కోరుకోవాలి అని అర్థం.

## సూక్తిరత్నం

మౌనేన కలహం నాస్తి

ఉద్యోగే నాస్తి దారిద్ర్యం,<br>
జపతో నాస్తి పాతకం<br>
మౌనేన కలహం నాస్తి,<br>
నాస్తి జాగరతో భయమ్

**భావం:** పాటుపడే వారికి (కృషిచేసేవారికి) దరిద్రం, జపం చేసేవారికి పాపం ఉండవు. వివాదాలలో మౌనం వహించే వారికి కలహం, ముందు జాగ్రత్తలతో భయం ఉండవు.

## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| గోవా | నిస్సి |
| అరుణాచల్ ప్రదేశ్ | హిందీ |
| హరియాణా | మరాఠి |
| మహారాష్ట్ర | మలయాళం |
| కేరళ | కొంకణి |

సమాధానాలు : గోవా-కొంకణి; అరుణాచల్ ప్రదేశ్-నిస్సి; హరియాణా-హిందీ; మహారాష్ట్ర-మరాఠి; కేరళ-మలయాళం.

## భారత స్వాతంత్ర్య సమరయోధులు

### భగవత్ ఝా



ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, రాజకీయ నాయకుడు. బిహార్ ముఖ్యమంత్రిగా సేవలందించారు. నవంబర్ 28, 1922న బిహార్‌లోని గోడ్డా జిల్లాలో జన్మించారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నప్పుడు ఆయనకు 20 ఏళ్లే. ఉద్యమంలో భాగంగా అనేకసార్లు అరెస్టయ్యారు. ఒకసారి కాలికి కూడా బుల్లెట్ గాయమైంది. భగవత్ ఝా 2011లో తుదిశ్వాస విడిచారు.



గాడిద దూరంగా ఉంది.

దాని నీడలో ఇబ్రహీం నిద్రపోతున్నాడు.

ఆ ప్రయాణికుడికి కోపం వచ్చింది. వెంటనే అతన్ని లేపి తగాదా పెట్టుకున్నాడు.

'నేను నా గాడిదను మాత్రమే నీకు అద్దెకిచ్చాను. అంతేకానీ, దాని నీడను ఇవ్వలేదు' అన్నాడు ఇబ్రహీం.

ఇద్దరికీ మాటా మాటా పెరిగింది. కొట్టుకునే దాకా వెళ్లారు.

ఇంతలో గాడిద తన మీది బరువును కిందపడేసి ఎటో వెళ్లిపోయింది. ఆ ఇద్దరికీ తిక్క కుదిరింది. ★

## జనరల్ నాలెడ్జ్

1. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి (ఇంజినీర్స్ డే)ని ఎప్పుడు జరుపుకుంటారు?
2. ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయం ఎక్కడుంది?
3. ఇటీవల జి–20 సమావేశం ఎక్కడ జరిగింది?

జవాబులు : 1. సెప్టెంబర్ 15; 2. న్యూయార్క్; 3. శ్రీనగర్.

## మెదడుకు మేత

కాళ్లు, చేతులు లేని తెల్లదొరకు... బోలెడు దుస్తులు. ఏమిటిది?

జవాబు : ఉల్లిపాయ

## మంచిమాట

పుకార్లు వేగంగా ప్రయాణిస్తాయి. అయితే సత్యంవలె శాశ్వతంగా నిలబడవు!




# వారఫలాలు

05 - 11 జూన్ 2023



సింహంభట్ల సుబ్బారావు
6300674054

**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

ఆశ్చర్యకరమైన విషయాలు తెలుస్తాయి. ప్రముఖులు పరిచయం కొంత ఊరటనిస్తుంది. తీర్థ యాత్రలు చేస్తారు. ఆదాయం గతం కంటే ఆశా జనకంగా ఉంటుంది. పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తారు. చిన్ననాటి స్నేహితులు తారసపడతారు. వ్యాపారులకు అనుకున్న లాభాలు తథ్యం. ఉద్యోగులకు ఈతిబాధలు తొలగుతాయి. పారిశ్రామికవేత్తలు, కళాకారులు ప్రతిభ చాటుకుంటారు. 5,6 తేదీలలో వృథా ఖర్చులు. అనారోగ్యం.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

ఆదాయం కంటే ఖర్చులు పెరిగినా సర్దుబాటు చేసుకుంటారు. ఆస్తుల వ్యవహారాలు కొలిక్కి వస్తాయి. సోదరులు, స్నేహితులతో మరింత ఉత్సాహంగా గడుపుతారు. మీ అంచనాలు నిజమై ఊపిరి పీల్చుకుంటారు. కాంట్రాక్టర్ల కృషి ఫలిస్తుంది. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. ఉద్యోగులకు అనుకూల సమాచారం. పారిశ్రామిక, 6,7 తేదీలలో బంధువులతో విరోధాలు. శారీరక రుగ్మతలు.

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

కొత్త కార్యక్రమాలు చేపడతారు. ఆత్మీయులనుంచి శుభ వర్తమానాలు. అదనపు ఆదాయం సమకూరి అవసరాలు తీరతాయి. నిరుద్యోగుల ఆశలు ఫలించే సమయం. మీ నిర్ణయాలలో కుటుంబసభ్యులు భాగస్వాములవుతారు. వ్యాపారులకు అధికంగా లాభాలుదక్కవచ్చు. ఉద్యోగులకు పైపోస్టులకు ప్రమోషన్లు దక్కుతాయి. రాజకీయవేత్తలు, కళా కారులకు నూతనోత్సాహం. 9,10 తేదీలలో వృథా ఖర్చులు. కుటుంబసమస్యలు.

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

ఆశించిన రాబడి మరింత ఉత్సాహాన్నిస్తుంది. ప్రముఖులు మీకు వెన్నంటి నిలుస్తారు. చిన్ననాటి విషయాలు గుర్తుకు తెచ్చుకుంటారు. సోదరులు, సోదరీలతో వివాదాలు పరిష్కారమవుతాయి. దూరమైన ఆప్తులు తిరిగి దగ్గరకు చేరతారు. వ్యాపారులు మరిన్ని లాభాలు పొందుతారు. ఉద్యోగులకు పనిభారం తగ్గుతుంది. పారిశ్రామిక వేత్తలు లక్ష్యాలు సాధిస్తారు. 5,6 తేదీల్లో ధననష్టం. కుటుంబంలో చికాకులు.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

సన్నిహితులు, స్నేహితులతో ఉత్సాహంగా గడుపుతారు. కొన్ని వేడుకలకు హాజరవుతారు. ఆదాయం ఆశాజనకంగా ఉంటుంది. స్థిరాస్తి వివాదాల పరిష్కారం. నూతన ఉద్యోగాలు దక్కుతాయి. వ్యాపా రులకు కొత్త ఆశలు. ఉద్యోగులు పనిభారం తొలగి ఊరట చెందుతారు. రాజకీయ వేత్తలు, కళాకారులకు పరిస్థితులు అనుకూలిస్తాయి. 6,7 తేదీల్లో వృథా ఖర్చులు.

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

పట్టుదలతో చేపట్టిన కార్యక్రమాలు పూర్తి చేస్తారు. ఆత్మీయులు మరింత చేరువ కాగలరు. ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. సన్నిహితులతో వివాదాలు సర్దుబాటు చేసుకుంటారు. కుటుంబంలో శుభకార్యాలు నిర్వహిస్తారు. ఉద్యోగులకు మరిన్ని అవకాశాలు దక్కుతాయి. రాజకీయ వేత్తలకు నూతనోత్సాహం. 8,9 తేదీలలో అనుకోని ప్రయాణాలు. శారీరక రుగ్మతలు.

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

కొన్ని కార్యక్రమాలు అప్రయత్నంగా పూర్తి కాగలవు. రాబడి సంతృప్తికరంగా ఉంటుంది. సన్నిహితులతో రాజీమార్గం అనుసరిస్తారు. ఆరోగ్యం కొంత మందగించినా ఉపశమనం పొందుతారు. వ్యాపారులకు పెట్టుబడులు సమకూరుతాయి. ఉద్యోగులు నైపుణ్యాన్ని ప్రదర్శిస్తారు. పారిశ్రామిక వేత్తలు, కళాకారులు మరిన్ని విజయాలు సాధిస్తారు. 7,8తేదీలలో కష్టానికి ఫలితం ఉండదు. చోరభయం.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

ఆదాయానికి మించిన ఖర్చులు తప్పవు. అనుకున్న కార్యక్రమాలలో ఆటంకాలు. బంధువులు, స్నేహితులతో తగాదాలు. పోటీ పరీక్షల్లో ఫలితాలు సంతృప్తి నివ్వవు. తరచూ ప్రయాణాలు చేస్తారు. సోదరీలు, సోదరీల నుంచి ఒత్తిడులు పెరుగుతాయి. వ్యాపారులు నిర్ణయాలలో నిదానం పాటించాలి. పారిశ్రామిక వేత్తలు, కళాకారుల ప్రయత్నాలు ఫలించవు. 9,10 తేదీల్లో శుభవర్తమానాలు. ధనలబ్ధి.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

పరిచయాలు పెరుగుతాయి. నూతన కార్యక్రమాలు చేపడతారు. ఆలోచనలు అమలులో ముందుంటారు. రాబడి కొత్త ఉత్సాహాన్నిస్తుంది. విద్యార్థులు కోరుకున్న అవకాశాలు సాధిస్తారు. ఇంటి నిర్మాణాల్లో కదలికలు ఉంటాయి. వాహనసౌఖ్యం. ఉద్యోగులకు సంతోషకరమైన విషయాలు తెలుస్తాయి. కళాకారులు లక్ష్యాలు సాధిస్తారు. 10,11 తేదీలలో దుబారా ఖర్చులు. దూరప్రయాణాలు.

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

అనుకున్న కార్యక్రమాలలో విజయం సాధిస్తారు. విద్యార్థులకు అనుకూల ఫలితాలు. సభలు, సమావేశాలలో పాల్గొంటారు. బాకీలు సైతం వసూలవుతాయి. బంధువులు, స్నేహితులతో వివాదాలు తీరతాయి. కాంట్రాక్టర్ల అంచనాలు నిజమవుతాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు. ఉద్యోగులు విధుల్లో సత్తా చాటుకుంటారు. 8,9 తేదీలలో శారీరక రుగ్మతలు. బంధువిరోధాలు.

**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

ప్రారంభంలో నెలకొన్న సమస్యలు క్రమేపీ తీరతాయి. ఆదాయం గతం కంటే మెరుగ్గా ఉంటుంది. సన్నిహితులతో మంచీచెడ్డా విచారిస్తారు. దూరపు బంధువుల రాక. వ్యాపారులకు పెట్టుబడులు సమకూరతాయి. ఉద్యోగులకు ప్రమోషన్లు రావచ్చు. పారిశ్రామికవేత్తలు, కళాకారులు విశేష గౌరవం పొందుతారు. 10,11 తేదీలలో శారీరక రుగ్మతలు. మానసిక ఆందోళన.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

దీర్ఘకాలిక రుణబాధల నుంచి క్రమేపీ బయట పడతారు. అనుకున్న కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేస్తారు. బంధువులు, ఆత్మీయుల నుంచి శుభవార్తలు అందుతాయి. కార్యక్రమాలలో కొంత అనుకూలత. భూవివాదాలు పరిష్కారదశకు చేరతాయి. విలువైన వస్తువులు కొంటారు. వ్యాపారులకు లాభాలు అందుతాయి ఉద్యోగులు కోరుకున్న హోదాలు దక్కించుకుంటారు. పారిశ్రామికవేత్తలకు విదేశీ పర్యటనలు. 5,6 తేదీలలో వృథా ఖర్చులు. అనారోగ్యం.

# పదరసం-418

## ఆధారాలు

**అడ్డం**

1. ఆంధ్రకవితా పితామహుడి ఇంటి పేరు (4)
3. మహాభారతాన్ని ఇలానూ అంటారు (5)
6. అర్చన లాంటిదే (2)
7. వివేకం కలవాడు (3)
9. రంగనాథుడి ఏకవచనం (3)
14. తాపీ ధర్మారావు మారుపేరు (3)
15. అలనాటి సాహిత్య పత్రిక (3)
16. ధర, మూల్యం (2)
17. పల్లకీ లాంటిదే (2)
19. కన్నేసి ఉండడం (2)
20. సంబరం, ఉత్సవం (3)
22. గుర్రం (3)
24. కరుణకు మరో పేరు (2)
25. తాత తండ్రి (3)
27. వర్షం (2)

**నిలువు**

1. కవి, చిత్రకారుడు బాపిరాజు ఇంటిపేరు (3)
2. శ్రీకృష్ణుడి తమ్ముడు (3)
3. పావురం జైలు (3)
4. భర్తే, మగాడు హ్రస్వమైతే (3)
5. హారంతో శిక్ష (3)
8. గూఢచారి (2)
10. సింహాసనం (2)
11. సుభాస్ చంద్రబోస్ బిరుదు (3)
12. బ్రహ్మమానస పుత్రుడు (4)
13. ఆలయం (3)
17. షిల్లాంగ్ ఈ రాష్ట్ర రాజధాని (4)
18. కాశీనాథుని నాగేశ్వరరావుపంతులు బిరుదు (4)
20. వేదాంతం తెలిసినవాడు (3)
21. వానరసేనను ఇలానూ అనొచ్చు (4)
23. వ్యాయామం (2)
24. పాలుతోడుపెడితే...పెరుగే...(2)
26. పేరు ముందు గౌరవ వాచకం (1)

**మా చిరునామా : పదరసం, జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-27**

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | ✠ | 3 | | 4 | | 5 |
| | ✠ | | ✠ | 6 | జ | ✠ | | ✠ | |
| 7 | 8 | | ✠ | ✠ | 9 | 10 | | ✠ | |
| ✠ | | ✠ | 11 | ✠ | ✠ | | ✠ | 12 | ✠ |
| 13 | ✠ | 14 | | | ✠ | ✠ | 15 | | |
| 16 | | ✠ | | ✠ | 17 | | ✠ | | ✠ |
| | ✠ | 18 | ✠ | 19 | | ✠ | 20 | | 21 |
| ✠ | 22 | | | ✠ | | ✠ | | ✠ | |
| 23 | ✠ | | ✠ | 24 | | ✠ | | ✠ | |
| 25 | | | ✠ | | ✠ | 26 | ✠ | 27 | |

**పదరసం - 418**

పేరు : ..................................................................................

చిరునామా:..................................................................................

..................................................................................

పిన్‌కోడ్ : .................. మొబైల్ : ..................................................

**సమాధానాలను** పైగడులలో పూరించి, కత్తిరించి కవర్‌పై పదరసం నెం. వేసి 2023 జూన్ 19 లోగా జాగృతికి పంపండి. సరైన సమాధానాలు రాసిన వారిని విజేతలుగా ప్రకటిస్తాం. ఒకరిని లాటరీ ద్వారా ఎంపికచేసి నగదు బహుమతి అందచేస్తాం. తుది నిర్ణయం జాగృతి యాజమాన్యందే.

## పదరసం - 414 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ✠ | 1 సు | 2 ర | వ | 3 రం | ✠ | 4 మ | 5 హో | క | 6 వి |
| 7 రా | ✠ | వం | ✠ | గు | ✠ | ✠ | రం | ✠ | శ్వ |
| 8 మ | త్రి | ✠ | 9 పా | లు | ✠ | 10 వ | ✠ | 11 నా | నా |
| దా | ✠ | 12 కాం | ✠ | ✠ | 13 పా | రా | టి | ✠ | థ |
| 14 సు | 15 ధ | తి | ✠ | ✠ | ✠ | హా | ✠ | 16 రో | ✠ |
| ✠ | 17 గా | మ | డు | ✠ | 18 పా | మి | ✠ | 19 జా | 20 గు |
| 21 వ | ✠ | తి | ✠ | 22 తా | ✠ | 23 హి | ముం | ✠ | ర |
| 24 డ | బ్బు | ✠ | 25 అ | ర | 26 కొ | ర | ✠ | 27 కూ | జా |
| మ | ✠ | 28 తో | ✠ | ✠ | ర | ✠ | 29 నా | ✠ | డ |
| 30 ర | వి | వ | ర్మ | ✠ | 31 వి | దు | రు | డు | ✠ |

**విజేతలు :** రామగిరి లక్ష్మియవనిక, వి.పద్మారంగనాథ్, ఆర్.వి.సి. హెచ్.నాగేశ్వర్రావు, ఎస్.పూర్ణకుమారి, ఎస్.రాజ్యలక్ష్మి, వనమాల రామలింగాచారి, వారణాసి సరస్వతి, బాదంవైష్ణవీ, కె.సుశీల, చెరుకు మహేశ్వరశరమ, రాయపెద్ది అప్పాశేషశాస్త్రి, నాగుల రాజేందర్‌గౌడ్, కొండూరి ప్రవీణ, తంగెళ్లపల్లి మమన్‌బాబు, పి.శాంత కుమారి, కుచ్చులకంటి అరవింద్, గడియారం వెంకట లక్ష్మమ్మ, రాపాక అరుణ, కె.సత్యనారాయణ, రుద్రభట్ల సుగుణరాజారాం, నాయనిరాములు, సి.గిరిజాశంకర్, టి.ఎస్.ఆర్. ఆంజనేయులు, మేడవరపు నాగలక్ష్మి.

**ఈ వారం విజేత : ఎస్.భవ్యశ్రీ, ఒంగోలు, ఆంధ్రప్రదేశ్**




అరుణ



తెలుగు సినిమా రంగానికి సంక్రాంతి తర్వాత వచ్చే పెద్ద సీజన్ వేసవి! పిల్లలకు ఏప్రిల్ నాటికి పరీక్షలు అయిపోతాయి. విద్యాసంస్థలకు శలవులు ప్రకటిస్తారు. అందరూ హాలిడే మూడ్‌లో ఉంటారు. కాబట్టి ఈ సమయంలో భారీ బడ్జెట్ చిత్రాలను విడుదల చేస్తే విజయానికి ఢోకా ఉండదని చాలామంది దర్శక నిర్మాతలు భావిస్తుంటారు. కానీ ఈసారి వేసవి వెలవెలబోయింది. ఏప్రిల్, మే నెలల్లో పేరున్న కథానాయకుల భారీ చిత్రాలేవీ విడుదల కాలేదు. యువ కథానాయకుల సినిమాలు కొన్ని విడుదలైనా... అవి ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను మెప్పించలేదు.

# 'ఆదిపురుష్' పైనే ఆశలన్నీ!

సంక్రాంతికి సీనియర్ హీరోలు చిరంజీవి, బాలకృష్ణ చిత్రాలు విడుదల కావడంతో క్రేజీ యంగ్ హీరోస్ మూవీస్ వేసవి కాలంలో వస్తాయని చాలామంది అనుకున్నారు. కానీ అలా జరగలేదు. మన యువ కథానాయకులు కొంతకాలంగా ఆచితూచి అడుగులు వేస్తున్నారు. కొందరైతే సినిమాను పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభించినా... షూటింగ్‌కు పచ్చజెండా ఊపడం లేదు. 'ఎంత ఆలస్యమైనా ఫర్వాలేదు... స్క్రిప్ట్ పక్కాగా ఉండాల్సిందే' అంటున్నారు. ఓ రకంగా ఇది మంచిదే. అయితే అదే సమయంలో ఇలా సాచివేత ధోరణితో ఉంటే... ప్రేక్షకులలోనూ, అభిమానుల్లోనూ ఆయా ప్రాజెక్టులపై ఆసక్తి సన్నగిల్లిపోతుంది. వరుసగా సినిమాలు చేసుకుంటూ ఒకటో రెండో పరాజయాలు చవిచూసినా... ముందుకు పోతుండటం ఓ పద్ధతి. మొన్నటి వరకూ అందరూ దీనినే అనుసరించారు. కానీ ఇప్పుడు పరాజయాన్ని అంగీకరించడానికి చాలామందికి మనసు రావడం లేదు. చిరంజీవి నటించిన గత కొన్ని సినిమాలు ఆశించిన స్థాయిలో ఆడలేదు. ఆ మధ్య వచ్చిన 'ఆచార్య' పరిస్థితి మరీ దారుణం. అయినా చిరంజీవి అక్కడితో ఆగిపోకుండా సినిమాలు చేస్తూ వెళుతున్నారు. దానివల్లే 'వాల్తేరు వీరయ్య'తో సక్సెస్ ట్రాక్ ఎక్కారు. రవితేజ కూడా జయాపజయాలను పట్టించుకోకుండా సినిమాలు చేసుకుంటూ వెళుతున్నాడు. కానీ ఈ దారిలో నడుస్తున్నవారు అరుదు. ఆ కారణంగానే ఈ వేసవి సీజన్‌లో స్టార్ హీరోస్ సినిమాలు ఆశించిన స్థాయిలో రాలేదు, రావడం లేదు. అయితే... వీటన్నింటికీ ఒకే ఒక్క మినహాయింపు 'ఆదిపురుష్' చిత్రం.

'బాహుబలి'తో పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగిన ప్రభాస్‌కు ఆ తర్వాత వచ్చిన ఏ సినిమా కూడా ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. అయినా ప్రభాస్ వరుసగా పాన్ ఇండియా సినిమాలు చేస్తూ ముందుకు వెళుతున్నాడు. రకరకాల కారణాల వల్ల ఆ యా చిత్రాల నిర్మాణంలో జాప్యం జరిగింది. 'ఆదిపురుష్' విషయంలోనూ అదే అయ్యింది. ఎప్పుడో జనం ముందుకు రావాల్సిన ఈ సినిమా ఇప్పుడు జూన్ 16న ఐదు భాషల్లో రాబోతోంది. 'ఆదిపురుష్' సినిమా ప్రకటించినప్పుడు దానికి సూపర్ క్రేజ్ వచ్చింది. ఓమ్ రౌత్ ట్రాక్ రికార్డ్ చూసి, తొలిసారి ఉత్తరాదికి చెందిన దర్శక నిర్మాతలతో ప్రభాస్ పాన్ ఇండియా సినిమా చేస్తున్నాడని అందరూ ఆనందపడ్డారు. కానీ ఆ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్స్, టీజర్‌తో తీవ్ర నిరాశకు గురయ్యారు. ఓ పథకం ప్రకారం ప్రభాస్‌కు ఉత్తరాది చిత్రసీమ వారు వెన్నుపోటు పొడుస్తున్నారేమో అనే సందేహాన్ని కూడా అతని డైహార్డ్ ఫ్యాన్స్ వ్యక్తం చేశారు. అయితే, ఎవరూ ఏ సినిమానూ ఫ్లాప్ చేయాలని తీయరు. కోట్లు ఖర్చు పెట్టి దారుణమైన సినిమాలు తీయాలని అనుకోరు. కానీ 'ఆదిపురుష్'కు ఆదిలోనే హంసపాదు ఎదురైంది. రామకథ ఎంత మధురమైనదో అందరికీ తెలిసిందే. కాబట్టి ఆ కథను కన్నుల పండువగా అందించాలని భావించి తగిన సమయం తీసుకుని 'ఆదిపురుష్'ను అత్యంత సుందరంగా త్రీడీలో తీర్చిదిద్దాడు. తాజాగా వస్తున్న ప్రచార చిత్రాలు, పాటల వీడియోలు చూస్తుంటే ఈ విషయం అర్థమవుతోంది. ప్రధాన పాత్రధారుల వేషధారణలో కొందరికి కొన్ని అభ్యంతరాలు ఉన్నా... మొత్తంగా 'ఆదిపురుష్' ద్వారా ఓం రౌత్ భారతీయులకు, అంతర్జాతీయ సినీ వీక్షకులకు ఎలాంటి సందేశాన్ని ఇవ్వబోతున్నాడన్నదే ప్రధానం.

## తెలుగులో భారీ మొత్తానికి హక్కులు!

ప్రభాస్ గత రెండు సినిమాలు 'సాహో, రాధే శ్యామ్' బాక్సాఫీస్ దగ్గర దారుణంగా బోల్తా పడ్డాయి. అయినా అతని తాజా చిత్రం 'ఆదిపురుష్'కు క్రేజ్ ఏ మాత్రం తగ్గలేదు. ఈ సినిమా తెలుగు హక్కుల్ని పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ సంస్థ రూ. 170 కోట్లకు సొంతం చేసుకుందనే వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. 'పంపిణీ హక్కులు తాము తీసుకున్నది వాస్తవమే' అని నిర్మాణ సంస్థకు చెందిన వివేక్ కూచిభొట్ల స్పష్టం చేశారు కానీ ఎంత మొత్తానికి తీసుకున్నది ఆయన ప్రకటించలేదు. ఏదేమైనా 'ఆదిపురుష్' తెలుగు హక్కులకు భారీ మొత్తాన్ని చెల్లించారనేది నిజం. ఇదే సమయంలో గమనించాల్సిన విషయం ఏమంటే... పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ సంస్థే ప్రస్తుతం ప్రభాస్, డైరెక్టర్ మారుతీ కాంబినేషన్‌లో ఓ హారర్ కామెడీ మూవీని నిర్మిస్తోంది. కాబట్టి... తమ చిత్రాన్ని భారీ స్థాయిలో విడుదల చేయాలన్నా, బిజినెస్ చేయాలన్నా... 'ఆదిపురుష్'ను అగ్రస్థానంలో నిలబెట్టడమనేది ఈ సంస్థకు అవసరం.

గడిచిన రెండు నెలల్లో డబ్బింగ్ తో కలిసి యాభై సినిమాలు విడుదలయ్యాయి. అందులో 'విరూపాక్ష' ఒక్కటే చెప్పుకోదగ్గ విజయాన్ని అందుకుంది. రవితేజ 'రావణాసుర', సమంత పాన్ ఇండియా మూవీ 'శాకుంతలం', అఖిల్ 'ఏజెంట్', మణిరత్నం 'పీ.ఎస్.-2', గోపీచంద్ 'రామబాణం', నరేశ్ 'ఉగ్రం', నాగచైతన్య 'కస్టడీ' ఇవేవీ ఆశించిన స్థాయిలో ఆడలేదు. పైగా ఈ యేడాది తెలుగు నుండే దాదాపు పాతిక పాన్ ఇండియా సినిమాలు రాబోతున్నాయి. ఈ నేపథ్యంలోనూ, 'శాకుంతలం, ఏజెంట్' పరాజయం పాలైన కారణంగానూ... అందరి దృష్టీ ఇప్పుడు 'ఆదిపురుష్' పైనే ఉంది. భారతీయుల జీవితాలతో పెనవేసుకుపోయిన ఈ రామగాథ వెండితెరపై విజయాన్ని అందుకుంటే.. ఈ యేడాది రాబోతున్న తెలుగు పాన్ ఇండియా చిత్రాలకూ ఊపిరి పోసినట్టు అవుతుంది.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

# మారిషస్‌లో సావర్కర్ ప్రతిమ




ఎక్కడో ఉంది మారిషస్. ఈ మే 28వ తేదీన ఆ దేశ రాజధాని పోర్ట్ లూయిస్ భారతమాతాకీ జై, సావర్కర్ అమర్ రహే వంటి నినాదాలతో మార్మోగింది. ఆ రోజున ఆ నగరంలో త్యాగానికీ, ధైర్యానికీ మారు పేరైన వినాయక్ దామోదర్ సావర్కర్ విగ్రహావిష్కరణ జరిగింది. అంటే మన కొత్త పార్లమెంట్‌లో ఆయన 140వ జయంతికి నివాళి ఘటించిన సందర్భంగానే ఆ దేశంలోను ఆ మహనీయుడి విగ్రహాన్ని ప్రతిష్టించారు. అక్కడి మహారాష్ట్ర ఫెడరేషన్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ విగ్రహాన్ని ఆ దేశ అధ్యక్షుడు పృథ్వీసింగ్ రూపన్ ఆవిష్కరించారు. పోర్ట్ లూయిస్‌లో ఇప్పటికే 13 అడుగుల ఎత్తయిన శివాజీ మహరాజ్ ప్రతిమ కూడా ఉంది. 'మారిషస్‌లో మా తాతగారు సావర్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన సంగతి విని సంతోషించాం. ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా వారి బోధనలు, ఆలోచనలను అంగీకరిస్తున్నారు. తాను ఏ మతానికీ వ్యతిరేకం కాదని చెప్పేవారు. హిందువులు ఇతర దేశాల ప్రజలతో సమంగా అభివృద్ధి చెందాలని చెప్పేవారు. మాతృభూమి గర్వపడేలా ఉండాలని బోధించేవారు' అని ఆయన మనుమడు రంజిత్ వ్యాఖ్యానించారు.



From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2021-2023; RNI Regd. No. 3270/57.
Volume : 75 Issue : 33

# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు




వెల : ₹.220/-




వెల : ₹.200/-




వెల : ₹.390/-




వెల : ₹.300/-




వెల : ₹.200/-




వెల : ₹.200/-




వెల : ₹.200/-




వెల : ₹.200/-




వెల : ₹.250/-




వెల : ₹.250/-




వెల : ₹.599/-




వెల : ₹.695/-




వెల :₹.799/-




వెల : ₹.799/-




వెల : ₹.549/-

## పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : 3-4-852, కేశవనిలయం, బర్కత్‌పురా, హైదరాబాద్ -27.
040-27563236, 9290127329

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, గవర్నరు పేట, విజయవాడ - 2, దూరవాణి : 63035 41244